UNIVERSAL
LIBRARY
OU_204850
UNIVERSAL
LIBRARY

# భోజకాళిదాసు

(అష్టాంకసమేతము)

గ్రంథకర్త:

స్వరాజ్యరథము, సతీ అనసూయ, రంగూన్ రౌడి, భీష్మబ్రహ్మచారి,
గంగావతరణము, ధరణికోట, మహాభక్తవిజయము ఇత్యా
ద్యనేకనాటకకర్తలగు దేశముఖు, దేశపాండ్యా,

**సోమరాజు రామానుజరావుగారు.**

ప్రకాశకుడు:

**కురుకూరి సుబ్బారావు, ప్రొ.**

సరస్వతీ బుక్ డిపో, బెజవాడ.

ముద్రితప్రతులు: 1,000.

ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
ఎక్. కోదండరామయ్యగారిచే ముద్రితము.

1932.

కాపీరైటు] [వెల రు 1—0—0.

Checked 1969

# హెచ్చరిక.

ఏనటకులుగాని ఈనాటకమును మా వ్రాతమూలకమైన యధికారపత్రమును పొందనిదే నాట్యరంగమున ప్రదర్శింపరాదు. అట్లు అతిక్రమించినయెడల సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని యిందుమూలముగా తెలియపఱ్చడమైనది.

ఇట్లు,

కురుకూరి సుబ్బారావు,

15—9—1932. ప్రొప్రయిటరు, సరస్వతీ బుక్ డిపో, బెజవాడ.

# విన్నపము.

ఇప్పటికి షుమారు 8 సంవత్సరములకుఁ బూర్వ మీగ్రంథము రచింపఁబడినను బహుకారణాంతరములచే నేటివఱకు ముద్రింపఁబడు నదృష్టము గనదయ్యెను. ప్రస్తుతము ఆంధ్రదేశనాట్యరంగమున ప్రదర్శింపఁబడుచున్న కాళిదాసనాటకమునకును ఈ నాటకమునకును విశేషభేదము కాన్పించుచున్నది. ఐనను, మనదేశమునందు పూర్వమునుండియు అనుశ్రుతముగా వచ్చుచున్న కథ యిదియే యని ప్రాజ్ఞులెఱుంగకపోరు. ప్రదర్శింపఁబడుచున్న కాళిదాసనాటకము కన్నడనాట్యరంగమునఁ బ్ర[illegible]మునకు ఫక్కిఁ బోలియున్నది. ఏదినిజమైనను మొత్తముమీఁద [illegible]రాజుల సమకాలికత్వమునందును, కాళిదాసుని కవితావిశేషమునందును, [illegible]నితని మీఁదిన మహత్త్వమునందును సందేహములేదు. చరిత్ర[illegible]గురు కాళిదాసులు ప్రత్యేక ప్రత్యేక కాలములందు ఖ్యా[illegible]యును ఈ కాళిదాసు వారిలోనొకఁడని [illegible], శాకుంతలాది కావ్యములను రచించిన కాళిదా[illegible]! మనకథకు సంబంధించిన కాళిదాసచరిత్రమునే యిందు పొందుపరచి, నే నాచర్యుఁ బూనుకొననైతిని.

తొలుత నిందు రెండవయంకముగా ముకుందరాజ్యకాంక్షయు, భోజునరాజ్యప్రాప్తియుఁ గూడ రచించియుంటిని. కాని గ్రంథవిస్తరభీతిచే, ముద్రణమునం దయ్యంకమును సంపూర్ణముగ వదలితిని. కొంత విపులీకరించి దానిని భోజనాటకనామమున వేఱొక నాటకముగాఁ బ్రకటించు తలఁపు గలదు.

ప్రదర్శకులకు గ్రంథము బాహుళ్యముగనున్నట్లు తోఁచినయెడల ప్రథమాంకమునందలి మొదటి రంగములును తృతీయాంకారంభము మొదలు 48 వ పుటలోని భోజరాజు ప్రవేశమువఱకును సప్తమాంకమంతయును వదలదగును. సరసులగు పాఠకులు గుణగ్రహణముచేసి, దోషములను మన్నింతురని ప్రార్థించుచున్నాను.

బెజవాడ,
8—9—32.

ఇట్లు బుధవిధేయుఁడు,
సోమరాజు రామానుజరావు,
గ్రంథకర్త.

# ఇందలి పాత్రలు.

## పురుషులు.

1. భోజరాజు
2. కాళిదాసు (కాళిగాఁడు)
3. మేధానిధి
4. ధర్మవర్ధనుఁడు
5. కొందఱు దొమ్మరులు
6. ఏకసంతగ్రాహి
7. ద్విసంతగ్రాహి
8. త్రిసంతగ్రాహి
9. ఒక నిరుపేదకవి
10. బుద్ధిసాగరుఁడు
11. విలాసకుఁడు
12. ఒక సాలెవాఁడు
13. ఒక బ్రాహ్మణుఁడు
14. దండికవి
15. చిత్రకారుఁడు.

## స్త్రీలు.

1. విలాసవతి (వేశ్య)
2. శారద (కాళిదాసుభార్య)
3. లీలావతి (భోజునిభార్య)
4. తరంగవతి (పరిచారిక)

# భోజకాళిదాసు.

## ప్రథమాంకము.

### 1. రంగము — మేధానిధి మందిరము.

ప్రవేశము:— దక్షిణతాంబూలాదులను గురుపాదములకడ నుంచి నమస్కరించు
రాజపుత్రికయగు శారదయు, ఆసనస్థుడైన గురుడు
మేధానిధియు యథాస్థానములఁ గాన్పింతురు.

శార— మహాత్మా!

సీ॥ చిన్ననాటనుగోలె శిష్యవాత్సల్యతను
గాంచి ప్రియమెడసి మన్నించినారు;
వివిధవిద్యలచే వివేకవతిఁ జేసి
నను యశోవతిగ నొనర్చినారు;
సాటిరాజసుతలందు సమతు లేని సుకీర్తి
గాంచు భాగ్యంబుఁ గల్పించి
కవిలోకనఁ గపటరహితవర్తనంబునఁ
దేటగా విద్యలఁ దెల్పినారు;
పరిణతవయస్క నగుట మీ పాదపద్మ
సేవ విడి యంతిపురంబుఁ జేరు మనుచు,
పితరు లానతియ్య; నో విమలచరిత!
కలుగ దిఁక మిముఁ గొల్చు భాగ్యంబు నాకు.

ఆ॥ విలువలేని దివ్య విద్యాధనంబు, నా
కొసఁగినారు, మీర లో మహాత్మ!
శశికి నూలుపోగుచందాన, నే నిదు
కానుకలకుఁ దృప్తిఁ గాంచుఁడయ్య!

మేధా—(స్వగతము) ఈబాల పుష్పవతియైననాటంగోలె నెన్నఁడో యొకనాఁ డిట్టి శాశ్వతవియోగము సంభవించు నని నేఁ దలఁచుచున్నట్లే జఱిగినది. ఎన్నియోసారులు జిహ్వాగ్రమునకు వచ్చిన మాటనే, లజ్జపెంపునను సాహసము లేమిని నామనోగతాభిప్రాయమును నామనస్సునందే యణఁచియుంచితిని. కాని నేఁ డిఁక బహిర్గత మొనరింపక తప్పదు. లజ్జాపిశాచమా! నన్ను క్షణకాలము విడిచిపొమ్ము. సాహసమా! తత్ప్రదేశము నీ వాక్రమింపుము!

శార—మహాత్మా! నా మాటకు మారాడకయుంటి రేల? మిమ్ము చింతాసాగరమున ముంచిన యభిప్రాయ మేమై యుండును? దాని నెఱిఁగించి నన్నుఁ గృతార్థురాలిం గావింపుఁడు. అల్పజ్ఞానసమేత నగు నేఁ దెచ్చిన యీకానుకలు దేవరవారిహృదయమునకు సంతృప్తిని గలిగింపవయ్యెనా?

చ॥ తమయభిలాషముం దెలిపి ధన్యనుగా నొనరింపుఁడో కృపా
సముదయమూర్తి! యీధనము సమ్మతి నీయద యేని నగ్రహా
రములో? యమూల్యవస్త్రగను రత్నచయంబులో? సౌధరాజియో?
కామరగుగోసహస్రములో? కోరుఁడు తప్పక తీర్తునన్నియున్! 3

మేధా—బాలారత్నమ! తుచ్ఛం బగుధనముకొఱకు ఆశపడుచుంటి నని తలఁచుచుంటివా?

శార—గురువర్యా! కానిచోఁ దమయాలోచనంబునకుఁగాని, నాదక్షిణలను స్వీకరించుపట్ల ననుమానమునకుఁగాని హేతు వేమి? నే నెఱుఁగఁదగనిదియా?

మేధా—నీ వలన నెఱవేర్పఁబడఁదగిన కార్యము నీ వెఱుఁగకుండ నెట్లు నెఱవేరఁగలదు ?

శార—అట్లయిన నా కెఱిఁగింప సందేహించెద వేల?

మేధా—సందేహ మేదియు లేదు ; కాని—

శార—ఆర్యా ! —"కాని" యని పల్కి మిన్నకున్న తమయుక్తి యే సందేహమును స్పష్టపరచుచుండుట లేదా ?

మేధా—నా సందేహ మున్నమాట వాస్తవమే!

శార—మహాత్మా! నిష్కళంకమగు నస్మద్గురుభక్తియందే తమకు సందేహమా! చిరకాలమునుండియు నన్నెఱింగియున్నను మత్ప్రవర్తనము తమకు సందేహాస్పద మయ్యెనా ?

మేధా—రాజపుత్రీ! నిష్కళంక మగు గురుభక్తి గలదాన వగుట చేతనే వెనుకముందు లారయక కేవలము గురుభక్తి ప్రోత్సహింప 'నెట్టి కోరికనైనను దీర్చెద' నని పల్కితివి. కాని, నిజముగా నాయభిమతము నెఱింగినపిదప, మాటఁ దప్పుదువేమో యని, సందేహించుచున్నాను.

శార—(స్వగ.) ఏమిది ? ఎన్నఁడును లేనిరీతి నీతని సంభాషణము నేఁడిట్లు విపరీత వైఖరిని సూచించుచున్నది. మఱి యేదియైన దుశ్చింతన గల్గియుండఁడుగదా! (ప్రకా.) గురువర్యా! తమయభిమత మెఱింగినపిదప, మాట దప్పవలసి వచ్చునేమో యని భీతి నాకు ఆవంతయును లేదు. ఏమందు రేని—

ఉ॥ చిన్నటనాఁటఁగోలె కడుఁ బ్రేమి కూరిమి నాదరించుచున్
మన్ననతోడ, న, న్నుచితమార్గములందుఁ బ్రవేశపెట్టి యె
న్నెన్నియొ నీతులం గఱపి యిప్పుడ ధర్మము గోరఁబోరు; యే
మున్నను మీరు వాంఛితము యుక్తమెయైన నెడఁ దీర్పఁజాలనే?

కావున, సంశయింపక శీఘ్రముగ నెఱిఁగింపుఁడు.

మేధా—(స్వగ) ఓహో! ముందుగనే యీబాలిక ముందరికాళ్ళకు బంధము వేయ నారంభించినదే! ఏది యెట్లైనఁ గానిమ్ము, ఇంతవఱకువచ్చినప్పుడు వెనుకంజవేయుదునా? (ప్రకాశ) ఓత్రిలోకమోహినీ! బ్రాహ్మణనీతి పరోపదేశమునకే కాని, స్వాచరణమునకుఁ గాదనుమాట నెఱుంగవా? కావున నేను గురుండనై నీ కుపదేశించిననీతుల నాచరణమునం బెట్టుటకిది తరుణము కాదు! నాయభిమతం బెట్టిదైనఁ దీర్చెద నని పల్కితివి. ఆడితప్పని, సద్వంశమునం బుట్టినదానవు; కావున నాకోరిక నెఱింగింప సిద్ధప్రయత్నుఁడనైతిని.

శార—(స్వగ) ఓహో! ఈయన తనహృదయమును, మఱింతస్పష్టపఱచుచున్నాఁడే! ఏమిచేయుదును? సందేహము లేదు. ఇతఁడు, యుక్తవయస్కనగు నన్నుం గాంచి, దుస్సంకల్పముఁ గల్గియున్నాఁడు. కటకటా! ఎంతవిపరీతము? గురుఁడే యిట్టి దుర్బుద్ధిఁ గలవాఁడైన నింకేమున్నది? ఓజగన్మాతా! శారదా! ఇప్పట్టున నీవే దిక్కు. శీలభంగము గాకుండ నన్ను రక్షింపుము.

మేధా—రూపవిద్యావిశారదా! శారదా! నామాట కుత్తరమీయక, నీలో నీవేదియో చింతించుచునుంటి, వది యేమి?

శార—మహాత్మా! ఆలోచించుట కేమియున్నది? మీయభిమతము నెఱిఁగింపుఁడు. విందును.

మేధా—"విందు"నని మాత్రమే పలుకుచున్నావు. వినినపిదప, తత్కార్యనిర్వహణముమాట?

శార—గురువర్యా! అట్టి యనిర్వచనీయమగు తమహృదయాభిలాషమేదియో తెల్పుటకుఁ దమకే యింత సందేహముగ నున్నప్పుడు తీర్చుటకు నాకుమాత్రమెట్లుండునో— నేఁ దెలుపవలయునా?

మేధా—నాకు సందేహముగల దని నీ వెట్లు చెప్పఁగలవు?

శార—నిస్సందేహమైన విషయమున కింత తర్జనభర్జన లెందులకు?

మేధా—ఇందు తర్జనభర్జన లేమియును లేదు.

శార—అట్లయిన తొలుదొల్త నెఱింగింపుఁడు. విన్నపిదపఁగదా— నాయభిప్రాయము నెఱింగించుట!

మేధా—మఱల తప్పుదారిం జనుచున్నావు! నాకోర్కె యెట్టిదైనం దీర్తునని యిదివఱకే, మాటయిచ్చితివి!

శార—తమహృదయము నిమ్మళించక మును పూర్వాభిప్రాయప్రాబల్యముచే నట్లు మాట యిచ్చియుంటిని. ఇప్పటి తీరు చూడఁగా— తమచిత్తపరిశుద్ధతయం దనుమానింపవలసివచ్చుచున్నది.

మేధా— అప్పటి యభిప్రాయ మొకటి-ఇప్పటియభిప్రాయ మింకొకటియా? అట్లయిన, నాడితప్పని సత్యప్రవర్తనముగల మీవంశమున రెండునాలుకలుగల విషసర్పమువు నీ వొక్కతెవే జన్మించియుంటివి.

శార— (నిరుత్తర యగును)

మేధా—పోనిమ్ము. నాయభిప్రాయ మేదియో - నీవు విన నిష్టపడకున్నను నేను బలవంతముగ నీకు వినిపింపఁ దలంచుకొన్నాను.

శార—(స్వగ) పుట్టఁగూడనికన్యగానో పుట్టినతరువాత - యిట్టి మొండితనముఁ గల్గుటకు మాతండ్రి కిది యాశ్చర్యము?

మేధా— సీ॥ బాల్యంబునుండియు బహుగౌరవంబుగ నీకు
నిఖలవిద్యలు నేన నేర్పినాను;
దినదినక్రమమున దివ్యసౌందర్యస్ఫూర్తిఁ
గల్గిన నిన్నాఁ గాంచినాను;
విద్యానుకూలవివేకంబు వినయంబు
నాదిగాఁగా సద్గుణము లరసినాను;
నీపైనఁ బ్రేమచే నిష్కపటంబుగ
నాయంతదాని నొనర్చినాను.

నేఁడు నీవు నన్ను వీడగ నుంటివి, వీ
సమయమందు గురుని సమ్మతంబు
నెఱిఁగి కాన్క లొసఁగ నిచ్ఛయించెద, నన్ను
చిన్నఁబుచ్చఁదగదు చిగురుఁబోఁడి! ౫

శార—మహాత్మా! మీకోరిక నాకు స్పష్టమైనను, తమవంటి సజ్జను లనోట, నట్టిమాట వెలువడుట, సందేహాస్పదమగుటచేత - మఱింతస్పష్టముగఁ బ్రార్థించుచున్నాను.

మేధా—శారదా! ఏమంతగొప్పకోరిక కాదు. బహుకాలమునుండియు, నీయందనంగసుఖవాంఛాసంతప్తుఁడనై యుంటిని. ఆకోరికం దీర్పుము. ఒక్కమాఱు, చాలును - తృప్తి నందెద.

శార—(చెవులు మూసికొని) హరిహరీ! తండ్రీ! ఇది యేటికోరిక? తమ రిట్లు వాంఛింపఁగూడునా? (అనుబంధము 1.)

ఆ॥ పిన్ననాటనుండి, పితృసభాతి, న
న్గాంచినారు, విద్య గఱపినారు;
నేటి కిట్లు గోర, నింద్యంబు, పాపంబు,
గాదె? దీనిఁ దెలుపఁగావలయునె? ౬

మేధా—శారదా! నేను, నీకన్నపెద్దవాఁడను. గురుజనాదేశంబును, నిర్వర్తించుట—పిన్నలకు దోషంబు గానేరదు. ఆదోషము నన్ను నరకకూపంబునఁ ద్రోయునని, నీవు చింతనందనక్కఱ లేదు. ఈమన్మథబాణబాధకన్న నరకబాధ నా కధికంబు గానేరదు. నన్ననుగ్రహింపుము! నీ వెన్నినీతులఁ జెప్పినను, అవి యెల్ల నాయొద్ద నేర్చినవియే! నే, నెఱుఁగనివి కావు!

శార—దేవా! ఎఱింగియుండియే - నన్నిట్టి పాపకార్యాచరణము నకుఁ బురికొల్పుచున్నారా?

మేధా—ఎఱుంగుదును. పాప మని యెఱుంగుదును. ఈపాపఫలంబు, ననుభవింపక తప్పదనియు నెఱుంగుదును. ఐనను, నే నేమి

చేయఁగలను? మహత్తరంబగు, మన్మథబాణాగ్ని బాధచే దహింపఁబడుచున్న నాకితరబాధాస్మృతి యేమియుం గలుగుట లేదు.

శార—తండ్రీ! మీరు, నన్ను కృతఘ్ననని భావించిన భావింతురుగాక, ఈపనికిమాత్రము నే ననుమతించుదానను గాను. క్షమింపుఁడు!

గీ॥ జను లెఱుంగిన యెడ మర్త్యశంపుభీతి;
యావనిపతి విన్న శిక్షించు ననెడుభీతి;
మరణమందిన నట దండధరునిభీతి;
గలుగు, నీపాపకర్మంబు వలన; తండ్రి! 2

మేధా—శారదా! దండధరభీతికిఁ దావుకొందు నని పలికితివి గాదా! మఱల నాపలు కేల నాదెవవు? ఇఁక నీ జగంబున రాజు చెవినిగాని, ప్రజలకంటంగాని పడకుండ మనుభీతి నీ కెంత మాత్రమును అక్కఱలేదు. ఈ మన్మందిరంబు సకలరహస్యభద్రంబు.

శార—జనకా! జాతిత్వచౌర్యంబు లెన్నఁడైన దాగునవియా? ఊరక వెఱ్ఱియూహ లేల చేసెదరు? ఒకవేళ, మనము ప్రపంచజనుల కన్నులం గప్పఁగలమనియే తలంపుఁడు! అంతమాత్రమున నీరహస్యమును సూర్యచంద్రులును, దివారాత్రంబులును, సంధ్యలును, అంతరాత్మయు, నిరంతరము మనలం బాయక చరించు ఛాయాదేవియు నెఱుఁగకయుందురా? మీకివి, నేను చెప్పవలయునా? ఎంతపాపపు టూహ చేసితిరి? దేవా! ఇది, తమవంటియుత్తమోత్తములకుఁ దగినచేష్టయా? క్షణకాల సౌఖ్యమునకై కదా శాశ్వతపరలోకోత్తమసౌఖ్యంబులకు, జలాంజలిని వదలుకొనుట! ఐనను ప్రాజ్ఞులైన తమవంటివారు తుచ్ఛమైన యీ తోలుబొమ్మలపైనను కాంక్షవహించుట? ఎవరైన విన్న నెట్టి నగుబాటగు విషయము! స్వామీ! ఈదుష్కృత్యంబు మఱచిపొండు! ఈ కానుకల స్వీకరించి నన్ను పితృభావంబున నాశీర్వదింపుఁడు!

మేధా—శారదా! నా కాశాభంగము గూర్చుట నీకు శ్రేయముగాదు సుమా!

శార—స్వామీ! అందువలన నేదియేని విపత్తు సంభవించునేని దాని ననుభవింతునుగాని, యీకుపూర్వకర్మమున కొడిఁగట్ట లేను. నే నరిగెద - సెలవిండు.

మేధా—అరిగెదవా? - నాకోరిక౯ దీర్పవా?

శార—అది నావలనఁగాదు. క్షమింపుఁడు.

మేధా—ప్రమాదము సుమా!

శార—అనుభవించెదను.

మేధా—మంచిది- శారదా! దీనిని, జ్ఞప్తియుందుంచుకొనుము. విద్యాగర్వంబునఁ దుర్లిపడుచు గురునికోర్కెని నిరాకరించిన నిన్నొకమూఢున కిచ్చి పెండ్లిచేయింపకున్న నాపేరు, మేధానిధి కా దనుకొమ్ము.

శార—మానవమాత్రు లోకరిప్రాప్తికిఁ గర్తలు కారు. విధివ్రాత యెట్లో యట్లు కాకపోవదు. సెలవిండు. (నిష్క్రమించును).

మేధా—దీనిపొగరణంచుమార్గము, నన్వేషించుట కీక్షణమే సుముహూర్తము. (నిష్క్ర)

—* పటపరివర్తనము *—

## 2. రంగము — అరణ్యమార్గము.

ప్రవేశము:— కొండలు దొమ్మరివాండ్రు.

దొమ్మరులు—(అనుబంధము 2)

(పాడుచు నిష్క్రమింతురు.)

(తరువాత మేధానిధి ప్రవేశము.)

మేధా—(స్వగతము) భళీ! నాసంకల్పమునకుఁ బరమేశ్వరుఁ డనుకూలమైన చక్కని మార్గమునుఁ జూపెను. దానిని నిర్వహించుటయొక నాలో నున్నది. విద్యాగర్వమున నాయభిలాషను నిరాకరించిన శారద భాగ్యజీవనమంతయు నాయఱచేతిలోఁ జిక్కియున్నది. మహారాజు వరాన్వేషణాభారమును నాయందిడి, నన్ను మనసార నమ్మి పంపియున్నాఁడు. ఇప్పుడు నాశక్తికొలఁది యన్వేషించి, యొకమానిసిఁ దెచ్చి, శారదకు భర్తగా నొనరించి, దానివిద్యాగర్వము నణఁచకున్న నాపేరు మేధానిధి కాను. ఈ యరణ్యమున నొక దొమ్మరిపల్లె గలదనియు, నందుగలవా రందఱును, విద్యాసంపర్కములేని పశుప్రాయులనియు, వింటియుంటినిగదా! ఆమూర్ఖు లందఱను గలిసికొని, వారిలో విశేషమూర్ఖాగ్రేసరుం డగువాని నొకనిం గొనిపోయి, రాజపుత్రికకు వివాహ మొనరింపఁ జేతును. అంతటితోఁగాని నాకాంక్షాగ్ని చల్లారదు.

ఉ॥ శారద యన్న నామమున శారదనే యను గర్వబుద్ధిచేఁ
గూరిమిమీఱఁ దగ్గవయఁ గోరిన నన్నుఁ దృణీకరించె, నీ
పాపపి యాగ్రహానలము భగ్గున మండుచు నటం జెలుంగ దా
సారసనేత్ర, మొందుగఁ గాంచును; చిక్కెను మత్సరంబునన్. ౮

(తెరవంకఁ జూచి) అదిగో! కొండలు దొమ్మరవాండ్రీవంకకు, వేసడంబులఁ దోలుకొని వచ్చుచున్నారు! నే నీచాటుననుండి, వీరిలో విశేషబుద్ధిహీనుఁ డెవ్వఁడో కనిపెట్టుదుఁగాక! (చాటున నిలుచును.)

(తరువాత దొమ్మరులు పునఃప్రవేశము)

1 దొ—నిలండశ్యా! నాకొడుకుల్లారా! నిలండీ! యాడబొయ్యేరు? కట్టెల్తే సరిపోను సెట్టిడ కాబట్టిన సన్నంస్తే.

2 దొ—ఎట్టోడా! ఈమట్టసెట్టు, మానుగట్టి, మా పసందుగుంధాది గాని, ఆకులుగోసి దొన్నెలుగుట్టి అంబళ్లు జుర్రుధా మన్నె.

3 దొ—ఈ పొట్టినాయాలికి యాంకాలం పొట్టతోందరన్నె!

4 దొ—సద్దు- సద్దు- మన "కాళిగోడు" పందోగాని, యాకమొయ్య ఆంగోసిత్తుంధాడాని.

1 దొ—కాళిగోడు, కాళికమ్మోర్కి మస్తే - బలిగోరుతుండాడాని!

2 దొ—కాళిగాడు, బలిగోర్తె - గాండ్లె లుంధాయిరా! సలుకుదారి.

3 దొ—అదిగాదన్నె! ఎర్రినాకొడుకుల్లారా! ఆను, గాడిదెనాగ బలిసుండాడాని - ఇప్పుడాడికి మదపిచ్చ పట్టిందన్నే!

4 దొ—ఒరే! కాళీ! సత్తెమే నంటాని యీమాటలు!

కాళి—(ఎగురుచు పాడును).

పాట.

నేను! రాసోళ్లకూతుర్ని పెండ్లాడతా!
నా! యాలితోగూడి సయ్యాటాడతా!
నేను! మురిపించి ముక్కట్టి ముద్దాడతా!
మురిసి, ఆడాడనే భోగమాటాడతా ॥ నే॥

మేధా—(స్వగ) వీడు, రూపమునం దద్వితీయుండైనను మూర్ఖుండుగానే యున్నాండు! అదిగాక, భగవంతుండు నాసంకల్పముల ననుకూలించునేమో యున్నది - వీని కప్పుడే కల్యాణవాంఛయుం గల్గినది! ముందేమగునో పరికించెదంగాక!

3 దొ—నేను సెప్పుండ్లేదన్నే! ఈడికి మదపిచ్చని.

4 దొ—ఈడి మదపిచ్చికి - ఎనుబోతుమంటి గాడిదెని యెత్తుకొచ్చాం రాండిరా!

కాళి—ఎదవ కొడుకుల్లారా! నాకు గాడిదెంట్రియాలి? (పాడును)

"రాసోళ్లకూతుర్ని పెళ్లాడుతా

నా,యాలితోఁగూడి సయ్యాటలాడతా"

(మీనము దగ్గిర) సూడండెయ్యేం నాపెతాపం! ఆఁ-

మేధా—(స్వగ) మనుజ జన్మల విధానమును భగవంతుఁడే వీనినోట వచింపించుచున్నాఁడు కాఁబోలును!

1 దా—రాసకూతుర్ని పెళ్లాడ్తా గాఁ బుట్టినాఁయట మనుష్యుఁడు గాఁడు. సద్దన్నే సప్పు. ఉమారాకెత్తాట భంట్రోతుల్ కొంచ బొయ్యేరు.

2 దా—క్కాల్ గొట్టనొచ్చి గాడిదలను లాగుతు పోతాడు. సందె బడ్డాది. లేండి సెప్పక్కడా.

3 దా—సర్లెం సర్లెం. రాండి.

(కాళిగాఁడు తప్ప అందఱును, తలకొక చెప్పున నడుచుఁ బోవుదురు)

మేధా—(స్వగ) ఇప్పుడీకాళి యొంటరిగా నున్నాఁడు. వీనితో సంభాషించెద! (దగ్గఱకుఁబోయి) ఓరీ! కాళీ!

కాళి—(మేధాతిథిని చూచి ఆనందముతో) పండెనన్నేయ్! పంటపండె నన్నేయ్.

మేధా—ఏమి పంటరా?

కాళి—నాపంటపండె. నాపిల్లకై బ్యాపనోఁడొచ్చినాఁడు! నా పంటపండె!

మేధా—నీకు పెండ్లికుమార్తె కావలదటరా? ఎట్టి పెండ్లాడెదవు?

కాళి—(పాడును) "రాసోళ్లకూతుర్ని పెండ్లాడతా."

మేధా—అది నీకెక్కడ దొరకును?

కాళి—(పాట) "నా యాలితోఁగూడి సయ్యాటలాడతా."

మేధా—ఎచ్చటనైన దొంగిలి వచ్చితివా?

కాళి—(పాట)"నేను! సింగారించి ముక్కట్టి ముద్దాడుతా" (మేధానిధి ముక్కు పట్టుకొనును.)

మేధా—ఓరీ! తాళుతాళు. నన్నే పెండ్లికూతు రనుకొంటివా యేమి?

కాళి—(పాట) "ముసిసి ఆడాడనే బోగ మాటాడతా" (చుట్టును తిరుగును.)

మేధా—ఓరి నీ మదపిచ్చ మండ! నన్ను పట్టుకొంటివేమి? దూరముగ నుండుము.

కాళి—(పాటఅంతయు పాడుచు చుట్టును దిరుగును)

మేధా—ఓరీ! నేను పెండ్లికూతురును గాను. తిన్నగా చూడుము. నీ చేయిచూచి జోస్యము చెప్పెదను. ఇటురా!

కాళి—తియ్యి—తియ్యాస్సె! జోస్సం గీస్సం తియ్యాస్సె! పెండ్లికూతుర్ని కానంటివి! నువ్వెందు కేటి కొచ్చుండావు? నాతోటోళ్లు కట్టెలు గొట్ట సిల్లికుండారు! నేజాగుజేస్తి. (తానును ఒకచెట్టు నెక్కును)

మేధా—(స్వగ) వీనికి పెండ్లియం దభిలాష మిక్కుటముగ నున్నది. ఎట్లయినను లోబరచుకొనవచ్చును.

కాళి—(చెట్టుకొన తుదను నిలువఁబడి కొమ్మమొదలు నఱుకుచుండును.)

మేధా—(చూచినవ్వి) వీఁడెంత మూర్ఖుఁడు! తా నెక్కినకొమ్మనే తాను నఱుకుకొనుచున్నాఁడు! (చెట్టుపైకిచూచి) ఓరీ! కాళీ! నీవు క్షణకాలములో కొమ్మవిఱిగి క్రిందఁబడెదవు.

కాళి—పోస్సె! బాపనోడా! జోస్సెం గీస్సెం తియ్యాస్సె అని సెప్పండ్లే?

మేధా—సరే! కానీ! నాజోస్యము నిజమగునో లేదో చూచుచుండుము!

కాళి—(లక్ష్యపెట్టక నఱికి క్రిందఁబడుచున్నాఁడు.)

అందఱు—(ప్రవేశించి) రాండెస్సే! రాండెస్సే! కాళిగోడు గుట్ట కూలుంధాము. రాండెస్సే.

కాళి—(ఒడలు దులుపుకొనుచు లేచి) అమ్మ! బ్యాపనయ్యా! అమ్మ! బ్యాపనయ్యా! ఎంతదొడ్డ జోస్సెం సెప్పన్నెయ్యా! ఎంతదొడ్డ జోస్సెం సెప్పన్నెయ్యా!

అంద—ఏందిరా! జోస్సె మేందిరా?

కాళి—పెట్టండెస్సే! బ్యాపనోడికి పెట్టండెస్సే!

అంద—ఏందిరా పెట్టేది?

కాళి—దణ్ణం దణ్ణం పెట్టండెస్సే! బ్యాపనయ్యోాను బెమ్మదేవుం డేనంటే యినోండు! (మేధావి కాళ్లపైఁబడి) నా భమ్మదేవుండా! నా నారాయణమూర్తీ సత్తెం. సత్తెం. నీమాటం తా సత్తెం. దండాలు మారాజ్జా! నీకు దండాలు! పదేల దండాలు!

మేధా—ఓరీ! కాళీ! ముందు నా కాళ్లమీదనుంచి లే.

కాళి—(లేచి) దొడ్డమారాజప్ప నాసామి! సితావాలకాడ సచ్చినా పున్నెమొచ్చేను!

మేధా—సరే! కాళి, నా జోస్యము నిజమునదా?

కాళి—సత్తెం సత్తెం. నీజోస్సెం సత్తెం. నీమాట సత్తెం. నువ్వు సత్తెం.

మేధా—అట్లయిన, నీకింకేమైన జోస్యము చెప్పవలెనా?

కాళి—ఒక్క జోస్సెముంపొది మారాజ్జా! మాదొడ్డజోస్సెం.

మేధా—అది నీపెండ్లిజోస్యమేనా?

కాళి—హాద్దగ్గో హాదేజోస్సెం. నా భమ్మదేవుండా! హాదే జోస్సెం!

మేధా—అట్లయిన చెప్పెదనుండుడు. (వ్రేళ్లులెక్కించి) నీకు పెండ్లి యగునురా..

కాళి—మారఁజా! మారఁజా! నీజోస్నెం సత్తెంగ జరుగుతాదండి మారఁజా!

1 దొ—పెద్దగాడ్దని పెళ్ళాడ్తావంటరా?

కాళి—రాసోళ్ళకూతుర్ని పెళ్ళాడతా! యెట్టినాయాలా!

2 దొ—నీ మొగానికి నన్టూరి నాయాలా! రాసోళ్ళ కూతురూ?

కాళి—కుయ్యాకన్నే! కుయ్యాకు! (మేధానిధిని చూచి) నేను పెళ్లాడే పను సెవర్తో సెప్పండి మారఁజా!

మేధా—(లెక్కలుచూచి) తప్పక రాచకూతుర్నే పెండ్లియాడుదువురా!

కాళి—(సంతోషమున గెంతుచు వెనుకటి పాటపాడును)

మేధా—నీవు నా వెంటవచ్చి నేను చెప్పినట్లు చేసితివా రాచకూతురును పెండ్లియాడఁగలవు!

కాళి—మారఁజా! నువ్వేం సెయ్యమంటే అదంతా సేసేను. నీయంబటే వొచ్చేను. కొంచబో—బ్యావనయ్యోరా!

మేధా—అట్లయిన రమ్ము.

1 దొ—కాళిగాడికాలం తిర్గబడ్డదన్నే!

2 దొ—నువ్వెల్తే నీగాడ్దె నేంజేసేమురా కాళీ!

కాళి—గాడ్దెగీడ్దె తియ్యన్నే! నేను గొప్పమారాజుని గాబొయ్యేను! నాయాలి, రాసోరికూతురు గాబొయ్యేను! రావయ్యా బ్యావనయ్యోరా! రా!

అందఱు—(కాళిచుట్టును తిరుగుచు)

—పాట—

రాసోరి అల్లుడికి మంగళంబాడండి రాండన్నే దొమ్మర్లు

కాళి— ........................................ వాహ్వా! వాహ్వా!!

అంద— పెళ్లాడతాడంట! పెల్లికోమాన్తెంట! రాసోళ్లబిడ్డంట!

కాళి— ...................................వాహ్వా! వాహ్వా!!

అంద— బావనయ్యోరంట! పట్టు కెల్తాడంట! పెళ్లిసేత్తాడంట!

కాళి— ...................................వాహ్వా! వాహ్వా!!

అంద— కాళిగోడికి మంచి! కాలమొచ్చిందంట! జోస్సమే నిజమంట

కాళి— ...................................వాహ్వా! వాహ్వా!!

(అందఱు నిష్క్రమింతురు)

[పట పరివర్తనము]

---

3. రంగము - ధర్మవర్ధన మహారాజు మందిరము.

ప్రవేశము — సుఖాసనాసీనుఁడగు ధర్మవర్ధనుఁడు, శుభాలంకారములతో నున్న కాళిగాఁడు ఒకవంకను, మేధానిధి రెండవవంకను ఆసీనులైయుందురు. కొందఱు పరిజనులు ఉచితరీతి నిలిచియుందురు. మందిరముగం దంతటను రామాయణ, భారత, భాగవతాది కథానూచకములగు చిత్రపటములు అలంకరింపబడియుండును.

ధర్మ—గురుశ్రేష్ఠమా! మీ యుపకార భారమును నేను తీర్పఁ గొనఁజాలను; ఏమందు రేని-

గీ॥ ఒక్క రాసుతు నేనియు నొల్లకున్న
నాదు పుత్రిక కర్మభూనాథసుతుని
పండితాఖండలునిఁ గొని వచ్చినారు;
నాయశఃకాంతిఁ గాపాడినారు మీరు. ౧౧

ఇందులకు, మీ కొక్క నమస్కారముఁ దప్ప వేఱేమియుఁ గావింప లేను.

మేధా—రాజేంద్రా! ఇదియంతయు నీ యదృష్ట బలమని యే చెప్పఁదగియున్నది.

ధర్మ—(అపవారించి) మహాత్మా! దాని నట్లుంచుము. కాని - నా జామాతవిషయమై నన్నొక గొప్పసందేహము పీడించుచు న్నది. దానిం దీర్పఁ బ్రార్థించుచున్నాను.

మేధా—(అప) అవశ్యముగా తమ సందేహముం దీర్పఁగలను. అది యేమి?

ధర్మ—(అప) ఈతఁ డొక మహాపండితుఁ డని తమరు సెలవిచ్చితిరి. కాని, ఇతఁడు వచ్చినది మొదలు మౌనవ్రతము బూనెనే కాని, ఒక్కమాటయైన నాడ లేదేమి?

మేధా—(అప) ఇదియా మీ సందేహము? మహాపండితుఁ డగుట చేతనే యీతఁ డెవ్వరితోడను మాటాడుట లేదు.

ధర్మ—(అప) అనగా - నాకర్థము కాలేదు.

మేధా—(అప) అఖండపండితశిఖామణి యగు నీమహాత్ముఁడు మాటలాడిన యెడల నావంటివారికే యుక్తము కాదు. అట్టియెడ, నాతనితో సంభాషింపఁగల సామర్థ్యముగలవారు మనలో నెవ్వరుగలరని యీతఁడు సంభాషించును?

ధర్మ—(అప) మహాత్మా! అట్లయిన, నిప్పుడు నాసందేహ నివారణ మైనది!

కాళి—(పటములను పరికించి పరికించి) రాభణుఁడు — రాభణుఁడు.

మేధా—(తనలో) అన్నా! కొంపదీసితివిగదరా - ముండకొడకా!—

అందఱు—(అనుమానముతో ఒకరిమొగ మొకరు చూచుకొందురు.)

మేధా—(తనలో) ఇప్పుడు వీరికందఱకును, అనుమానము గల్గినది! రావణచిత్రముం జూచి, యీమందుఁడు గ్రామ్యభాషలో "రాభణుఁ"డని యఱచినాఁడు! ఇప్పుడు దీని నెట్లయిన సమర్థింప వలయునే కాని, యేమాత్రము జంకినను బ్రమాదము గలుగఁ గలదు. (ప్రకాశముగ) ఆహాహా! రాజేంద్రా! నీయదృష్టము

నేమందును! ఎంతటి యుత్కృష్టపాండిత్యముగలవానిని అల్లునిగాఁ బడసితివి!

ధర్మ—గురువర్యా! "రాభణుం"డని పల్కిన యీమోటుమాటను పాండిత్య మని యానందించెద రేమి!

మేధా—(నవ్వి) రాజేంద్రా! ఎంతవెఱ్ఱివాఁడవు! "రాభణుం"డనుట మోటుమాటయా? నేఁ జెప్పియుండలేదా - ఈపండితుని పల్కులు మన కర్థముకావని ? అది యిప్పుడే తార్కాణమైనది.

ధర్మ—(తెల్లపోయి) స్వామీ! అట్లయిన, నీ రాభణశబ్దమున కర్థమేమి?

మేధా—అల్లు ప్రశ్నించుఁడు, నేఁజెప్పెదను. రావణుని రాభణుం డని పేర్కొనుటలో, పండితశిఖామణియగు నీ యల్లుని యభిప్రాయ మేమనఁగా.

క॥ కలదుగా "భకారము" కుంభకర్ణునందు *
చను "భకార" వర్ణము విభీషణునియందు
రాక్షసశ్రేష్ఠుఁడైనట్టి రావణుండు,
రావణుఁడుగాఁడు; నిజముగా రాభణుండె. ౧౨

శ్లో॥ కుంభకర్ణే భకారోస్తి భకారోస్తి విభీషణే
రాక్షసానాం కులశ్రేష్ఠో రాభణో నతు రావణః.

ధర్మ—(ఆనందమంది) వింటిరా సభాసదులారా ! ఇందలి పరమార్థమును అజ్ఞానులమై దీనిని గ్రహింపలేక పోయితిమిగదా !

అందఱు—ఆహా హా ! మహాపండితుఁడు ! మహాపండితుఁడు !

మేధా—(తనలో) మీ రందఱును మహామూర్ఖులు! మహామూర్ఖులు!!
(ప్రకాశముగ) రాజేంద్రా! సుముహూర్తము సమీపించినది!

* ఈ సందర్భమునందు ప్రదర్శకులు, పద్యమునుగాని, శ్లోకమునుగాని వీలువెంట ఉపయోగించుకొనదగును.

నీ కుమార్తెను బిలిపించి, వరునకుఁ బాదనమస్కార మాచరింపఁజేసి, పిదప, ఆచారానుసారముగా, కళ్యాణమంటపమునకుఁ గొనిపోవుదము.

ధర్మ—తమయాజ్ఞానుసారము చేయుదము. (తెరవంకఁ జూచి) దాసీ! భర్తృదారికను మంగళాలంకృతులతో నిచ్చటికి ప్రవేశపెట్టుము.

(తెరలో) మహాభాగ్యము.

మేధా— (తనలో) అమ్మయ్య! ఈమూర్ఖశిఖామణి యొనరించిన దోషమును కప్పిమ్మకొని యిప్పటికి బయటఁబడితిని. నోరుమెదల్ప వలదని శిక్షాపూర్వకముగా, వీని కెంతబోధించినను, సహజమౌర్ఖ్యమును వదలకున్నాఁడు. కల్యాణమున, మూఁడుముళ్లు పడెనా, పిదప, రహస్యభంగమైనను భయము లేదు. నాపంతము నెరవేరును. రాజపుత్రిక నమస్కరింప వచ్చినప్పుడు, "త్రిపీడాపరిహారోస్తు" అని పలుకవలసినదని కఠినముగ శాసించితిని. ఇంక నొక్కక్షణములో, రాజపుత్రిక రానున్నది. అచ్చట నేమి రసాభాసము చేయునో—

(తరువాత పరిచారికలవెంట పుష్పమాలఁగొని శారద ప్రవేశము)

ధర్మ— (ఎదురేగి) నాబిడ్డా! దగ్గరకు రమ్ము.

మ॥ ఇతఁడే నీదగు ప్రాణనాయకుఁడు సుస్మితుండె నీదైవమా
నితఁ డత్యద్భుతపండితోత్తముఁడు; నిన్నీనాఁడు, దానంబుగా,
మతి రంజిల్లఁగ నిత్తు నీతనికి; లెమ్మా! రమ్మ మద్భాగ్యమా!
పతిపాదంబులకున్ నమస్కృతుల నొప్పారంగఁ గావింపుమా!

శార— (నమస్కరించును)

కాళి— త్రిపీడాస్తు!

అందరు—(విభ్రాంతులగుదురు)

శార—(చేతిలోని పుష్పమాలను జారవిడుచును.)

మేధా—(తనలో) అయ్యయ్యో! ఈ మూఢుఁడు, అనుకొన్నంత పనియుఁ జేసినాఁడు! (ప్రకాశము) అపూర్వము! అద్భుతము!

అసాధారణ మంగళాశీర్వచనము! అమ్మాయీ! ఈతని యాశీర్వచన మమంగళప్రద మనియా యేమి కంఠమున వేయఁదగిన పుష్పమాలికను, నేలపై వదలితివి?

ధర్మ—గురువర్యా! ఇదియేమి? "భర్తృపీడాస్తు!" అని పల్కుట యమంగళకరము కాదా? అట్లు పలికెద రేల?

మేధా—ఎన్నటికిని కాదు; సరిగదా సమస్తమంగళ సంపూర్ణమైన మహదాశీర్వచనము!

ధర్మ—నా యల్లుని ప్రవర్తనము లోకవిపరీతముగా నున్నది. ఇది యెట్లో వివరింపుఁడు!

మేధా—ఆలకింపుఁడు! "భర్తృపీడాస్తు!" అనుటలో మీ యల్లుని యభిప్రాయ మేమనఁగా.

ఆ॥ కూరుచున్నయపుడు కూర్మిపుత్త్రులపీడ,
పండుకొను వేళ భర్తృపీడ,
భోజనమున బంధువుల పీడ యను త్రిపీ
డలును గలుగు నీకు నలినవయన! ౧౮

శ్లో॥ "ఆసనే పుత్త్రపీడా చ బంధుపీడా చ భోజనే
శయనే భర్తృపీడా చ త్రిపీడాస్తు సదా తవ."

ఇందు సర్వశుభములును గూడియుండలేదా! ఉత్తమసాధ్వి కింతకన్నఁ గావలసిన దేమున్నది?

ధర్మ— ఆహాహా! ఎంతటి నిగూఢాభిప్రాయము! మఱల నీమహాత్ముని యభిప్రాయము నెఱుంగ లేక తప్పుదలంచితిమి! ...అమ్మాయీ! నీనాథుఁడు మహాపండితుఁడు; నీయదృష్టవశమున లభించెను. ఆపుష్పహారమును కంఠమున నలంకరింపుము!

శార— (తనలో) ఇదియంతయు నా కగమ్యగోచరముగా నున్నది! ఈపురుషుఁడు, పండితుఁడో శుంఠయో నయితము నిర్ణయింప లేకున్నాను. కానిమ్ము విధి యెట్లు ఘటించునో యట్లు జఱుగక మానదుగదా!

(పుష్పహారమును మెడలో వేయును)

అందరు—(కరతాళములు మ్రోగింతురు)

[పటపరివర్తనము.]

4 రంగము - శారదపడకగది

(పర్యంకసహితమై రమణీయముగ నలంకరింపఁ బడియుండును.)

ప్రవేశము— కాళిగాఁడు.

కాళి— (దిశలు పరికించి మహాశ్చర్యముతో) వాస్! వాడెబ్బ నాయాలా, బ్యావనోడంటే బ్యావనోడుగాఁడుగానీ- ఇందరలో కానికి న న్నిసిరి పారదొబ్బినాఁడ్రా! నాలుగు తిడితే నేమి రెండుకొడితే నేమిఁగాని నాయాలా-పాశాలంట, గాడిదెలంట, దూడపేడంట, బరోపియ్యంట, యెన్నెన్నో- నోట్నిండా మెట్టించేసినాడు! ఈడిదెబ్బ గాలిపోనూ. అల్ల రాసో రాజమఖిసి, నాకాడికొచ్చి గుమగుమ లాడతా రుమరుమ లాడతా అత్తరుసాహేబులాగా బుట్టబొమ్మలాగా నాసెయ్యెట్టకుంటేతల్కీ మా సామిఁ దేవుఁడా, కిందనున్న పేనాలూ మీఁది కెల్లిపోయి, వోల్లంతా నీరిడిసినట్లైపోయి బతికుంఛానో, సచ్చుంఛానో కూడా వొక పట్టాన తెల్చిందిగాధంటేనూ. ఇప్పుడా బ్యావనోడు నాకంట్ల బడితే, మా కాట్రాయిసామిఁకి మొక్కినట్లు మొక్కుతాఁను గంధా. ఈడకు నన్నంపుండాడు బ్యావనోడే! సత్తెం సత్తెం. సఖ్ఖంగ నిద్దరబొమ్మని పొప్పుంఛాఁడు. (శయ్యపైఁగూర్చుండి) నాసామే నాసామే ఏంధిరా యీసౌక్కెం? ఏంధరా యీసౌక్కెం? మా యెరోగ్రిడు మొరోగ్రిడు కంచోడు సెంచోడు పుల్లోడు నల్లోడు యీరిగాఁడు మారిగాఁడు గోపిగాఁడు పాపిగాఁడు అల్లబ్బతరాన్నీ యీసౌక్కెంఎఱుఁగుంఛారా అంటి? (ఎగురుచు పాడును)

పాట

ఏరాజుకొచ్చెని - యీరాజభోగాలు। యీ రేడులోకాలలో నా-
సైఁ - సైఁ - ॥ఏ॥ నారాతపున్నెన - మారాజు భాగ్యమ్మిదా।
ఇంద్రున్ణి నేశాఁడు చంద్రున్ణి నేశాఁడు ॥ఏ॥

(శయ్యపైఁబరుండి, అనతికాలమందే గుఱ్ఱుపెట్టి నిద్రించుచుండును)
(తరువాత, శారదప్రవేశము)

శార—(స్వ) గురువరుఁడు, నాతో దారుణమైన ప్రతిజ్ఞ సల్పి అనంతరము మత్పితృపాదుల యానతిచే తానే వరాన్వేషణకార్యమున కరుగుటయు నేఁడీ పురుషవర్యుం గొనివచ్చి, నాకు వివాహ మొనరించుటయుం జూడ, నా హృదయంబున తీరని సందేహము పీడించుచున్నది. ఐనను ఈతఁడాడిన యసందర్భ వచనంబులను గురుఁడు సమర్థించి సదర్థంబులను, వచించుటచే నేమియుం జేయ నేరనైతిని. ఈతఁడు, గురుఁడు వచించిన చందమున పండితుఁడో, నా హృదయము సాక్ష్యమిచ్చు వడువున శుంఠయో నేను తేటతెల్లము కాఁగలను! ఈతని యనుపమానరూపలావణ్యాతిశయంబులకుఁ దగినట్లు నిజముగా పండితుఁడే యయ్యెనా, నా భాగ్య మసమానము గదా!

ఉ॥ రూపము తీరుఁజూడ, నపురూపముగాఁ గనిపించు; వహ్వారే!
యీ పురుషాగ్రగణ్యుఁడు వచించెను పాండితితీరుఁ జూడ, సం
తాపము గల్గు; మద్గురుఁడు తథ్యపు టర్థము తెల్పియున్న, నీ
రూపముఁ గల్గు పండితుఁడు, ప్రోజ్జ్వలహేమము తావిగల్గుటే.

ఐనను అంతటిభాగ్యము నాకుఁ గల్గవలయును గదా! (కాళిఁజూచి,) ఏమి యీ పురుషుని చిత్రప్రవర్తనము! ఈతఁడీ మృదుతల్పమునం జేరినదే తడవుగ, ననాగరకుని చందమున గుఱ్ఱువెట్టుచు గాఢనిద్రాపరవశుఁడై యున్నవాఁడు! ఇతని విద్యారహస్యంబును, గురుని హృదయతత్వమును నేఁడు భేదించి తీరెదను. ఈ సమస్యాభేదనమునందే కదా నా జీవిత

సౌభాగ్య మాధారపడియున్నది. ఇంచుక వీణానినాదం బొనరించి యీతని జాగరితుం గావించెదఁగాక! (వీణఁ గైకొని గానము చేయును.)

పాట:—(అనుబంధము 3.)

కాళీ—(కొంచెము కదలి తిరిగి పరుండును.)

శార—(స్వగ) ఏమి యీ నిద్రాపారవశ్యము! అమానుషముగ నున్నదే! కఠినశిలాపుంజములనైనఁ గఱఁగింపఁజాలు నాగాన ప్రభావం బీతని గాఢనిద్రనుండి స్వల్పముగఁ గదలింపఁ జాలెనేకాని, పూర్ణముగ జాగరితుఁ గావింపఁ జాలదయ్యెను.

ఐనను మఱియొకసారి ప్రయత్నించి చూచెదను.

గీ॥ మోహనాకార! సంపూర్ణ ముకుళితమైన
కుముదయుగి నేలు కన్గవ, కొంత విచ్చి
యసమసుప్రమోదాయతి నందరాదె!
క్షితికి వచ్చిన శశిని వీక్షించినైన. ౧౬

(పన్నీటిని మొగముపైఁ జిలుకును.)

కాళి—(నిద్దురలో దొరలుచు) టక్ క్ క్! టక్ క్ క్ క్! వో్ర్ రేయ్! పెద్దోడ! పెద్దోడ! పెద్దగాడిదె మొగాన నీరుడు వొదిలింద నేఁయ్!—

శార—"పెద్దగాడిద నీరుడు"...... కటకటా! ఎంత ప్రారబ్ధము! ఇతఁడొక నీచజాతి యెఱుకు వాఁడని తోచుచున్నది. ఇతనిది, గాడిదలఁగాయు మహోద్యోగము కాఁబోలును. దైవమా! నేనేమిచేయుదును! ఆహా! గురుఁడా! తుదకు నీపంతము నెగ్గించుకొంటివా! ఎంతటి కుటిలవర్తన మొనరించితివి? నా తండ్రిని, సమస్త పండితులను మోసగించి యీ యప్రాజ్ఞుని మూఢవాక్యములను, నీయసమాన పాండిత్య ప్రకర్షచే సమర్థించితివిగదా! నీ పాండిత్యమంతయు నిందుల కుపయోగిం

చెనా? అభాగిని నగు నా రాజన్యాంతము నీ మూఢుఁడే యాత్మకృతి కావఁసియున్నదియా?

ఆ॥ తిరుగవచ్చు విధి విధించిన వ్రాఁతైన
విరువవచ్చు సర్వేశుమాటైన
వహ్నిసాక్షిగా వివాహమౌ భార్యత
తరుణిబంధమునకు, తిరుగు లేదు. ౧౭

ఇప్పుడు నా కర్తవ్యమేమి?

సీ॥ వధియింతునా? మహీపతియైన తండ్రితో
ధర్మభావాస్వచరిత్రంబు నెల్ల;
దండింపఁ జేతునా? దారుణాంతఃపుర
ద్రోహంబు సల్పిన దుష్టగురుని;
కనుగొందునా? విలక్షణంబు, నా మూల
చూడంబు సకలము క్షోభనాయ;
పండితుఁగా నొనర్పఁగఁ బ్రయత్నింతునా?
యీమూర్ఖమానసు నింక మీఁద;

ఏమిసేయుదు నింక, నా కేది తెఱవు?
ఎఱిఁగియుండియు నేదియు నెఱుఁగకున్న
నిర్భరాందోళనము గల్గె; నియతియిట్టుల
ఘటితమయ్యెను; నా కేది గతి ధరిత్రి! ౧౮

అనంతరకర్తవ్య మెటులున్నను, తొలుత వీని నిజవృత్తాంత మారయవలయునుగదా! వీనిని మేల్కొలిపి నివృత్తసందేహ నగుట యే ప్రథమకర్తవ్యము! (చేతితోఁదట్టి లేపఁబోయి సందేహించి) నిద్రాముద్రితు లగువారిని లేపుట పాపమని పెద్దలు నిర్వచింతురు. మేల్కొలుపుదునా! మేల్కనునంత దనుక వేఁచియుందునా?.........అందువలన నేమిలాభము? ఈ జానపదుఁడు తెల్లవాఱకుండఁ దనంతటతాను నిద్రమేల్కను ననుట స్వప్నవార్త! పాపపుణ్యవిచారము నాకమూలనుంచి

నిద్రిమేల్కొలిపి నిజవృత్తాంత మరయు నేవలయు. (లేపుచు) ఆర్యపుత్రా! ఆర్యపుత్రా!.

కాళి— (నిద్రిలోనే కలువరించుచు) నిలు నిలశ్శే! నిలు. ఓరేయ్! గంగులూ పందిపిల్ల పోయె! పందిపిల్ల పోయె! కొట్టు కొట్టు. పట్టు పట్టు.

శార— సహజచిత్తవృత్తి కనుగుణముగ నీతఁ డింకను పలువరించుచునే యున్నాఁడు! మఱియొకమాఱు లేపెదను! (చేతితోఁదట్టి) ఆర్యపుత్రా! గంగులు కాదు. నేను తమధర్మపత్నిని. శారదను. లెండు!

కాళి— (కన్నులు తెరువకయే) గుయిఁ గుయిఁ లాడక తొంగోస్!

శార— అయ్యో! ఇది తొంగొనుటకు సమయముకాదు! లేవకతప్పదు! లెండు!

కాళి— (లేచి తిన్నఁగఁజూచి, భయముతో నొకమూలకు పరువిడి) ఓరేయ్! గంగులోయ్! రాసోళ్లబూతం! రాసోళ్లబూత మన్నే!

శార—మహాపురుషా! భీతి నందకుఁడు! నేను భూతమునుగాను. అగ్నిసన్నిధానమున తమకు వివాహితనైన రాజపుత్రికను! నన్ను శారదయని పిలుతురు. మీ రెవ్వరు? మి మ్మిక్కడికిఁ దోడ్తెచ్చినవా రెవ్వరు? మీ వృత్తాంత మేమి? నిర్భితులై వచియింపుఁడు.

కాళి—సత్తెం జెపుతా! సత్తెం. బ్యావనయ్యోరు చేశుంధాఁడు!

శార—సరే! అది తెలియుచునేయున్నది! మీ రెవ్వరు?

కాళి—సిన్నోడు, పెద్దోడు, ఎర్రోడు, నల్లోడు, లచ్చిగాఁడు, బుచ్చిగాఁడు, గింగులు, మంగులు అంధరం యిరవైమంది దొమ్మరోళ్లం. గారెడ్లాసుకుంతా బతికేము. ఒక పాపకాలాన్ని బ్యావనయ్యోరొచ్చుంధాఁడు! సింహాను కొరాను కొమ్మెక్కి మొద్దు నఱుకుధావుంతి. "కిందబడేవు నాయాలా" అని బ్యావ

నయ్యోరుజోస్సం సెప్పుంఢాను. అయ్యోరుమాట సత్తెం సత్తెం:
నీబగ్రికంగ కిందబడుంటి. బ్యావనయ్యోరి పాదాలమీఁదఁబడి,
"బెమ్మదేవుఁడా" అంటి. సుఱిగంత మఱిగంత జోస్సంసెప్పు
మంటి. బ్యామ్మడు జోస్సం సెప్పె. నాసామిఁరంగా బ్యామ్మ
డన్న బ్యామ్మడా? జోస్సమంత నిబద్దం నిబద్దం. అచ్చరాల
నిబద్దం.

శార—బ్రాహ్మణుఁ డేమని జోస్యము చెప్పినాఁడు?

కాశి—రాసోరికూతుర్ని పెళ్ళాడబోయ్యే వనుంఢాఁడు! రాసోళ్ళకి
అల్లుడు గాఁబోయ్యే వనుంఢాఁడు! సూటిగ సన్నీడకు
కొండ్రొచ్చినాఁడు! ఆడెబ్బ నాయాలా! ఈడికొచ్చినాక ఈత
బెత్తందెచ్చి ఈపుపెట్ల గొట్టుంఢాఁడు!

శార—మి మ్మాతఁ డేల కొట్టవలసివచ్చెను?

కాశి— అమ్మోరూ! సత్తెం జెప్పేను! దబ్బరలాడే కొండెను గాను.

శార— నిజమే చెప్పుము; కాని నన్ను అమ్మోరూ! అని పిలవఁగూడ
దు! నేను నీకు భార్య నగుదును!

కాశి—(చెంపలు వాయించికొని) బుద్ధి- బుద్ధి- బుద్ధి గలిగి మసిలేను!
సత్తెంజెప్పేను! ఆబ్యాపని నాకొంప అదేందో, బాసాడ
మనుండె! అదినారోలు తిరగదస్సేలంటే! కొట్టుంఢాడు! నే నేం
ధో పలికుంటి?

శార— మీ పే రేమి?

కాశి— కాశికమ్మోరిపేరే నాపేరు. సత్తెంగా నాపేరు కాశిగోఁడు!

శార—(స్వగ) కటకట! ఎట్టిదుర్గతిని నానుదుట లిఖించితివి?

గీ॥ బూడిదను మంచిపన్నీరు బోసినట్లు
కారడవిఁ బూర్ణచంద్రికల్ గాచినట్లు
చవుటినేలను శుభవృష్టి జారినట్లు
వ్యర్థమయ్యెనె? నాదుయౌవనము నేఁడు. ౧౫

సుక్షత్రియవంశోత్పన్నుఁడై సౌభాగ్యనిధియై విద్యావినయ వివేకసంపన్నుఁడై, సౌందర్యకళానిధి యగు నీడుజోడైన ప్రాణేశ్వరుం జేపట్టి సౌఖ్యసాగరవీచికలఁ దేలియాడఁదగిన యీతరుణమున నా కెట్టిదుర్భరజీవనంబు నలుపుపాటు గల్గెను! అయ్యో! కోటినోములు నోచి గొప్పఫలంబుల గాసించిన నెట్లు లభించును? నాగురుండు నాఘటనంబున కొక్కనిమిత్త మాత్రుం డయ్యె! ఫాలమునందు నాప్రాప్తినిట్లు వేఱువిధము గా విధాత లిఖించియుండ, గురుని దూషించుట వాచాదోష ము మాత్రమేయగును!..........

కటకటా! ప్రాణనాథుఁడు మెచ్చని యీ సౌందర్య మేల? సౌభాగ్య మేల? కాల్పనా! "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ" మ్మను నార్యోక్తి యూరకేపోవునా? నేఁజేసి కొనిన ఫలంబును, నేనే యనుభవింపవలెగాక! పరు లనుభ వింతురా? గతించినదానికి విచారించిన లాభ మిసుమంత యును లేదు గురుం డొనరించిన వికృతికి, నివృత్తి యొన రింప నా కొక్కటి తోచుచున్నది. అట్లొనరించి చూచెదను....

కాళి—అమ్మోరు!

శార—అట్లు పిలువవల దని చెప్పియుంటినే! మఱచితిరా?

కాళి—పాడుబుద్ధి. మఱేసితి. ఆదేంధో అనుండావు!

శార—నేను మీ భార్యను!

కాళి—ఆఁ! అద్దే అద్దే బర్రె బర్రె.

శార—బర్రెకాదు; భార్య!

కాళి—దొమ్మరినాయాలికి అంతపలుకు జోలు దిరుగదు. నాబర్రే! ఇదే, సరి.

శార—సరే! ఎట్లు పిలిచినను, సమ్మతమే! అంతటి దుష్ప్రాప్తియందు వాచాదోష మొకటి పాటించుటయా?

కాళి—నాబట్రే! ఇంగ నన్నిడిస్తే మావల్లెకుఁ బోయి గాడ్దల్ని కాసుకుంఠేను.

శార—పల్లెమాటయు గాడిదెలమాటయు మీ రింక పూర్తిగా మఱచిపొండు!......ఒక చిన్న పని చెప్పెదను; చేసెదరా?

కాళి—సత్తెంగ సేసేను! నాబట్రే! సత్తెంగ సేసేను!

శార—ఈ యూరిబయట కాళికాదేవియాలయము గలదు! ఆమె భక్తాభీష్టప్రదాయిని. రాత్రులం దాదేవి, తనయాలయమును వదలి భక్తసంరక్షణార్థము పురసంచారమున కరుగును. తెల్లవాఱుజామున, మఱల నాలయమునం బ్రవేశించును. ఇప్పుడు రెండుజాముల రాత్రిమాత్రమే దాఁటియున్నది. ఇప్పుడే మీరట కరిగి, ఆ యాలయమునఁ బ్రవేశించి, తలుపులు మూసికొని లోపల నుండుఁడు! దేవి వేఁగుజామున నరుదెంచి "నీ వెవ్వఁడవు? తలుపు తీయు" మని యడుగును. అప్పుడు "కాళీ! నాకు విద్యాదానముచేయుము!" అని యుత్తరింపుఁడు. ఈయకున్న తలుపుతీయ నని బిగ్గఱగాఁ బలుకుఁడు! ఆమె తప్పక ప్రసన్నురాలై యట్లు చేయును! మీరు కాళికా కృపాప్రాప్తిచే కాళిదాసు లనం బరగి మహాకీర్తిశాలు రగుదురు! విద్యావంతుఁడవై సర్వప్రపంచమునఁ బూజనీయతఁ గాంచఁగలఁడు! మీ రింక నట కరిగి రండు!

కాళి—అదేందో, సెప్పుంటివి! మఱిసితి! — పాడుబుద్ది— మఱిసితి!

శార—"కాళీ! నాకు విద్యాదానము చేయుము."

కాళి—అయోరయ్యో! దొమ్మర్నాయాల్కి నాలు దిరగదు.

శార—పోనిండు— "కాళీ! విద్య" అని పలుకఁగలరా?

కాళి—కల్లి - బిద్దె!

శార—"కల్లిబిద్దె" కాదు - "కాళీ విద్య".

కాళి—కల్లి - బిద్దె.

శార—సరే! కానిండు. అదియైనను మఱచిపోక సరిగాఁ బల్కుఁడు!

కాళి—కల్లీబిద్దె - కల్లీబిద్దె - కల్లీబిద్దె. (వల్లించుకొనుచు, నిష్క్ర)

శార—ఓ తల్లీ! కాళికా! నానాథుని యభీష్టముం దీర్చి నీదాసునిఁ జేసికొనుము.

ఆ॥ చిన్ననాఁటనుండి నిన్ను సేవించిన
ఫలము నేఁ డొసంగవలయుఁ; తల్లి!
నాదుజీవితేశునకు సువిద్యాప్రాప్తిఁ
గల్గువర మొసంగు! కమలపాణి! (నిష్క్ర) ౨౦

[పట పరివర్తనము]

---

## 5. రంగము - కాళికాలయము.

ప్రవేశము:— కాళిగాఁడు.

---

కాళి—(స్వగతము) కల్లీబిద్దె - కల్లీబిద్దె - కల్లీబిద్దె. (వల్లించుచు) నాబర్రె సెర్వుంఢిన, కాళికమ్మోరిగుడి, యిదే ఐయ్యా! నా సామి రంగా! ఇదే, అయ్యుంఢేని!— బర్రెనుడిగినట్లు అమ్మోరు బైటి కెల్లుంఢాది! లోనదూరటాని కిదేయాల నాసామే! కల్లీబిద్దె - కల్లీబిద్దె! (లోనఁ బ్రవేశించి తలుపులు వేసికొనును.)

(అష్టభుజములతో కాళికాదేవి ప్రవేశము.)

కాళికా—(తలుపులను జూచి) ఎవఁడు నా యాలయకవాటమును బంధించి, లోపల ధైర్యముతో నుండ సాహసించినవాఁడు! ఇంతవఱ కెన్నఁడును ఇట్టి విపరీతముం గానమే! (తలుపుఁ దట్టి) ఓరీ! ఎవఁడురా? నాయాలయమునఁ గవాటమును బంధించి కూర్చున్నవాఁడు? పలుక వేమి? నీకు మృత్యువాసన్నమయ్యెనా యేమి? కండకావరమున నోడ లెఱుఁ

గక ముప్పదిమూఁడుకోట్లదేవతలను బలుబాములఁ బెట్టిన మహిషాసురుని మర్దించిన మహాకాళిని నన్నెఱుంగవు కాఁబోలును? దేవాంతక నరాంతకు లైన దైత్యదానవయక్షరాక్షసప్రముఖులే నాయెదుట నిలువలేరు నీ వెంత? బ్రదుకఁ దలఁచితి వేని యీ క్షణమే తలుపు దీయుము!

కాళి—వా గబ్బ నాయాలా? అమ్మోర నంగ నే, అడిలి పారే ననుకొంటివా? తియ్యి నసంగి తీసేదే, దబ్బర.

కాళికా—ఓరీ! దుర్మతీ, ఏ మంటివిరా! తలుపు తీయనే తీయవా? ఎంతసాహసము! ఎంత పోతరము! అతిక్రాంతవినయుఁడవై అప్రస్తుతప్రలాపంబు లాడుచున్న నిన్ను మదీయశాప నిర్ఘాతంబుల భస్మీకటలం బొనరించుదానను. కాచుకొమ్ము.

గీ॥ భయదనిర్ఘాతభీషణం బయిన నాదు
శాపశిఖిశిఖావళుల నాశనమొనర్తు;
దుర్మతీ! కాచుకొమ్ము నీదోషమునకుఁ
దగినఫలమిత్తు; జీవితాంతంబుఁ గూర్తు. ౨౧

కాళి—నిలు నిలశ్శె! అమ్మోరూ! నిలు! నేను దబ్బర్లాడే కొంఢె ననుకొంటివా? మిడిసిమిడిసి పడేవు! కోపగించేవు! సగ్గు సగ్గు. పెద్దకోకమీఁ దొచ్చుండాను! తీసి స్తివా తలుపుదెరిసేను. సదెంగ సెప్రుతుంఛాను. ఇనుకో! ఇనుకో! ఇనకుంటే సెడేవు. నాకా అమ్మోరుకొంఢే! ఇనకుంటే సెడేవు!

కాళికా—(స్వగతము) వీఁ డెవ్వఁడో, అనాగరకుఁ డగు మోటుమానిసి యని తోఁచుచున్నది. కాదేని, యింత నిర్భీతితో వచించునా? ఎద్దియో వరాభిలాషతో వచ్చినట్లున్నాఁడు. వీనిమాటలకు నవ్వును వచ్చుచున్నది! ఆగ్రహమును వచ్చుచున్నది! ఇప్పుడేమిచేయుదును? ఏదియెట్లున్నను తెల్లవారవచ్చుచున్నదిగదా! వీఁడు కోరువర మేదియో వేఁగమే యొసంగి, పంపివేయుట

యే శ్రేయస్కర మని తోఁచుచున్నది! ఆలయబహిర్గతనై యున్న నేను పరుల కంటఁబడుట ప్రమాదజనకము! (ప్రకాశము) ఓరీ! అట్లయిన, నీకోరిక యేమో శీఘ్రముగ వచింపుము!

కాళి—కళ్ళీబిడ్డే! కళ్ళీబిడ్డే!

కాళికా—కళ్ళీబిడ్డ యేమి? ఇది యేదియో, క్లిష్టసమస్యగా నున్నదే!

కాళి—కళ్ళీబిడ్డె—అంతేనన్నే! అంతే. నేను మఱిసే ననుకొంటివా? నాబర్రె పలికిన పలుకంతే! కళ్ళీబిడ్డె!

కాళికా—ఒరే! ఇది మా కర్థమగుట లేదు. మఱియొకమాఱు సరిగా నది యేమో తెలిసికొని రమ్ము.

కాళి—అబ్బ! మోసగింతలఅమ్మోరు నాకొంప! నల్లనల్లంగ ఎళ్ళనూకుదా మనుకొంటివా నన్ను! నీదబ్బరనుడుగులకి పడిపొయ్యేవోణ్ణి గాననుకో! కళ్ళీబిడ్డే-కళ్ళీబిడ్డే!

కాళికా—ఓహో! వీనితో, నసాధ్యకార్యము వచ్చినదే! వీనిచరిత్రమును, దివ్యవీక్షణములఁ దెలిసికొందునుగాక! (ఆలోచించి) ఔరా! ఎంత విస్మయము! వీఁడు జన్మాంతరశాపగ్రస్తుఁడై యిట్లు కిరాతజన్మముఁ గాంచిన శ్రీ శారదాదేవిగాఁ దోఁచుచున్నది! వీనిపరికృతనామధేయము కాళియై యున్నను, వీనిసుప్రసిద్ధజాతకమునఁ గాళిదాసుఁ డనుపేర ప్రపంచవిఖ్యాత కవిసార్వభౌముఁ డగు ఫలము లిఖితమై యున్నది! వీనిపలుకులకు "కాళి విద్య" అని యర్థము కాఁబోలును! బర్రె యని పల్కినది భార్యకు పరిభాషయై యుండును! ఈపురాధిపతియగు, ధర్మవర్ధనమహారాజు పుత్రికయైన శారదామహాసతి కీతఁడు కపటంబున వివాహం బొనరింపఁబడి నిజదారోపదేశంబున నిక్కార్యం బొనరించెను! ఏమైనను సరియే! వీని జాతకము మహత్తరంబైనది! వీనిని మహాపండితునిగా నొనరించెదఁగాక!

గీ॥ కాళి యను మోటుమానిసిగాఁ జెలంగు
వితఁడు మద్వరలాభసంగతినిఁ గాంచి
కాళిదాసాఖ్య నంది సత్కవితచేతఁ
గాంచుఁగావుత లోకవిఖ్యాతకీర్తి! ౨౨

(ప్రకాశముగా) ఓరీ! నీభావము స్పష్టమయ్యెను! కవాటముం దెఱువుము! నిన్నుమహాకవీంద్రునిగా నొనరించెదను!

కాళి— "కవి గివి" నాకు తెల్వక్లే! కల్లిబిల్లి! కల్లిబిల్లి!

కాళికా— అట్లే వరమిచ్చెదను, తెఱువుము.

కాళి— (సగము తలుపుఁ దెఱచి) కల్లిబిల్లి! కల్లిబిల్లి!

కాళికా— పూర్తిగా తలుపుఁ దెఱువుము.

కాళి— అమ్మా! దబ్బూ నాకొంచే! బాగ దెరిస్తే తన్ని మెల్లనూకేవు! నిన్ను నమ్మేనా అమ్మోర్తాయాలా! ఈడినుంచి, నాది నాకియ్యరాదా అంతే!

కాళికా— సరే! కానిమ్ము. ఇచటనుండియే యిచ్చెదను. నాలుకఁ దెఱువుము.

కాళి— (తెఱచును)

కాళికా— (నాల్కపై బీజాక్షరములను వ్రాసి) ఓమహాకవీ!

సీ॥ కాళీవరప్రసాదాలోకనంబుచే
కాళిదాసాంచితాఖ్యనుఁ జెలంగి
దివ్యసంస్కృతనాట్యకావ్యలేఖనమున
కవిసార్వభౌమవిఖ్యాతిఁ గాంచి
దశదిశాంతరసముద్ధతకీర్తిచంద్రికా
విశ్రాంతి జననుతప్రీతి మించి
భవితవ్యమున నట్టిభావయందును
భవదధికుఁడౌ సుకవి లేఁ డనఁగ వెలసి

గీ॥ భారతావని గీర్వాణభాష ముంచి
నేడు మొదలుగ జగమున నీడు లేని
ప్రతిభ నుపమానభూతఁడి ప్రాభవంబుఁ
గ్రాల నొప్పారుచుండెదుగాక! నీవు! (దీవించును)

కాళి— (తన్మయుఁడై కొంతతడవు కన్నులు మూసియుండి) ఆహాహా! ఏమి నాభాగ్యము? ఏమి నాభాగ్యము! నయనయుగళంబు నకు విభ్రాంతి నావహిల్లఁజేయుచు కోటిసూర్యప్రభాపటల దివ్యతేజం బొకండు నాయాత్మం బ్రవేశించి వినిర్మలకవితా ప్రవాహవీచికలను హృదయాంతరాళమునం బాతించుచున్న యది! సాక్షాత్కరించిన కాళికావరప్రసాదంబున బహుకాల మాహాత్మ్యంబు పటాపంచలయ్యె! ధన్యాత్ముండ నైతి! ధన్యాత్ముం డనైతి! (కన్నుల దెఱచి) ఓదేవి! సర్వమంగళా! కాత్యాయనీ! నీ యనుగ్రహం బెంతవారలకు లభింపవలయు!

సీ॥ దానవాంతకములై దాసరక్షకములౌ
గంభీరమృదుకటాక్షములతోడ
కలశ త్రిశూల శార్ఙ్గసుదర్శనకపాల
కరమండితభుజాష్టకంబుతోడ
మహిషదానవరక్తకవిహితపానోద్రిక్త
మగు భీమసింహవాహనముతోడ
చారువిశాలవక్షస్స్థలదీపిత
ప్రకటకపాలమాలికలతోడ
దైత్యరక్తాంక మగు ఫాలతలముతోడ
దిశలనిండిన తేజఃప్రదీప్తితోడ
నెదుట సాక్షాత్కరించిన హిమగిరీంద్ర
తనయఁ బ్రస్తుతిసేయ సాధ్యం బె నాకు? ౨౮

(కాళికాదేవిచుట్టును దిరిగి ప్రదక్షిణనమస్కారముల నొనరించుచు)

శ్లో॥ మాణిక్యవీణా ముపలాలయంతీం
మదాలసాం మంజులవాగ్విలాసాం
మాహేంద్రనీలద్యుతికోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి॥ ౧౬

శ్లో॥ చతుర్భుజే చంద్రకలావతంసే కుచోన్నతే కుంకుమరాగశోణే
పుండ్రేక్షుపాశాంకుశపుష్పబాణ హస్తే నమస్తే జగదేకమాతః॥

శ్లో॥ మాతా మరకతశ్యామా మాతంగీ మధుశాలినీ
కుర్యాత్కటాక్షం కల్యాణీ కదంబవనవాసినీ॥ ౧౭

శ్లో॥ జయ మాతంగతనయే జయ నీలోత్పలద్యుతే
జయ సంగీతరసికే జయ లీలాశుకప్రియే॥ ౧౮

(కాళిదాసు కాళికాదేవికి పాదనమస్కార మొనర్చుచుండును.)

[పటపరివర్తనము.]

ప్రథమాంకము సమాప్తము.

# భోజకాళిదాసు.

## ద్వితీయాంకము.

రంగము - శారదాంతఃపురము.

ప్రవేశము:—శారద.

శార—(గవాక్షమార్గమునుండి ప్రకృతిం దిలకించుచు) ఆహాహా! ఈయామినీరమణి, సాంద్రాంధకారసంఛన్న యయ్యు నెంత యొప్పియున్నది!

సీ॥ ఆశాంతరంబుల, నలమిన గగనంబు
డంబైన కాలచూడంబుగాఁగ,
తళ్కుతళ్కునఁ దోఁచు, తారకానివహంబు
పొలుపైన తారావిభూషగాఁగ,
కడలాక్రమించిన కాలాంధకారము
రమణీయ నీలాంబరంబుగాఁగ,
మందంబుగావీచు మారుతాహతి ప్రియ
విశ్లేషనిశ్వాసవిధముగాగ,

తన విభుని సుధాకరునిరాకకై ప్రతీ
క్షించి వనటనొందు చంచలాక్షి
రీతిఁదోఁచు; యామినీ తరుణీమణి;
ప్రకృతికిని వియోగ బాధగలదు.

ఇప్పుడు యామినియందలి నాలవజాము నడుచుచున్న యది. మహామాతయగు కాత్యాయనీదేవి పురసంచారము

నుండి పునరాగతయగు సమయంబై యుండును. హృదయేమొ యింత వడఁకుచు న్నాది, తడవు సేయుటకుఁ గారణమేమోకదా! వెళ్లినకార్యము శుభమయ్యెనో, అశుభమయ్యెనో తెలియరాదు......ఎవ్వరిదో పదసంచలనం బగుచున్నది. ప్రాణేశుఁడే యైయుండును. (లేచును.)

(కాళిదాసు ప్రవేశము)

కాళి—"శ్లో॥ మాణిక్యవీణా ముపలాలయంతీం" (అను శ్లోకము చదివి) తల్లీ! నీవు నాపాలిటి భాగ్యదేవతవు! నీదయారస ప్రాప్తిచేఁ బరమమూర్ఖుఁడను పండితుఁడనైతిని. వివేకరహితుఁడ, విజ్ఞానశాలినైతిని! బహుతరకోటి జన్మాంతరంబుల నీకు దాస్యంబు సల్పినన్నైన, నీ మహాఋణభారమునుండి విముక్తుండఁ గానోపను.

సీ॥ నను సేఁగా! మత్పాపసందోహమెల్ల మా
యమ్మరో! నీకృపనమ్మచేత
విడచెఁగా! నాయవివేకదుర్భాగము
ద్భుతభవదుపదేశవితతిచేత
ఆవిర్భవించెఁగా! యసమానపాండితి
జననీ! నీయాశీర్వచనముచేత
ప్రవహించెఁగా! కవిత్వమహాలహరి నిరా
ఘాటమా నీయనుగ్రహముచేత

కాళిగాఁడు నేఁడు, కాళిదాసుండయ్యె
పరికృతిచేత పూర్వసుకృతిచేత
తరుణి నీవు గావు; తల్లివి; తథ్యంబు
శారదామతల్లి సుగుణవల్లి! (నమస్కరించును) 30

శార—నాథా! నాథా! ఇది యేమి విపరీతము? మీధర్మపత్నిని—మీదాసురాలిని—నన్నిట్లు సంభావించి, పాపం బొడిఁ గట్టుటకు నే నొనరించిన యపరాధ మేమి?— గురుఁ డసూయాప

రుండై యొనరించిన దౌర్జన్యంబునకుఁ దగినఫలంబు గలిగెనను ప్రమోదంబున నున్న నన్ను వెండియు మీరు విసర్జింపఁ జూచిన నాబ్రదుకునకుఁ బ్రయోజనమేమి? ఈయౌవనం బేల? ఈసౌందర్య మేల? ఈ నాపాండితి యేల? నాథా! భవత్కృపాపరిలబ్ధికై చంద్రచకోరన్యాయముగ నాసించియున్న నీతరుణిని వన్నిట్లన్యాయము సేయఁ బాడియగునా?

కాళి—తల్లీ! నీవు నాతరుణి వనుట మహాపరాధము. క్రూరకిరాతజన్ముఁడనై మూఢుఁడనై యధఃపతితుఁడనైన నాపాలిటికి నీవు నవజీవనప్రదాయినివి. నేను నీపాదదాసుఁడను. యుష్మత్పాదపంకేరుహామకరందరసక్షాళనంబున మత్పాపపంకంబు దూరీకృతంబయ్యె. యుష్మత్పవిత్రమూర్తిని ప్రాతస్సాయంకాలములయందు సహస్రదళపద్మసహస్రంబులఁ బూజించెద! ధ్యానించెద! తరించెద!

సీ॥ మాతరో! భవదీయమహిమస్మరణమున
గడువేడ్క దినములు గడుపువాఁడ!
తల్లిరో! కడుపవిత్రంబైన నీమూర్తి
నిరతంబు నెమ్మది నిలుపువాఁడ
అమ్మరో! త్వద్దత్తమగు పాండితిని నీవొ
సంగినభిక్షగాఁ జాటువాఁడ!
జననిరో! విలిఖితాక్షరకోటియందుఁ ద్వ
త్కరుణామృతరసంబుఁ గాంచువాఁడ!
తల్లి వంచు నిన్ను ధ్యానించువాఁడ; నీ
నామజపము సతము నొనర్చువాఁడ!
తరుణి వీవు గావు తల్లిరో! నాదివ్య
భాగ్యలక్ష్మివౌట ప్రాప్తమమ్మ!

శార—హృదయేశా! ఆపఁలుకు వలదు; మాతృసంబోధనంబు నా శ్రవణములం జిలికి నన్ను దురపిల్లఁ జేయకుము! మద్భాగ్యవిశేషంబున నీవు, పండితశిఖామణి వైతివి! నీ వవిద్యా

స్యుండవని యెంతగా నాక్రోశించితినో, విద్యాకుశలుండవైతి వని యెంతగా ముదమందుచున్నదాన! ఇట్టియెడ నన్ను భాగినిం గావించినందువలన నీపాండితికిఁ బ్రయోజన మేమి?

సీ॥ కులదార నీరీతి ఘోషిల్లఁజేయుట
ధర్మమా! నీకు స్వధర్మనిరత!
పతియె దైవంబని భావించు సాధ్విని
వేఁప న్యాయమా? సాధుచరిత!
నెఱజవ్వనమునఁగల నెలఁత నడవిపాలు
సేయుట యుక్తమా? జీవితేశ!
ధర్మపత్ని విసర్జితఁజేసి యలయించు
టొప్పమా? వరపండితాగ్రగణ్య!

ఆ॥ వృద్ధఁగాను; రూపహీననుగాను; నా
కాల మెన్నినాళ్లొ గడువవలయు;
నింత బాల్యమందె యిటు పతియుండియు
లేక యుండఁజేతువా? కవీంద్ర! 32

కాళి—తల్లీ! నీవు వచించినదెల్ల వాస్తవంబు; ఐనను నేనేమి చేయుదును? నాహృదయమున నీయందు భక్త్యేతరభావంబునకెడము గాన్పించుటలేదు. ఇట్టి నేను నిన్ను దారగాఁ బరిగ్రహింప నెట్లు సమ్మతింతును? ఒకవేళ నీయాత్మసంతృప్తికై "సతీ" యని పిలుతునే యనుకొమ్ము; ఆశబ్దమునకు పతివ్రతార్థము చెప్పుకొనవలయునే కాని, కళత్రార్థముం జెప్పుకొనఁజాలను. ఇహసంబంధదూరమైన మన యన్యోన్యసమావేశమువలనఁ బ్రయోజనమేమి! వేయేల? తల్లీ! వీఁడు వెనుకటివ్యక్తి కాఁడు! వెనుకటి జీవితముకాదు; ఈ జీవితము పరిపూర్ణవిభేదస్థితి నందియున్నది. ఇప్పుడు వీఁడు పతికాఁడు. శిష్యుఁడు-పుత్రుఁడు— అమ్మా! నీహృదయాందోళనము మాని, నాకనుజ్ఞనిమ్ము. స్వేచ్ఛావృత్తిం జరించుచుఁ గవితాదేవ్యుపాసకుండనై దినంబులు బుచ్చెద. ఇంతకన్న నీవేమి వచించి

వను, నాహృదయ మన్యవృత్తిం బరివర్తిల్ల సమ్మతింపను. తల్లీ! ఆగ్రహావశురాలవు గాక నాహృదయ నిజతత్త్వమును గుర్తించి, నీయాశాలేశమును విచ్ఛేదము గావించుకొనుము.

శారద—కటకటా! ఎంతదుర్గతి! ఎంతనిరాశ! ఎంతసంతాపకర జీవనము! హృదయేశ్వరా! నేను నీకొనరించిన యుపకారమే తుదకు నాకపకారముగాఁ బరిణమించెనా? వివేకమే అవివేక ప్రదర్శన మొనర్చుచుండెనా? విద్యయే అవిద్యాస్ఫూర్తి ఘటించెనా? పాండితియే పాపకార్యప్రబోధకం బయ్యెనా? నీకు వరప్రదానమైన కాళికాసాక్షాత్కారము నా కాజన్మ దుఃఖప్రదాయకంబగు శాపంబయ్యెనా?......అయ్యయ్యో నాదుఃఖమునకిఁక, నెన్నటికిని పారము లేదా?

ఆ॥ గురుని పాండితికిని, ఘోరఫలంబుగా
మూఢుఁడైన విభునిఁ బొందనైతి,
ధవుని పాండితికి నధర్మఫలంబుగా
పతి విసర్జనంబుఁ బడయనైతి॥ 33

ఇంక నెవ్వరి పాండిత్యంబువలన మాత్రి మేమిప్రయోజనము! పండితునకును శుంఠకును, భేదములేని యెడల, విద్యాసంపాదన లాభమేమి? కాళికాప్రసాదము నంద నిన్నుఁ బేర్కొనకుండినచో - మూఢుండవైనమానె - నీసౌందర్యముం జూచుకొని, యానందముతో నిహలోకసౌఖ్యానుభవమునైన నందియుందునే? నాథా! తుదకు, నాకంఠము నుత్తరింప - నాయుధమును, నేనే వెదుకుకొంటినా? ఇంతఘోర మీజగంబున నెందేనిఁ బరివర్తిల్లి యుండునా? ఇంతకన్న కాంతకు వేఱొక నరకబాధ గలదా? జీవితేశా! మనోవాక్కాయ కర్మంబుల, నిన్నుఁదక్క యన్యగతిని గాంక్షించి యెఱుంగని దానను; మాంగల్యముం గట్టిన కాంతయెడల మాతృభావముం జూపుటయే పాపతరకార్యమో భగవదుద్దిష్టంబగు నిజదారగమనమే పాపతరకార్యమో, ఇంచు

కంత యోచించిచూడుము. విద్యావిశారదుండవైనందుల కిది సల్లక్షణంబుగా నేరదు. నిజదారహృదయసంక్షోభము పురుషున కెన్నఁడును అభ్యుదయకారణంబుగాదు. గృహంబున వాత్మ పత్ని వదలుకన్నీటి బిందువులు మహాగ్నికిణంబులై పురుష యత్నంబు నఖిలంబును విచ్ఛిన్నం బొనరించును. నా పలుకులయందలి యంతరార్థంబును విమర్శకబుద్ధితో నాలోచింపుము! ఇది వినోదంబని యెంచకుము! మానవజీవితంబునం, దిది యొకదుర్ఘట సమస్యయని తెలిసికొనుము! ఇందువలన నిహపరంబుల రెంటికిం జెడుటయే ఫలంబగును! ఏయాశయంబును, నీవు మహోత్తర పవిత్రంబని తలంచుచుంటివో అదియే ప్రాజ్ఞులచే దూషితంబు - ఇహమున కలుషితంబు - పరమున భయంకర యమయాతనాపథప్రవర్తకంబు. నాథా! నామనవిగని మనయుభయుల జీవనంబును పవిత్రముగను ఆనందకరంబుగను నొనరింపుము! "మాతా" యను నుడి మానుము. నిజధర్మపత్నినిగా నన్నుం జేకొని, మత్పితృరాజ్యభోగంబుల కధికారవై సమస్తసామంతరాజ సంసేవిత పాదారవిందుండవై యిహపరసౌఖ్యానుభూతినిఁ జెలంగుము.

కాళి—జననీ! చెవిటివానియెదుట శంఖము నూదినచందమున, నన్నేటికి నీ దీర్ఘతరోపన్యాసములచే నలయించెదవు? ఇహసౌఖ్య వాంఛ, అందును నాకు దేశికురాలవైన, నీతోటియిహసౌఖ్య వాంఛ, హరి హరీ! నాహృదయమున నీమన్మాత్రమైన జనియింపదని మనవిచేసితినే! మఱల నేటికి నీ వలతనంది నన్ను కలఁతఁ జెందించెదవు? కాళికావరప్రసాదంబున ధన్యుండనైతి! ఆజన్మాంతము నీయందు భక్తివిశ్వాసంబులను మానను. నీ హృదయంబును నాపవిత్రవర్తనంబున నిష్ఠురపరచియుందునేని మన్నింపుము, మన్నింపుము. సెలవిమ్ము. పోయివచ్చెద!

శార—అయ్యయ్యో! పోయెదవా? ఎక్కడికి?

కాళి—మత్కులదేవతోపాసనంబున కర్హమైన పావనస్థలంబునకు.

శార—అది యెక్కడనున్నది?

కాళి—కాళికాంబయే చూపఁగలదు!

శార—ఈరాత్రియే పోవకతప్పదా?

కాళి—అమ్మా! తేపట విశేష మేమైన నుండునా?

శార—నాథా! ఈయభాగిని జన్మంబున కొక్కరాత్రియైన సుఖానుభవము నొసంగవా?

కాళి—తల్లీ! పవిత్రజీవితంబును నిర్ణయించుకొనినపిదప ఒక్కరాత్రి కళంకపరచినందువలన వచ్చుప్రయోజనం బేమి?

శార—అంతేనా? ఈజన్మమున బ్రహ్మచారిగ నుందువా?

కాళి—ప్రయత్నింతును!

శార—సందేహ మేకద!

కాళి—చెప్పఁ జాలను.

శార—నిజదారగమనమే కాని పాపముకాదుగదా! ఈరాత్రిమాత్రముండుము! పిదప నేనును, వైరాగ్యవృత్తిచే దినంబులు గడుపుదాన! నీవును నీవనినట్లే సాధ్యమైనచో, బ్రహ్మచర్యము నే యవలంబింపవచ్చును.

కాళి—మాతాయని పిలిచి మఱియొండు భావమునకు లోఁబడఁజాలను. తల్లీ! నన్ను వదలుము పోయెదను.

శార—నాపచించినదెల్ల వ్యర్థమేనా? ఇఁక నాజీవితము నడవిగాచిన వెన్నెలం జేసెదవా?

కాళి—అమ్మా! అది దైవఘటవము!

శార—(కోపముతో) ఛీ! మూర్ఖుఁడా! ఎన్నివిధంబులం జెప్పినను, పెడచెవిం బెట్టితివిగా! పొమ్ము. పొమ్ము. ఆఁడుదాని నిట్లు క్షోభింపఁ జేసిన నీ కాఁడుదానిచేతనే దుర్మరణంబుగలుగుఁగాక! నేను నిక్కంపుసాధ్వినైతినేని, నాపల్కులు వేదాక్షరములట్లు వర్తిల్లి నీపాపంబు నీకుఁ గట్టికుడుపును గాక!

కాళి—(వినయమున తలవంచి) తల్లీ! నీయాగ్రహమునే యనుగ్రహముగ భావించి తృప్తినందువాఁడ! నాప్రాప్తి యెట్లున్న నట్లు గాకపోదు. సెలవిమ్ము.........ఓజగచ్ఛక్తీ! భవానీదేవీ! నాకు, భవిష్యజ్జీవనమార్గమ్ముం బ్రదర్శింపుము.

(నిష్క్రమించును.)

శార—(నివ్వెరగంది) ఆహా! పోయెనా? పోయెనా! నాజీవితేశ్వరుండు వెడలిపోయెనా? నాజీవితమును గాఢాంధకారమున ముంచి పోయెనా? ఎంతదుర్మతిన్నై శపించితి? ఎంతయవివేకినినై పాపం బొడిఁగట్టుకొంటి!—ఇఁక నాకేదిదారి? భర్తృసౌఖ్యప్రాప్తి లేని నాకీ వైభవంబులేల? ఈసౌధంబులేల? ఈచీనిచీనాంబరములేల? ఈరత్నభూషలేల?—ఓకాళికాంబా! నాపతికివోలె నాకును పవిత్రజీవనమార్గమ్ముం జూపుము! నీపాదధ్యానంబున జీవితశేషముం గడపెదను.

సీ॥ ఇహమును రోసితి, సోమహేశ్వరి! నీపాద
దివ్యసంసేవయే దిక్కు నాకు
ఈభవనంబు మహాభయంకర మింక
వనమె జీవనశుభప్రదము నాకు,
బాంధవ్యసంబంధపరత హేయమ్ము శాం
భవి! నీవె సర్వబంధువులు నాకు,
ఏభాషణంబు వచింపనోపను నోట
దేవి! త్వన్మంత్రమే దిక్కు నాకు,
పతినిబాసి బంధువితతుల నెడఁబాసి
పావనంబు సర్వభద్రము నగు
సత్ప్రశాంతవృత్తి జపమాలతోడుగా
గడుపుదాన! శుభముఁ గాంచుదాన!

(నిష్క్రమణము.)

[పటపరివర్తనము]

ద్వితీయాంకము సమాప్తము.

# భోజకాళిదాసు.

## తృతీయాంకము.

### 1. రంగము - భోజరాజు ఆస్థానము.

ప్రవేశము:— ఏకసంతగ్రాహి; ద్విసంతగ్రాహి; త్రిసంతగ్రాహి.

ఏక—మిత్రులారా! మన ప్రజ్ఞావిశేషముచేత తన యాస్థానమునకు సత్కవు లెవ్వరును రామిం జేసి, భోజమహారాజు హృదయమున ననుమానగ్రస్తుఁడై మొన్నటి దినంబున నాతో, "పండితోత్తమ! నా సభకు, వెనుకటివోలె కవీంద్రు లేల రాకున్నవా"రని యడిగెను. అంతట, నేను సవినయముగ మహారాజుం జూచి, "మహాప్రభూ! కేవల చతుర్ముఖు లంతటివారగు తమ యెదుట కవిత్వము చెప్పి నిలువఁగల కవి యొకఁడు గలఁడా? అందుచే తమ తమ యసమర్థత ప్రకటింపఁ బడునను భీతిచే నొక్కఁడును రాకున్నవాఁడు." అని పలికితిని. దానితో ధరాజాని పరితృప్తుండయ్యెను.

ద్విసం—ఆర్యా! తమప్రజ్ఞ యసాధారణముగదా! తమరు ఏకసంతగ్రాహులగుటచేతనే మన మువ్వురి మర్యాదలును దక్కుచున్నవి! ఎట్టి మహాపండితోత్తముం డెట్టి కఠిన శ్లోకమును రచించి తెచ్చినను ఒక్కమాఱు వానిచేఁ జదివించి విన్నంత మాత్రమున మీరు గ్రహించి మరలఁ జదివి "ఇస్సీ! ఇది నాచిన్ననాఁడు చదివిన శ్లోకమండీ!" అని పలుకుదురు! మీరిద్దఱు చదువుదురు గాన ద్విసంతగ్రాహినగు నేనును వెంటనే

దాసం బఠించి తమ వాక్యమునందలి సత్యమును ధృవపఱ తును. ముప్పురు చదివిన పిదప తానును చదువుల మన త్రిసంతగ్రాహిమిత్రున కసాధ్యముకాదుగద!

త్రిసం—ఈవిధమైనయుక్తిచేత మనము పండితులను సులభముగా గెలుచుచుండుటచేత, మనప్రతాప మెన్నినాళ్లకును కాంతి మాయకుండునని తలంతును.

ఏక—ఉస్!......ఊరకుండుఁడు! ఎవరోవచ్చుచున్నారు. మనమాటలు వినఁగలరు.

(ఒకపండితుఁడగు కవిప్రవేశము)

కవి—పండితోత్తములారా! నమస్కారము!

ఏక—మీ రెవ్వరు? వచ్చినపనియేమి?

కవి—మహాత్మా!

గీ॥ కవిని; నిరుపేదవాఁడను; కవిత లేని
ప్రాపకంబున సత్కృతిఁ బడయఁదలఁచి
ప్రియమున మిమ్ము దర్శింప వచ్చినాఁడ!
నీ దరిద్రునిఁ గృపఁజూడుఁడీ మహాత్మ!

ఏక—అయ్యా! అట్లుకానిండు! ఇందులకింతగా మమ్ము వేడవలయునా? అర్థిజనకల్పవృక్షమై భోజధరాధీశుఁడు కవిజనకామితార్థములం దీర్చుచుండ, మే మించుక మాట సహాయమైనఁ జేయలేకుందుమా! ఈపీఠమునం దాసీనుఁడై సావధానముగఁ బ్రస్తావింప నగును.

కవి—అమ్మయ్య! ఇప్పటికి నా హృదయము కుదుటఁ బడినది! (కూర్చుండును)

(కాళిదాసు ప్రవేశము.)

కాళి—(స్వగ) ఈయాస్థానమున ఏకసంతగ్రాహియు, ద్విసంతగ్రాహియు, త్రిసంతగ్రాహియు నను మువ్వురు దుష్టకవులు గల

రనియును, వారు, రాజపారిపకంబునంజేసి యెట్టిపండితులనైన మోసంబున నోడించుచున్న వారనియునువింటిని!(ఎదుటఁజూచి) ఓహో! ఆముగ్గురే ఆస్థానకవులై యుందురు. ఈనాల్గవవాఁడు క్రొత్తగా వీరివద్దనం బెఱుఁగకవచ్చిన కవియై యుండును. నేను విన్న చిత్రనాటకం బిప్పుడే స్పష్టముగా, ఈ మరుగుననుండి చూచెదఁగాక! (చాటుననుండును)

ద్విస—అయ్యా! కవీంద్రా! ఏదీ తాము విరచించినవానిలో నుత్తమం బగు నొక శ్లోకముం జదివి మాకుఁ గర్ణరసాయనము గావింపుఁడు!

కవి—మహాభాగ్యము. అవధరింపుడు. (చదువును).

శ్లో॥ యద్వాగ్గుంభా శ్శుశుంభు ర్భుజగ పరిభృఢ క్షీణ సంక్షోభ భావో
త్పుష్ఠ ప్రత్యక్షిద్భృష్ఠ త్కసకధర లస చ్ఛృంగ భంగాధి స్పష్టౌ,
ప్రోద్య ద్ఘుంఘూనభస్వ ద్భ్రమణ గణ లసద్దంభ శుంభ త్సగర్భాః
ప్రావృడ్ఢారాధరౌఘోద్భవ దశని సమార్భట్యధి క్షేపదక్షాః.

ముగ్గురు—(నవ్వకొందురు)

కవి—అయ్యలారా! ఏటికి నవ్వెదరు? శ్లోకము రసహీనం బనియా?

ఏక—అయ్యా! నీ వొకవేళ మమ్మైమైన పరిహాసము చేయుటలేదు గదా యని నవ్వితిమి.

కవి—పరిహాసమా! శ్రీరామరామ! ఎంతమాటాడితిరి?

క॥ ఘనతరదరిద్రజలధిని
మునిఁగిన న న్నొక్కతీరమునఁ జేర్పఁగ నే
వినయమున వేఁడెదనుగా
కనఘా! మిముఁ బరిహాసింతునా! కవివర్యా! 32

ఏక—కాకున్న, నీశ్లోకమును నీవు రచించిన ట్లనృతములుపల్కి, మమ్ము మోసగింప నేమైన నుద్దేశించితివా?

కవి—అయ్యయ్యో! నే నాడిన యనృతముగాని, నే నొనరించిన మోసముగాని కలదా? మహాత్మా!

ద్విసం—అట్లయిన, నిజముగా నీశ్లోకమును నీవే రచించితివా?

కవి—నిజముగా నిది నాస్వకపోలకల్పితశ్లోకమే!

త్రిసం—ఓయి వెట్టిబాపఁడా! మాయెదుట నిట్టియనృతమాడిన నాడితివిగాక మహారాజు నెదుటమాత్రి మిట్టి దుష్టప్రసంగమును విప్పకుము. రాజదండనకు పాత్రుఁడవు కాఁగలవు! ఈశ్లోకమును మాచిన్ననాటినుండియు వినుచుంటిమి!

కాళి—(తలపంకించి) అనుకొన్నంతయు నైనది. ఫలతరుమూలముల యందలి ముండ్లకంపలవలె రాజాస్థానములం దిట్టి దుష్పండితు లుండిన నెంతటిమహామహులుమాత్రి మేమి చేయఁగలరు?

కవి—(తెల్లపోయి) అయ్యో! ఈశ్లోకమును మీరు చిన్ననాటినుండియు వినుచుంటిరా? ఇది సక్కమా?

ఏక—సక్కమా? ఇది మాముప్పూరికును, కంఠగతమైనశ్లోకమే! సందేహించెద వేని చదివెదను వినుము. (పూర్వశ్లోకమును చదువును)

ద్విసం—ఇది నాకును వచ్చును. (చదువును)

త్రిసం—ఇది మాతండ్రిగారు నాచిన్నతనమునం జదువుచుండగా విని, నేను వల్లించితిని. (చదువును)

కవి—(విస్మయనైరాశ్యములతో) హా! మాలదైవమా! స్వర్గమునకుఁ బోయినను ఒడియేకులు తప్పలే దనునట్లు భోజరాజేంద్రునాస్థానమునం గూడ నేను దరిద్రుఁడనే కావలసివచ్చెఁగదా!... పండితోత్తములారా! నే నింక సెలవుగైకొందును.

(నిష్క్రమించును.)

ఏక—భళీ! చక్కగా శృంగభంగమైనది! (నవ్వును)

ద్విసం }<br>త్రిసం } (నవ్వుదురు.)

కాళి—(స్వగ) ఓరి! దుర్మతులారా! పరమేశ్వరుఁడు మీతుళ్లిపాటు నిఁక ననతికాలముననే యణంచును లెండు! తొందఱ పడనక్కఱలేదు.

ఏక—మిత్రులారా! ఇది మనకు నిత్యకృత్యములలోఁ జేరినవిషయమే కాని రాజేంద్రుఁడు తనపాలి కెవ్వరును కవులురామిం జేసి మనయందసంతృప్తిం దాల్చియున్నాఁడు. ఇందుల కేది యాలోచనము?

ద్విసం—అసంతృప్తిమాత్రమే కాదు. కాలక్రమమున అనుమానమును గలుగవచ్చును. రహస్యభంగమైనయెడల మనకంఠములకుఁ జుట్టుకొనును.

త్రిసం—ఎవ్వనినేని, యసమర్థకవి నొక్కని రాజేంద్రుని యెదుట నుంచుటయే యిందులకుఁ దగినయుక్తి.

ఏక—సెబాస్! చక్కఁగ నాలోచించితివి!

ద్విసం—ఆపని సత్వరముగనే చేయుటమంచిది! కాని యెవ్వనిం జూచినను ప్రౌఢాలంకారసమన్వితం బగు కవిత్వముఁ జెప్పఁగలిగిన వాఁడే వచ్చుచున్నాఁడుగాని మందబుద్ధి కనఁబడుట లేదు.

కాళి—(స్వగ) భళీ! వీరి యాలోచన మిప్పుడు నా కనుకూలమైయున్నది. ఇదే మంచితరుణము. ముందుగా వీరిని దర్శించి కన్నులలో కారము చల్లెదఁగాక! (ఎదుట నిల్చి) కవిశిఖామణులారా! అనేకవందనములు !

ఏక—అయ్యా! కూరుచుండుఁడు! మిమ్ముఁ జూడఁగా, గొప్పకవీశ్వరుల వలె నున్నారు. రాజదర్శన మపేక్షించి వచ్చితిరా ?

కాళి—(కూర్చుండి) చిత్తము. నా యభిలాష మదియే! అందులకు తమ సహాయము నర్థించి వచ్చితిని.

ఏక—ఆహా! సహాయమున కభ్యంతరమేమి?......అట్లయిన తాము రచించిన శ్లోకములోని హృదయరంజకమైన శ్లోకమునొక్కటి పఠింపుఁడు. విందుము.

కాళి—భాగ్యము! ఇది నా రచనములం దత్యుత్కృష్ట మైనది.

శ్లో॥ అస్తివద్ బకవచ్చైవ చల్లవత్ తెల్లకుక్కవత్,
రాజతే భోజ తే కీర్తిః పునస్సన్న్యాసి దంతవత్. * 37

ఏక—ఓహోహో! ఎంత సమాజసమైన కవిత్వము! ఎంత ధారాశుద్ధి గల కవిత్వము! ఎంత ప్రసిద్ధోపమానసహిత కవిత్వము!

ద్విసం—ఇంతకుం బూర్వమున సిద్ధప్రభావకవి శేఖరు లెవ్వరేని యిటకు దయచేసియుండలేదు.

త్రిసం—ఇది మీయదృష్టము పండినదినము. మహారాజు మీకవిత్వ శుద్ధి కానందించి తప్పక గొప్పబహుమానము చేయును. ఇది నిశ్చితార్థము!

ఏక—అయ్యా! మహారాజు సభకు రావేగమే తమ్ముం బిలువ నంపి దర్శనము చేయింతుము! అంతదనుక హజారమున వేచియుండం బ్రార్థింతుము.

కాళి—చిత్తము. (పరిక్రమించుచు స్వగతము) ఈదుష్టులు నన్ను మెచ్చినట్లు నటించుచు స్తోత్రము చేయుచున్నారు! వీరు తప్పుకోనుచున్నగోయి వీరికొఱకే యుపకరించుంగాక! (నిష్క్రమి)

ఏక—మిత్రులారా! మనము సంకల్పసిద్ధులము! ఈమందబుద్ధికి రాజేంద్రునిదర్శనము చేయింతము! ఈయపకతవకకవిత్వమును విని కవు లన్న నసహ్యపడితీరును. అందువలన మనకీర్తి చిరస్థాయిగా నుండును.

(తెరలో) శ్రీమదర్థిజనకల్పభూజ, శ్రీభోజరాజేంద్రునకుజయము!

---

* గీ॥ హేనృపాలక! నీకీర్తి యెముకవలెను
చల్లపోలిక తెల్లని శ్వానమువలె
బకముచందాన సన్న్యాసిపండ్లవోలెం
బొల్పుదగియున్నదయ్య! శ్రీభోజరాజ! 38

ద్వా—అదిగో! మహారాజు రాకను దౌవారికు లెఱిఁగించుచున్నారు.

(అందఱును లేచి నిలుతురు)

(తరువాత సపరివారుఁడగు భోజమహారాజు ప్రవేశము)

రాజు—కవీంద్రులారా! నమస్కారము. (సింహాసనాసీనుఁ డగును)

ముగ్గురు—దిగ్విజయప్రాప్తిరస్తు! అనంతసౌభాగ్యమస్తు!

రాజు—నేఁడుసయితము మన యాస్థానమునకుఁ గవీంద్రు లెవ్వరును రాలేదా?

ఏక—సంకల్పసిద్ధు లగు తమకోరిక రిక్తమౌనా? నేఁడొక మహాకవి తమ దర్శనాపేక్షచే నరుదెంచినాఁడు.

రాజు—అట్లయినఁ బిలిపింపుఁడు; ఆలస్య మేల?

(కొందఱుసభ్యులు ప్రవేశించి రాజునకు నమస్కరించి ఉచితాసనాసీను లగుదురు.)

ఏక—దౌవారికా! ఆవల వాకిటనున్న గౌడపండితునకు రాజాజ్ఞ నెఱిఁగించి, లోనికిఁ బ్రవేశపెట్టుము.

దౌవా—భాగ్యము.

(నిష్క్రమించి కాళిదాసుతోఁ బ్రవేశము.)

రాజు—కవీంద్రా! నమస్కారము. ఈ పీఠమున నాసీనులు గండు!

కాళిదా—హే మహారాజరాజేంద్రా!

శ్లో॥ వాశ్చారేత్థవ్రజధగ్ధిలతోడ్వధిపతిః కుధేడ్జజానిర్గణే
ద్గోరాదారుమురన్నరేమకుతరగ్రైవేయకభ్రాడరం
ఉడ్వీడ్త్రుజ్ఞుంకాస్థిభృత్క్రిదృగిభేడార్ద్రాజనాచ్ఛాదన
స్సన్యాదంబునుదంబుదాళిగళరుగ్దేవోముదేవోమృడః. ౪౦

శ్లో॥ మజ్జామజ్జఖరాడ్జపీడ్జనసుధాడ్జాలాంశ్చమజ్జాఖరే
జడ్జట్కిటిక్కిధరాడ్ఢరేడ్భునఘనః ఖడ్గోతపీడ్యడ్భ్రిమా
పీడ్యాలుడ్భ్రిమలుట్ప్రయట్ప్రయపదాడడ్గ్రిడ్గ్రిడగ్రిడ్గ్రివా
పాదాకేట్ప్రటటట్ప్రటట్ప్రటరసత్ప్రఖ్యాతసఖ్యోదయః. ౪౧

శ్లో॥ దైవత్యేష్టృద్ధ్వజిపిష్టృతాద్రి రఘుధగ్గర్మపరిడిశ్వస్య
డరిక్షుః పేరిక్షుణపేక్షనుర్థ దృగిభేదా స్త్రుటభద్వదరిమేట్
దే వేడీపితపత్సు నాతు విగ హేం దానుద్ధయూవాడ్విరా
ట్స్వవ్వస్త్రిగ్బ హంసుడీ ప్రాహ్యం పభేదుర్జిష్మద్వరద్విభుః॥

శ్లో॥ తిగ్మత్విత్సితరుద్రుద్ధృగ్యగిపద్మ క్షోద్మక్షుగ బ్జాక్షియు
గ్భద్యావృయుట్ఫణిరాట్ప యేద్మతమ హేంభృద్రాభ స్మహాచక్రవాట్
పాయాన్నో ఘుధగింబుమగ్మ నుపిన్యో దివ్యద్ధృదజ్జ్యోత్స్నవి
స్ఫ భ్రాభీష్టద నామధుగ్భనసుష్బ్రిహాస్మండరట్ఛ్రివిరాట్.

శ్లో॥ శుండాలేశ్వడనీల కాండవినుతో పిటాకుండ కాండేవృషే
టాకుండః కాండజ కాండ కాంపధరజద్భూండచూడామణిః
శుండాలాస్యషడాస్యపేవ్యచరణం సౌఖ్యం శివ స్సాదరం
దద్యా దద్య సకాండకాండదగళ త్వటుకుండలీటుకుండలీ.

(అక్షతలు భోజరాజు శిరమునఁ జల్లును. రాజును సభ్యులును ఆశ్చర్యపడుదురు)

క—(దిగ్భ్రాంతుఁడై వెలవెలఁబోవుచు స్వగతమున) ఓహో! తప్పక గొప్పమోసము జఱిగినది. ఇతఁ డెవ్వఁడో సరస్వత్యపరావతారమువలె నున్నాఁడు! ఇంతటిమహాశక్తిసంపన్నుఁడయ్యును వెఱ్ఱివానివలె మమ్ము మోసగించి తుద కిట్లు విజృంభించినాఁడు! నాకు కాలఁదిగనట్టియున్నందున నా శ్లోకములు నోటఁబట్టుట లేదు. నాయేకసంతగ్రహణశక్తి లోపించుటచే, మిగత నాముద్దుతమ్ము లిద్దఱును శక్తిహీనులే యైరి! నేటితో మాకు దుష్కాలము ప్రాప్తించినది! ఏమి చేయుదుము!

రాజు—మహాకవిసార్వభౌమా! యుష్మత్కవనామృతప్రవాహమునం బడి, మే మెచ్చుటికో కొట్టుకొనిపోవుచున్నారము. మఱికొన్ని శ్లోకములచే శ్రవణరంజనము చేయుఁడు!

కాళి—

శ్లో॥ మహారాజశ్రీమన్ జగతియశసా తే ధవళితే
పయఃపారావారం పరమపురుషోయం, మృగయతే
కపర్దీ కైలాసం, కవివరమభౌమం కులిశభృత్
కళానాథం రాహుః కమలభవనో హంసమధునా. ౪౫

రాజు—(దక్షిణాభిముఖుండై కూర్చుండును.)

కాళి—(స్వగతము) రాజేంద్రుండు సంతుష్టిఁ జెందెనా యేమి? కానిమ్ము; ప్రయత్న లోపము చేయుదునా? (రాజున కభిముఖముగాఁ దిరిగి.)

శ్లో॥ నీరక్షీరే గృహీత్వా నిఖిల ఖగతతీర్యాతి నాళీకజన్మా
తక్రం ధృత్వాతు సర్వా నటతి జలనిధి శ్చక్రపాణిర్ముకుందః
సర్వానుత్తుంగశైలాన్ దహతి పశుపతిః ఫాలనేత్రేణ పశ్యన్
వ్యాప్తాత్వత్ కీర్తికాంతా త్రిజగతి నృపతే! భోజరాజక్షితీంద్ర.

రాజు—(పశ్చిమాభిముఖముగా కూర్చుండును.)

కాళి—(స్వగతము) ఓహో! ఇదియును, సంతుష్టి నొసంగదయ్యెనా? (రాజున కభిముఖముగ దిరిగి)

శ్లో॥ స్వర్గాద్గోపాల కుత్రవ్రజసి? సురముని కామధేనో
ర్వత్సస్యానేతు మాశు తృణచయమధునా ముగ్ధదుగ్ధం నతస్యాః?
శ్రుత్వా శ్రీభోజరాజప్రచుర వితరణం వ్రీడశుష్కస్తనీ సా
వ్యర్థోహంస్యాత్ ప్రయాసస్తదపి తదభితశ్చ్యావత సర్వమా ర్ద్రం.

రాజు—(ఉత్తరదిశాభి ముఖుఁడగును.)

కాళి—(స్వగతము) ఓహో! ఇదియును, పూర్వశ్లోకతుల్యమే యయ్యెనా? కానిమ్ము ఇది తుదిప్రయత్నము గాక! (రాజున కభిముఖుఁడై నిలువఁబడి)

శ్లో॥ విద్వద్రాజశిఖామణే! తులయితుం ధాతా త్వదీయం యశః
కైలాసంచ నిరీక్ష్య తత్ర లఘుతాం నిక్షిప్తవాన్ పూర్తయే
ఉక్షాణం తదుపర్యుమాసహచరం తన్మూర్ధ్ని గంగాజలం
తస్యాగ్రే ఫణిపుంగవం, తదుపరి స్ఫారం సుధాదీధితిమ్॥ ౪౯

రాజు—(మహానందముతో లేచి కాళిదాసుం గౌగిలించుకొని) కవిసార్వభౌమా!

శా॥ ఆనందోత్సవమయ్యె మాకుఁ గవిచంద్రా! నేఁడు యుష్మత్కవి
త్వానూనప్రతిభాప్రభూతులఁ గోరన్, నన్ను మెచ్చించి తా
నిన్నాదిం గనఁగంజేయు రెవ్వరును, నేఁ డత్యంతసంప్రీతిచే
సన్మానార్హతలఁ గ్రామములను నీ కిత్తున్ మనస్స్ఫూర్తిగాన్.

గీ॥ శ్రావకీనకవిత్వసుధాంబురాశి
మజ్జనంబాడినాఁడ; నీమహిమ నుతింప
కనకమును జోటిదింక, నాకిప్పుడయిన
యోగమున్ నాదినాటి కేగునాఁడ! ౫౦

కాళి—మహారాజా! ఇది యెట్టి విపరీతకృత్యము?

సీ॥ దర్భాసనంబులందుఁ దగు మేము మీ
సింహాసనంబులఁ జేరఁగలమె?
దర్భలు బట్టు సంధంబగు కేలు మీ
రత్నగర్భలు బట్టరానియగునె?
ధరణి కమండలోదకమునఁ బానెడు మేము
భూమండలంబునుఁ బోషింపఁగలమె?
యోగదండంబె యాయుధముగాఁ గొను మేము
ధర్మదండంబునుఁ దాల్పఁగలమె?
గంట ముఖయుక్తమగు మాకు ఖడ్గమేల?
శాస్త్రచయమున్న మాకు శస్త్రమేల?
పాలకులు మీరు; మేము మీ పాలితులము;
పూజితాఖిలసురరాజ! భోజరాజ! ౫౧

పృథ్వీభుచూడామణీ! తమయనుగ్రహామే పదివేలు! ఛాందసుఁడనగు నాకీరాజ్య మందనుఁగాదు. తమరిట్లనుటకు తగనివాఁడను.

రాజు—కవిరాజా! నాకోర్కి నిరాకరింపకుమని, మున్నే ప్రార్థించితివి గదా! మఱల నిట్టిపలు ... డకుము. ఇంతకుమున్ను కేవలకవిరాజవగు నీవిప్పుడు రాజకవిరాజవైతివి. కావున నీమాళవ రాజ్యంబెల్ల నింక నీయధీనము. రమ్ము. ఈసింహాసనం బధిష్ఠింపుము. ఆనందముతో నేను యోగినై కాశీపురమున కరిగెదను.

కాళి—రాజేంద్రా! ఇది ధర్మవ్యతిరిక్తము. ఇందులకు, నే నన్హుఁడను.

ఆ॥ మోటువానిచేతి మొగలిదళంబట్ల
వేదజునిచేతి విడెముభాతి
కవితయల్లువాని భువినేలువిధముఁ గ
ల్లోలమగుట కింక లోపమున్నె?

రాజు—బుద్ధిసాగరా! ఇందు నీయభిప్రాయ మేమి?

బుద్ధి—మహారాజా! సమస్తనీతిసార మనందగిన తను రిట్లు ప్రశ్నించిన నేనేమి చెప్పఁగలను?

గీ॥ భయదమృగసంకులారణ్యపాలనమున
కర్హమగును కంఠీరవ; మంతెకాని,
తనువుగలయంత గజరాజు, తగినయదియె?
బ్రాహ్మణున కర్హమే భూమిపాలనంబు? ౹౩

సీ॥ కవిరాజు శాస్త్రవాదవిరాజితుఁడెకాని
శస్త్రవాదమునఁ బ్రశస్తుఁడగునె?
కవిరాజు గణనిబద్ధవిరాజితుఁడెకాని
యుద్ధకౌశలమున యోగ్యుఁడగునె?
కవిరాజు సుకవిరాజవిరాజితుఁడెకాని
రాజరాజితపాదరాజియగునె?

కవిరాజు భువి దండకవిరాజితుఁడె కాని
దండవిధాన దోర్దండుఁ డగునె?
అవని నేలునీతి, కవిరాజు, కవిరాజు
వలె రచింపఁగలుగువాఁడె కాని
దాని నాచరింపఁ దగువాఁడె కవిరాజు
రాజు లేనియవని, రాజితంబె? ౫౪

అదియునుఁగాక,

చ॥ జననముచేతనే కలుగు శౌర్యము క్షత్రియజాతియందు; సం
జననముచేతనే కలుగు సాత్త్వికభావము విప్రులందు; వి
న్ననువుగ రాష్ట్రపాలనమహాగ్రహ, పైఁబడినంతలోనె, బ్రా
హ్మణునకు శౌర్యలక్ష్మి సహజాకృతి నెట్లు లభించు? భూవరా! ౫౫

కావున రాజ్యపాలనమునకు సర్వవిధములచేతను తమరే తగినవారు. ఇదియే నాయభిప్రాయము!

రాజు—మంచిది. తమరందఱును చెప్పినప్రకారము రాజ్యము నాకే యుక్తమైనను, నేను, నానోట, నీకవీంద్రునకు నారాజ్యము నెల్ల సమర్పించితి ననిపల్కితినిగాదా?

బుద్ధి—అందులకై యీకవీంద్రునకు విశేషంబగు ధనమును సమర్పించి, మీరాజ్యమును మీరుగొనుటయే యుక్తమైనపని!

రాజు—అట్లయిన మీహితోపదేశము ననుసరించుచున్నాను. ఓకవి చూడామణీ!

ఆ॥ తమకు దత్తమైనధరణినిఁ గొనెదు, ని
మిత్తమిపుడు తమకు విత్తమొసఁగి
నాఁడ; బహుళమాధనంబును, నవరత్న
సంచయము లపూర్వకాంచనంబు.

వీనిని గైకొని, నారాజ్యమును నాకు విక్రయింపుఁడు.

కాళి—ఇందులకు, నేను మనస్ఫూర్తిగా సమ్మతించుచున్నాను.

రాజు—మంత్రీ! బుద్ధిసాగరా! సభానంతరమున, కవీంద్రుని సర్వారీతిని సత్కరించి నాప్రతిజ్ఞను నీవు పాలింపుము.

బుద్ధి—భాగ్యము.

వేశ—(స్వగతము) ఇదియంతయు నిక్కముగా మ మ్మవమానపఱచుటకేమో! నాకన్నులయెదుట, నింతటిఘోరము జరుగుచుండఁగాంచి నేనోర్వఁజాలను. ఇందులకెదిరియైన ప్రతిక్రియఁ గావింపవలయును. (ప్రకా) మహారాజా! మామనవి చిత్తగింపవలయును. ఈకవి యిప్పుడు సభామధ్యమునఁ జదివిన, “మహారాజశ్రీనర” మొదలు నాల్గుదిక్కుల యందలి నాల్గుశ్లోకములును, ఇతఁడు రచించినవి కావు. పూర్వమహాకవి రచితములు. ఎవ్వఁడో కవీశ్వరుఁడు విక్రమార్కభూపాలునిపై వీనిని రచింప, నితఁడు సమయంబున, నిజనామధేయంబును, వానియందుఁ జేర్చి తానురచించిన చందమున మోసగించెను. ఇవి మేము మావిన్నపాను చదివిన శ్లోకములే!— మా మావృత్తకులు, అవి కంఠపాఠముగా నున్నవి. ఇంతకంటె ... మర్మము తెలియఁగక, దేవర నాకు నీకవి మహాకవియని యాదరించుచు, చిరకాలమునుండి దివాణమున గొప్పవారై యుండి బహుదేశ విఖ్యాతులమై యున్న మమ్ము నిరసించుట తమవంటి విద్వత్ప్రభుశిఖామణులకు భావ్యమైన పనిగాదు.

కాళి—(కోపముతో) ఓరీ! దుష్టకవిపిశాచమా! నన్ను నోరుగాలిన యితర కవులతోపాటుగా గణించి, యనేకవర్షములనుండియు, యథేచ్ఛగా సాగించుకొనుచున్న నీమోసకృత్యము నింకను సాగించుకొనఁ దలంచుచుంటివా? కన్నములోని దొంగకు తేలుకుట్టినచందమున నూరకుండక మఱల నేల నీమోసమును నీవే త్రవ్వుకొంటివి! ఇంక మీకు ... నిలిచియుండదు. నేటితో మీరాజప్రాపకమెల్ల విధ్వంసము గానున్నది. చూడుఁడు.

రాజు—కవీంద్రా! అదియేమి?

కాళి—రాజేంద్రా! ఈపండితులు కవితామండితులయ్యును మీచే దండితులు గానర్హులు! వీరిలో నొకఁడు ఏకసంతగ్రాహి, రెండవవాఁడు ద్విసంతగ్రాహి, మూఁడవవాఁడు త్రిసంతగ్రాహి. అందుచేత నే— వీ, రేపండితు లెట్టిశ్లోకముం జదివినను, దానిని తాము చిన్ననాఁడే చదివితిమని తామును పఠించి మహాపండితులకును కవులకును తమదర్శనముం గలుగ నీయకయే సాగనంపుచున్నారు! వీరిపరీక్ష యిన్నెన్నిదినముల నుండియో యథేచ్ఛగా సాగుచున్నది.

రాజు—తమకుమాత్రము నాదర్శనమె ట్లబ్బెను?

కాళి—అందులకై నే నొకయుక్తి చేసితిని!

రాజు—ఏమి చేసితిరి?

కాళి—అందఱివలెనే నేనును, ముందుగా, నీకవుల ప్రాపకమును సంపాదించుకొనఁదలంచి వీరికడకు వచ్చితిని. నేను వచ్చుసరికి నా కన్నముందుగా పాపమభాగ్యుఁడగు వేఱొక కవివచ్చి తా రచించిన శ్లోకమునొకటి వీరికి వినిపింపఁగా, యథాపూర్వముగా వీరు "ఇది నీవు రచించినది కాదు; పూర్వకవివిరచిత" మని పలికి ముగ్గురుం జదివి యాతనికి శృంగభంగ మొనరించి పంపివేసిరి. చాటున నున్న నేనిది యంతయుం జూచుచునే యుంటిని.

రాజు—తరువాత?

కాళి—తరువాత నీ రాతని సాగనంపి తమలోఁ దాము "రాజేంద్రుఁడు తన యాస్థానమునకుఁ గవీంద్రులెవ్వరును రాకునికి మిగుల నసంతృప్తివహించియున్నాఁడు. మందబుద్ధియగుకవి నెవ్వని నేని రాజసన్నిధికిం గొనిపోవుదము. అంతటితో రాజునకు తద్భ్రాంతి యణఁగును." అనుకొనుచుండగా నేనాకర్ణించి, నాకు మంచిసమయమును మంచియుక్తియు, వీరే కల్పించిరని సంతోషించి, దర్శనము చేసితిని. అంతట వీరు యథావిధముగా "కవీంద్రా! మీరు రచించినశ్లోక మెద్దియో నిం చదువుఁడు" డని యడి

గిరి. అంతనేను మూఢునిచందమున నటించుచు నొక వెఱ్ఱి మొఱ్ఱి శ్లోకముం జదివితిని.

రాజు—ఏది యేది? ఆవెఱ్ఱిశ్లోకముం గూడ విని యానందింతము!

కాళి—అవధరింపుఁడు.

శ్లో॥ మా స్తివద్యకవ చ్ఛ్త్రవ । చల్లవత్ త్ల్లకుక్క-వత్
రాజతే భోజతే కీర్తిః । పునస్సన్న్యాసి దంతవత్. ౫౭

అందఱు—(నవ్వుచున్నారు)

కవులు—(సిగ్గుచే తలలు వంతురు.)

రాజు—అది విని మూఢునివలెఁ గనఁబడుచున్న మిమ్ము నాయెదుటఁ బెట్టుటకు వీరు సాహసించి యుందురు.

కాళి—చిత్తము. అట్లే జఱిగినది.

రాజు—అట్లయిన వీరు తాముపఠించిన ప్రారంభ శ్లోకపంచకము నేల యనుకరింపఁ జాలకపోయిరి?

కాళి—ఇందలి మొదఁటివాఁడగు నేకసంతగ్రాహికి కొంచెము శక్తి గలదు. పాషాణతుల్యములగు కఠినపదములతోఁ గూడిన యాశ్లోకము లితనికి కొఱుకుడుపడినవిగావు. మొదటివాఁడు పఠింపఁజాలకపోయెను గాన మిగత యిద్దఱును అసమర్థులైపోయిరి. సులభసాధ్యములగుటచేత "మహారాజ శ్రీమన్" అను శ్లోకములనుండి యందుకొని మఱలదమవెనుకటి పాటఁ బాడ దొడంగిరి.

రాజు—కటకటా! ఈముప్పురి దుష్పాండిత్యమూలమునను నే నెందఱు కవులకు నిష్కారణముగా ద్రోహము సల్పితినో కదా!

చ॥ జగము కవీంద్రశూన్యమని, సంశయమందితిఁగాని దుష్టులై
జగదపకారమున్ సలుపఁజాలిన వీరల ద్రోహమంచు ని
మ్మగ, గ్రహియింపలేని ఘనమూఢతఁజిక్కి, నిరాకరించి యు
... త్యాగణితమైన పాండితికి హానియొనర్చితి; మోసపోయితిన్. ౫౮

కాళి—తమ రిందులకై ఖేదపడనక్కఱలేదు. ఈదుష్టగ్రహములుమూఁడును దమయాస్థానమును విడిచినవెంటనే సత్కవులందఱును మరల దమయనుగ్రహమునకుఁ బాత్రులు కాఁకపోరు.

రాజు—బుద్ధిసాగరా! అట్లయిన నీముువ్వురును నేటినుండియు నా కంటఁబడకుండ తీవ్రమైన శాసనముఁ జేయింపుము! కాళిదాసకవీంద్రుఁడు మదాస్థానమున ముఖ్యుఁడై యుండుఁగాక! కవీంద్రా! నాతో నీవుమాత్రి మంతఃపురమునకు రమ్ము. నేఁడు మాకుఁజాల నానందమైనది. ఇంతటితో నేటి సభ చాలించుచున్నాము.

(అందఱుఁ నిష్క్రమింతురు)

[నటపరివర్తనము]

---

తృతీయాంకము సమాప్తము.

# భోజకాళిదాసు.

## చతుర్థాంకము.

### 1. రంగము — ధారానగరరాజవీధి.

ప్రవేశము—తరంగవతి యను రాజపరిచారిక.

తరం—(స్వగ) రాజేంద్రుఁడు విశేషద్యూతప్రియుఁడై రాత్రులం దెల్ల ద్యూతగృహంబుల గడుపుచు ధనవ్యయ మొనర్చుటను సహింపఁజాలక, మాదేవి యగులీలావతీమహారాజ్ఞి నన్నుఁ జేరఁ బిలిచి, తరంగవతీ! రాజేంద్రుఁడు ద్యూతక్రీడాసక్తి మానున ట్లు చమత్కారముగాఁ బ్రబోధింపు మని కాళిదాసకవితోఁ జెప్పి పంపితిని; ఆవినోద మెట్లు ప్రవర్తిల్లునో నీవును గూఢముగఁ బరీక్షింపు మని పంపినది. రాజేంద్రుఁ డాయెదుటఁ గాన్పించు ద్యూతమందిరముననే ప్రవేశించెను. కాళిదాసుఁ డింకను రా లేదు. ఏమిజరుగునో చూచెదఁగాక!

(తరువాత విలాసకుఁడు ప్రవేశము)

విలా—ఓహో! నాప్రియురాలు తరంగవతి యిటనున్నదే! ఇది యీ ద్యూతమందిరసమీపమునం దేల యున్నది చెపుమా? తరంగవతీ, తరంగవతీ!

తరం—ఓహో! నాప్రియమిత్రుఁడు విలాసకుఁడా యేమి? విలాసకా! నీ విందేల వచ్చితివి?

విలా—తరంగవతీ! నీ విందేల వచ్చితివి?

తరం—నారాకకుఁ గావలసినంతకారణ మున్నది. నీరాక కేమికారణమో చెప్పు.

విలా—సారాయియంగడి సమీపముననే యుండఁగా నారాకకుఁ గారణమును నంగనాచివలె నడిగెద వేమి?

తరం—ద్యూతగృహము సమీపముననే యున్నదిగావున నేనును వచ్చితిని.

విలా—నీవు జూదరివఁటే? నగలమారీ! ఇన్నినాళ్లనుండియు నే నెన్నఁడెఱుంగను. (అనుబంధము 4)

తరం—హూష్! అల్లరిచేయకు. నారాకకు కారణ మతిరహస్యము! ఇతరులు వినఁగూడదు. ఇచ్చట నెవ్వరును లేరుగదా! ఏమో యెవ్వఁ డెఱుంగును? రహస్యముగ చెప్పెదను. రమ్ము.

(చెవిలోఁ జెప్పును)

విలా—ఓహో! ఇదియా కారణము! రాజేంద్రుఁడు పురవాసులందఱకును, గూఢచారియై యుండఁగా రాజేంద్రునిపై నీవు గూఢచారిణివైతివా?

తరం—కేకలు వేయవల దని చెప్పలేదా? ఇతరులు వినిన కొంప లంటుకొనఁగలవు. ఇప్పు డిచ్చటికి కాళిదాసకవి రానై యున్నాఁడు.

విలా—సరే కాని తరంగవతీ! "కాళిదాసు కాళిదా" సని గొప్పగాఁ జెప్పుకొందురే? అతనిమాహాత్మ్యమును నీ వేమైన నెఱుఁగుదువా?

తరం—అయ్యో! ఎఱుఁగ కేమి? అతఁడు నిజముగా సరస్వతీదేవియవతారము!

విలా—ఊరక ముఖప్రీతుల కట్లనుట స్తోత్రమేనా? నిదర్శన మేమైనఁ గనఁబడినదియా?

తరం—పలుమాట లెందులకు? ఈయొక్క సంగతి వినుము. నీకే బోధపడఁగలదు.

విలా—ఏ దా సంగతి?

తరం—మహారాజు నాస్థానకవులలో దండి, భవభూతి, శంకరుఁడు, భాణుఁడు, మున్నగువారికి కాళిదాసునియొన్నత్యముం జూచినకొలఁదియు వైరభావ మధికమై విశేష శాస్త్రచర్చలు జరుగుచుండుటయు ప్రతివాదమునందును, కాళిదాసే గెల్చుటయు సంభవించుచుండెను. ఇట్లుండఁగా మహాసభయం దొకనాఁడు కవులలో నెవ్వరధికు లను మీమాంసబయలు దేరెను. దానిని మానవు లెవ్వరును తీర్మానింపఁజాలకపోయిరి. తుదకు కాళిదాసుఁడు, తనప్రభావముచే, సరస్వతీదేవి నుపాసించి తల్లీ! మాయందు తారతమ్యము నేర్పరచి చెప్పి యీ వివాదముం బరిష్కరింపు మని కోరెను. అప్పు డొకశబ్దము—"కవిర్దండీ-కవిర్దండీ— భవభూతి స్త్వ శేషితః" అని వినఁబడెను.

విలా—నీవేమో, సంస్కృతము చదువుచున్నావు! నాకు దానియర్థమేమో, తెలియుట లేదు.

తరం—(నవ్వి) ఈమాత్రమునకే అర్థము చెప్పవలెనా? భోజరాజు మొగము చూచినంతనే కవిత్వము పుట్టు నందురే! నీయొద్ద అర్థగ్రహణశక్తియే కాని, శబ్దార్థగ్రహణశక్తియేమియు నున్నట్లు కనఁబడదేమి? అవును- కప్పకు పద్మసౌరభము తెలియునా?

విలా—అబ్బో! నేటికి నీవు రవంతపండితురాలవై యెంతగర్వించుచున్నావే! మఱదలా! అతిపరిహాసము మాని, అర్థముచెప్పుదూ!

తరం—ఆమాటకు— "దండియేకవి; దండియేకవి; భవభూతి పండితుఁడు." అని యర్థము!

విలా—ఇందు కాళిదాసుఘనత యేమియు నున్నట్లు లేదే?

తరం—చెప్పుచుండఁగా తొందఱపడెదవేల? వినుము! అప్పుడు, కాళిదాసు సరస్వతిపై కోపముఁ బూని "కోహం రండే?" యనగా "రండా! నే నెవ్వఁడనే?" అని యడిగెను. అప్పుడు సరస్వతి, "త్వమేవాహం త్వమేవాహం త్వమేవాహం నసంశయః" అని చెప్పెను.

విలా——"త్వమేవాహం" అనగా నేమి?

తరం——"నీవే నేను; సందేహము లేదు" అని యర్థము.

విలా——అబ్బా! అట్లయిన నేదో శాపమువలన సరస్వతీదేవియే యిటవతరించి యుండునసుమా!

తరం——సందేహమేమి? ఇంతే కాదు. కాళిదాసురసజ్ఞత యెట్టిదనుకొన్నావు! ఒకసారి భవభూతి ఉత్తరరామచరిత్రమను నాటకమును రచించి కాళిదాసు వేశ్యామందిరమున నుండఁగా దానిని చదివి వినిపించి యాతనియభిప్రాయము నెఱింగి రమ్మని శిష్యుల కిచ్చి పంపెను. శిష్యులు కొంతసేపటికి మఱలి వచ్చి 'గ్రంథమంతయు కాళిదాసు వినెను; కాని యభిప్రాయముం జెప్పలే'దని చెప్పిరి. నడుమ నేమైన మాటాడెనా? యని భవభూతి ప్రశ్నింపఁగా శిష్యు లిట్లు చెప్పిరి.

శ్లో॥ "కిమపి కిమపి మందం మంద మాసత్తియోగా
దవిరళితకపోలం జల్పతో రక్రమేణ
అశిథిలపరిరంభ వ్యాపృతైకైకదోష్ణో
రవిదితగతయామా రాత్రి రేవం వ్యరంసీత్." గీ

అని చదువునప్పుడుమాత్రము కాళిదాసు తాంబూలమును సేవించుచు "సున్నమధికమైన" దని పనికత్తెం జూచి పల్కినాఁడు అని చెప్పిరి. భవభూతి కొంతసేపు ఆమాటయందలి భావమేమో యని విమర్శించి కడపటిచరణమునందలి "రాత్రిరేవం" అను మాటలోని సున్న యధికమైనదని గ్రహించి "రాత్రిరేవ" అని దిద్దుకొనెనఁట!

విలా——ఆశ్లోకార్థమేమో నాకు తెలియు లేదుగాని——

తరం——నీ కాసందేహ మెందుకు? "సీతారాములు ప్రేమసంభాషణచేయుచుండఁగనే రాత్రి వెళ్లిపోయెనుగాని సుఖముపూర్తి కాలేదు" అని భవభూతి రచించెను. కాళిదాసుచేసిన మార్పువలన సున్నతీసివేయఁగా "రాత్రిమాత్రమే వెళ్లిపోయెనుగాని సుఖము పూర్తికాలేదు" అని చక్కని యర్థము వచ్చినది.

విలా—ఓహోహో! ఏమిరసగ్రహణశక్తి! ఇట్టివిషయములు విన్నను జన్మతరించును గదే తరంగవతీ!

తరం—ఇంతేనా? అతని మేధాశక్తియో- ఒకసారి బాణకవి కాదంబరీకావ్యమును రచించి కాళిదాసునకు వినిపింపఁగా- "మీ కాదంబరి నాకు మత్తును గల్గించె" నని జవాబు చెప్పెనఁట! బాణుఁ డామాట విని తనకావ్యము బాగులేదు కాఁబోలునని దానిని కాల్చివేసెను. మఱియొకనాఁడు కాదంబరినిగూర్చి కాళిదాసు రాజుకడ శ్లాఘింపఁగా బాణుఁడు దానిని కాల్చివేసితి నని చెప్పెను. కాళిదాసు విచారపడి, కాదంబరి యనఁగా "కల్లు" అని యర్థము గాన మత్తుగల్గించె నని పల్కితిని. ఐనను- మీరు చదివినప్పుడు నేను జ్ఞాపక ముంచుకొంటి నని పల్కి- గ్రంథమంతయు నాటువుగా చెప్పి మఱల వ్రాయించెనఁట!

విలా—విన్నకొలఁదియు, ఈతనిచరిత్రము వినవలయు ననియే బుద్ధి వొడముచున్నది. మఱికొన్ని సంగతులు చెప్పవే!

తరం—ఇప్పుడు కాదు. మఱియొకప్పుడు చెప్పెదను లే!... ఉండుండు- ఆ వచ్చు పురుషుఁ డొక సన్న్యాసివలె నున్నాఁడు చూడు!

విలా—ఔను కాని- సన్న్యాసి, మాంసము తినుచున్నాఁ డేమి?

తరం—ఇతఁడే కాళిదాసు.

విలా—ఐన, నీవేష మేమి?

తరం—ఉండుండు- మనము చూడఁదగినచిత్ర మిందే యున్నది.

(సన్న్యాసివేషమున మాంసము తినుచు కాళిదాసు ప్రవేశము)

తరం—ఈవంక, ద్యూతశాలనుండి రాజేంద్రుఁడును వచ్చుచున్నాఁడు. సద్దుచేయక సంభాషణము నాలకింపుము.

(తరువాత భోజరాజు ప్రవేశము)

రాజు—(స్వగ) ఈయోగి యెవ్వఁడో, విచిత్రపురుషుఁడుగా నున్నాఁడే? బహిరంగముగ నీతఁడు మాంసము నేల తినుచున్నాఁడో ప్రశ్నించి తెలిసికొందును. (సమీపించి)

శ్లో॥ భిక్షో మాంసనిషేవణం కిముచితం?

కాళి—కిం తేన మద్యంవినా?

రాజు—మద్యంచాపి తవ ప్రియం?

కాళి—ప్రియ మహో వారాంగనాభి స్సహ.

రాజు—వారస్త్రీరతయే కుత స్తవ ధనం?

కాళి—చౌర్యేణ ద్యూతేనవా.

రాజు—చౌర్యద్యూతపరిశ్రమో స్తి భవతాం?

కాళి—భ్రష్టస్య కావాగతిః? (నిష్క్రమించును) ౬౦

రాజు—(స్వగ) ఇతఁడు కేవలభిక్షుకి సన్యాసి కాఁడు. నాకుఁగల ద్యూతాసక్తిని దొలఁగింప, నీవేషమున కాళిదాసే వచ్చి యుండును. కానిచో నిట్టి కవితాశక్తి వేఱొకరికిఁ గల్గునా? ఛీ! ఈదినము మొదలు నింద్యమగు నీద్యూతప్రసక్తి మానెదఁగాక! (నిష్క్రమించును.)

విలా—తరంగవతీ! ఇదియేమో నా కగమ్యగోచరముగ నున్నది.

తరం—నేను దీనియర్థము నెఱిఁగించెదను రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

[పటపరివర్తనము]

---

2. రంగము— భోజరాజు సభామందిరము.

ప్రవేశము— కవులతో భోజరాజు సుఖాసీనుఁడై.

భోజ—కవీంద్రులారా! ఒక చిన్నసమస్య గలదు. నాహృదయాభిప్రాయము ననుసరించి పూరింపఁగోరెద.

దండి—చిత్తము సెలవీయ వేఁడుచున్నాము.

భోజ—"టంటంటటంటంటటటంటటంటం"—ఇదియే సమస్య.

దండి—ఓహో! అసాధ్యముగ నున్నదే?

భవ—అసాధ్యమే కాదు. హాస్యరసయుక్తముగఁగూడ నున్నది.

భార—పూరించుట కేమి? అనేకవిధములుగ పూరింపవచ్చును. రాజేంద్రునిహృదయము ననుసరించి పూరింపఁ దగ మగునా? ఇది యసాధ్యమైనపని.

బాణ—మన కాళిదాసే యందులకు గొంత సాహసింపవలయు.

భోజ—కాళిదాసకవీ! నీ కేమైన సాధ్యమగునేమో చూచెదవా?

కాళి—ప్రభువులసెలవైనచో సాధ్యము గాకుండునా?

భోజ—ఏదీ! వచింపుము! విని యానందింతుము.

కాళి— శ్లో॥ రాజాభిషేకే మదవిహ్వలాయాం *
హస్తాచ్చ్యుతో హేమఘటో యువత్యాః,
సోపానమార్గేషు కరోతి శబ్దం
టంటంటటంటంటటటం టటంటం. ౬౧

దండి—ఇట్టి సమస్యాపూర్తి మేమమాత్రము చేయఁజాలక యూరకొంటిమా? ఇది రాజాభిప్రాయ మనుటకు కారణ మేమి?

కాళి—అందులకు రాజేంద్రుఁడే సాక్ష్యము!

భోజ—కాళిదాసమహాకవీ! పరేంగితజ్ఞానము నీధనము. నిన్ను మీఱినవా రెవ్వరుఁ గానరారు. నిజముగా జరిగినకథనే శ్లోకరూప సమస్యాపూర్ణమున నెఱిఁగించితివి!

దండి—అందుల కాధార మేమి?

భోజ—దండికవీంద్రా! ఊరక యీ సమస్యాపూరితవాక్యముల నాడకుము. ఈవిషయ మంతఃపురకాంతాజనమున కంతటికిని వేద్యమే సుమా!

---

* గీ॥ సార్వభౌమాభిషేకోక్తసమయమందు,
కామవిహ్వలపరిచారికాకరస్థ
హేమకలశము సోపానయోమి గాఁగ,
టంట టంటంట టంటంటటం ధ్వనించె. ౬౨

దండి—తాము కాళిదాసుపైఁ గల యభిమానంబునం బలికెదరుగాక! అంతఃపురకాంతాజనప్రచారితమైన యీవార్త కాళిదాసు చెవినిఁ బడుటచే ఈసమస్యను పూరించియుండఁగూడదా?

భోజ—పోనిండు. దీని నిట్లు త్రోసివేయుదము. మఱియొకసమస్య నిచ్చెదను. అది మహారణ్యమధ్యమున నొరులెవ్వరు నెఱుంగని వేళ మాయేకాంతమృగయావినోదసమయమున జఱిగినవృత్తాంతము! దీనిని కాళిదాసు తెలిసికొను నవకాశము లేదుగదా! దీనిని సయితము నాహృదయాభిప్రాయముగ వాస్తవకథతో నీతఁడు పూరించెనేని ఇతని పరేంగితజ్ఞానమున సందేహము కలుగదుగద!

దండి—ఆహా! కలుగదు. ఆసమస్య నెఱిఁగింపుఁడు.

భోజ—"గుళుగుగ్గుగుళుగ్గుళు" ఏదీ? మీ రెవ్వరైనఁ బూరింపఁగలరేమో! ప్రయత్నింపుఁడు.

దండి—పూరింపఁగలము కాని, యది మీయభిప్రాయము కావలెను గదా! కావున కాళిదాసే ప్రయత్నించును.

భోజ—కాళిదాసా! కానిమ్ము.

కాళి—చిత్తము!

శ్లో॥ జంబూఫలాని పక్వాని । పతంతి విమలే జలే, *
కపికంపితశాఖాభ్యో । గుళుగుగ్గుగుళుగ్గుళు. ౬౩

భోజ—బ్రహ్మానందము గలిగె! కాళిదాసా! ఈసమస్యాపూర్తిచే నీ పరిపూర్ణసామర్థ్యము ప్రకటితంబయ్యెను.

దండి—రాజేంద్రా! ఇది నిజమా!

---

* గీ॥ పూర్ణపరిపక్వవిమలజంబూఫలములు,
కపివితతి సల్పు శాఖాప్రకంపనమున,
దిగువఁ బ్రవహించు వాహినీతీర్థములను
రాలు నెడ గుళుగుగ్గుళురావ మొదవె॥ ౬౪

భోజ—సందేహ మేమైననున్నదియా? ఈకాళిదాసు సరస్వతీ యవ
రావతార మని మేము విశ్వసించుచున్నాము.

దండి—కావచ్చును.

భోజ—ఇదే కాదు. ఇంకొకసమస్య నిచ్చిచూచెదను.

"హుతాశన శ్చందనపంకశీతలః."

కాళిదాసా! దీనిని పూరింపఁగలవా?

కాళి—తమయానతిప్రకారము. అవధరింపుఁడు.

శ్లో॥ సుతంపతన్తంప్రసమీక్ష్యపావకే
నబోధయామాసపతింపతివ్రతా
తదాఽభవత్ తత్పతిభక్తిగౌరవా
ద్ధుతాశనశ్చందనపంకశీతలః. * ౬౫

భోజ—ఇది యథార్థమైన కథయు. మేము ఛద్మవేషమున పురరహస్యంబుల నెఱుంగ సంచరించువేళ జఱిగినచిత్రము! దీని కేమందురు? కాళిదాసకవీంద్రునిమాహాత్మ్యంబున నింక సందేహమేమి?

దండి—సందేహము లేదు. లేదు. అందఱము ను ఆమోదించితిమి.

(ఒకబ్రాహ్మణుఁడు కాలి చల్లారిన కొఱవులుగల మూటతో ప్రవేశము)

బ్రాహ్మ—(స్వగ) దరిద్రుఁడు తలగడుగఁబోవ వడగండ్లవాన కురిసినదఁట! ఆజన్మదరిద్రుఁడ నగు నేను దరిద్రవిచ్ఛిత్తికొఱకై భోజమహారాజును దర్శింపఁగోరి రాజదర్శనమునకు రిక్తహస్తములతో నరుగరాదని కొన్ని చెఱుకుముక్కలను మూటగట్టు

---

* గీ॥ ప్రాణవిభుపాదసేవానురక్తయైన
సాధ్వియొకతె హుతాశసజ్వాలఁబడిన
పుత్రు నీక్షించియుఁ బతికిఁ బోవదయ్యె
చందనముఁబోలె నాయగ్ని చల్లనయ్యె. ౬౬

కొని వచ్చితిని. రాజుగారు సభాశాల నలంకరించుట కవకాశము గలదుగదాయని చాలతడవు పరీక్షించితిని. సభ చాలించు వేళయైనదో యేమిగతియో! (ముందునకరిగి) రాజదేవేంద్రా దిగ్విజయోస్తు!

భోజ—భూసురాశీర్వాదమునకు సదా విధేయుఁడ! స్వామీ! అనుజ్ఞ యేమి?

బ్రాహ్మ—మహాప్రభూ! అతిదరిద్రుఁడను. దిన మొక యుగముగా గడుపుచున్నవాఁడను. ఈ దరిద్రమును బాపి రక్షింపుము. (మూటవిప్పగా కాలికొఱవు లుండును.) (స్వగ) అకటా! నా దరిద్రమునకు తోడుగా నిదియేమి యుపశకునము! బజారమున నొడలెఱుంగక పరీక్షించినవారి తుంటరిబాలు రెవ్వరో నా చెఱుకుముక్కల నపహరించి యీకొఱవుల నిం దిడియుందురు!

భోజ—బ్రాహ్మణుఁడా! మాతో పరిహాసము లాడుచుంటివా? ఈ కొఱవు లేమిటి? వీనితో నెవనికొంపగాల్పవలయు ననుకొంటివి?

కాళి—(స్వగ) పాప మీ దరిద్రబ్రాహ్మణుఁ డిప్పుడు రాజాగ్రహమునకుఁ బాత్రుఁ డగుచున్నాఁడుగదా! పాపము. ఇప్పు డొక చిన్న చమత్కారము గావించి, ప్రమాదమును నవరించి రక్షించెదఁ గాక! (ప్రకా) మహారాజా! ఈబ్రాహ్మణుఁడు దేవరవారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడుగాని, యాగ్రహమునకు గాఁడు! రక్షింప వేఁడెదను.

భోజ—కాళిదాసకవీంద్రా! పండితసభామధ్యమున - నరపాలుఁడనను భీతిలేక - కొఱవులను కాన్కలుగా సమర్పించిన యీ ఛాందసబ్రాహ్మణుఁ డనుగ్రహమునకుఁ బాత్రుఁడగు ననుచుంటివా? ఎంత విపరీతము!

మ॥ విలసద్రత్నవిభూషణప్రచయమో - విఖ్యాత సౌవర్ణ కో
మలచీనాంబరజాలమో - విపులసంపత్తో - కనీసంబుగా,
ఫలమో- పత్రిమొ - పుష్పమో - నృపులకుం బ్రిహ్మణ్యు
లర్పింపఁగా
నిలలో ధర్మముగాని, కొష్టముల వినీ! కాన్కగా నిత్తురే!౬౭

కాళి—రాజేంద్రా! భీతిపెంపునఁ బావ మీ బాపఁడు తనయభిప్రాయ
మును దమకెఱిఁగింపఁ జాలకపోవుటవలన తమ కీతని కార్యము
విపరీతముగాఁ దోఁచెను. అది యీ బ్రాహ్మణుని దుష్కాల
మాహాత్మ్యము.

భోజ—కవీంద్రా! అట్లయిన నీవిప్రుని యభిప్రాయమేమి?

కాళి—చిత్తగింపుఁడు!

శ్లో॥ దగ్ధం ఖాండవ మర్జునేనచ వృథా దివ్యద్రుమై ర్భూషితం
దగ్ధా వాయుసుతేన హేమరచితా లంకాపురీ స్వర్గభూః,
దగ్ధ స్సర్వసుఖాస్పదశ్చ మదనో హాహా వృథా శంభునా
దారిద్ర్యంఘనతాపదం భువి నృణాంకే నాపి నోదహ్యతే॥*

భోజ—కవిరాజా! ఈబ్రాహ్మణుని యభిప్రాయ మెట్టిదైనను యుష్మ
ద్రచితశ్లోకముమాత్రము మాకు మహానందసంధాయకమయ్యె
ను. ఈబ్రాహ్మణుఁడు సహజమైనఛాందసబుద్ధినో మాఘ్యంబున
నో మాయెడలఁ గావించిన మహాపరాధమును గుణభూయిష్ఠము
గను మిక్కిలిరసవత్తరముగను సమర్థించితివి. ఇందునీబుద్ధివిశే
షముమాత్రమే కొనియాడఁదగినది.

కాళి—రాజేంద్రా! అట్లు సెలవీయఁజనదు. ఈవిప్రుఁడు తను కధమును
నిమ్మపండుగాని యఱఁటిపండుగాని కొన్నిపుష్పములుగాని

---

* గీ॥ ఖాండవముఁ బార్థుఁడు దహింపఁగలదె ఫలము?
లంక మారుతి గాల్ప ఫలంబుగలదె?
సాంబుఁ డతనునిఁ గాల్ప ఫలంబుగలదె?
ఎవ్వరు దరిద్రమును గాల్ప రింతవఱకు॥ ౬౮

కాన్కగా నీయవలయు నని యెఱుఁగనివాఁడై యుండెఁను. ఉత్కృష్టమగు నగ్రవర్ణమున జనించి యింతకాలముగడిపి యీ మాత్రము తెలియని యప్రాజ్ఞుఁడగు నని నేను విశ్వసింపఁజాల ను. ఇందిట్టిమహాత్తరార్థము గల్గి యుండుటచేతనే యీకోతుపు లను కాన్కగాఁ దెచ్చినాఁడు.

భోజ—మంచిది, ఎట్లైనను సరియే! ఈవిప్రుఁడదృష్టశాలి. ఈకోఁతుపుల కాన్కయే మామది కానందప్రదంబయ్యెను. సచివోత్తమ! ఇతనికి వేయిదీనారముల బహుమానము నిచ్చునట్లు కోశాధి పతికి వ్రాసి యిమ్ము.

మంత్రి—భాగ్యము (వ్రాసి యిచ్చును.)

బ్రాహ్మ—మహారాజసార్వభౌమా! అఖండైశ్వర్యప్రాప్తిరస్తు!
(నిష్క్రమించును.)

ద్వావా—(ప్రవేశించి) ప్రభువర్యా! ఒకసాలెవాఁడు తమదర్శనము నపేక్షించుచున్నాఁడు.

భోజ—మంచిది. ప్రవేశపెట్టుము.

ద్వావా—(నిష్క్రమించును. సాలెవాఁడు ప్రవేశించును.)

సాలె—మహాప్రభూ! నమస్కారము! నేను తమపట్టణమున బట్టల నేతయే జీవనముగాఁ గల యొక నిరుపేద నగు సాలెవాఁడను. పురవాసులగువారిలో విద్యావిహీనుల నందఱను పురమునదలి పోవలసిన దని తమయాజ్ఞ యైనట్లు భటులెఱిఁగించిరి. అందు చేత నేను స్వయముగ తమ దర్శనమునకు వచ్చితిని.

భోజ—సేనాపతీ! మారాజ్యమును పండితరాజ్యముగా నొనరింప వలయు నని మాయభీష్టము! అందులకై యిట్టి గట్టికట్టడి యొన రింపవలసి వచ్చెను.

సాలె—ప్రభూ! తమభీరాశయమును గుర్తింపని మందుఁడను గాను. అందులకే తమదర్శనముసేయవచ్చితిని.

భోజ—నాదర్శనమువలన నీకుఁ గల్గఁగల లాభ మేమి?

సాలె—నాకు తమరాజ్యమున నుండ స్వతంత్రతగల దని నిర్ధరించుకొనుటయే !

భోజ—పండితులకుఁ గాక, నాపురమున తావు దొఱుకదుగదా !

సాలె—చిత్తము. అందువలననే, నాకు తావు గలదు.

భోజ—నీవు పండితుఁడవా యేమి?

సాలె—అదియేమో ప్రభువులే నిర్ధారణసేయఁ గర్తలు !

శ్లో॥ కావ్యం కరోమి నహి చారుతరం కరోమి,
యత్నాత్ కరోమి యది, చారుతరం కరోమి,
భూపాలమౌళిమణిరంజిత పాదపీఠ
హేసాహసాంక! కవయామి వయామి యామి. * ౭౦

భోజ—ఆహాహా! ఇట్టి నిరర్గళధారాశుద్ధిగల్గిన కవీంద్రుఁడు సాలెవాఁడైననేమి? మాలవాఁడైన నేమి? నేత నేయుటకును - పురి వీడుటకును ఖాసింతువా?............ ప్రసిద్ధకవి సేనాపతీ! కవిత్వము సేయుచు కాలము గడుపుము! కులవృత్తియైన నేతయును మానకుము! సరస్వతీకటాక్షము మాకు మెప్పుగలిగించె! ఈశ్లోకమున కక్షరలక్ష లిచ్చుచున్నాము. ఇంక నీవు సంతృప్తితో నరుగుము. మంత్రివర్యా! ఇతనికి దానశాసనం బిమ్ము.

మంత్రి—భాగ్యము. (వ్రాసియిచ్చును)

సాలె—దిగంత విశ్రాంత కీర్తిని ధరింతువుగాక! మహారాజా! సహస్ర

* గీ॥ కావ్య మొనరింతుఁగాని, ముక్తముగ రాదు,
అదియు నొనరింపఁగలను ప్రయత్నమునను,
కావ్యమును సేయు, సేయఁగ, కదలి చనఁగ
సలుపు మేదేని యాన (శ్రీ) సాహసాంక! ౭౧

వందనములు! (గైకొని నిష్క్ర.)

భోజ—కవీంద్రులారా!! మన రాజ్యంబునఁ గల సాలెవాఁడునయిన మిట్టి మహాకవిత్వసిద్ధిఁగన్నవాఁ డని యెఱుంగుటచే మా యానంద మిప్పు డపార మైయున్నది.

కాళి—మహారాజచంద్రా! సూర్యచంద్రులీధరణీతలంబున నెంతకాలము ప్రకాశింతురో, యంతకాలమును మీ కీర్తికాంత నవనవకాంతిపుంజములచేఁ బ్రకాశించుచుండఁగలదు.

భోజ—అట్లనా - కాళిదాస కవీంద్రా! నేఁడు తిథి యేమి?

కాళి—పూర్ణిమ గదా మహారాజా!

దండ—బళిబళి! తుదకు కాళిదాసుగారి పాండితి అమావాస్యను పూర్ణిమ యను నంతవఱకును వచ్చెనా!

కాళి—(స్వగతము) అయ్యయ్యో! పరధ్యానమున నుండుటచేత పొరపాటున అమావాస్య యనుటకు మాఱుగా, పూర్ణిమ యని పలికితిని. దీని నెట్లు సమర్థించుకొందును? పదుగురుపండితులలోఁ బరిహాసపాత్రుఁడ నగుదు నేమో కదా!

భోజ—కాళిదాసా! ఏమి యూరకుంటివి? అమావాస్యను పూర్ణిమ యని పలికెద వేమి?

కాళి—రాజేంద్రా! ఔను నేఁడు పూర్ణిమయే!

దండి—కాళిదాసకవిగారి యద్భుతమాహాత్మ్య మిఁక ప్రకృతినిఁగూడ తలక్రిందులు చేయనుగాఁబోలును!

కాళి—దండికవీ! నీకేల యింత తాపము? సాయంకాలము కానిమ్ము. పరిపూర్ణచంద్రబింబము నభోతలంబునఁ బ్రకాశించుటను వీక్షింపఁగలవు!

దండి—సరే! చూతము! రాజేంద్రా! నేఁటిసాయంకాలమున కాళి

దాసు వచించినట్లు చంద్రబింబము ప్రకాశింపనిచో ఈవా
చాదోషమునకుఁ బ్రతిక్రియ యేమి?

భోజ—కాళిదాసా! ఏమిచెప్పెదవు?

కాళి—తమరు విధించుశిక్షకు బద్ధుఁడ నయ్యెదను.

భోజ—కాళిదాసా! తొందఱవలదు. ఇప్పుడైన నీదోషమును సవరిం
చుకొనుము. లేదేని శిక్షింపఁబడుదువు సుమా!

కాళి—రాజేంద్రా! నేఁడు పూర్ణిమ కాకుండినఁగదా నేను శిక్షింపఁబడుట!

భోజ—సరే! కానిమ్ము. పూర్ణిమయైనా బహూకృతుల నందె
దవు! కాదా ఘోరశిక్షాపాత్రుండ వగుదువు! కవులారా!
నేఁటికి సభ చాలింతము!

[పటపరివర్తనము]

---

చతుర్థాంకము సమాప్తము.

---

# భోజకాళిదాసు.

## పంచమాంకము.

### 1. రంగము: సౌధోపరిభాగము.

ప్రవేశము:— భోజరాజు - దండికవి.

(అనుబంధము 5.)

భోజ—దండికవీంద్రా! ఇది పరమాద్భుతమైన విషయముగా నున్నది సుమా! ఇంతవరకు కాళిదాసుని శక్తి కేవలమానుషమైనదిగ మాత్రమే మన మూహించి, యందులకే పరమానందము నందుచుంటిమి. నేటివిషయముం బరికింప నీతఁడు దైవశక్తిగల యమానుషప్రతిభాశాలి యని తలంపవలసి యున్నది! ఇందులకు మీ రేమందురు?

దండి—మహారాజా! అనుట కేమున్నది! స్పష్టముగా అమావాస్య నాటిరాత్రి చంద్రబింబసందర్శనము ప్రకృతిప్రారంభమైన దాదిగా నిప్పటికి జఱుగని చిత్రముగదా!

భోజ—ఆహాహా! పురజను లీమహత్తరానందకరప్రకృతివిపరీతదృశ్యముం గాంచ నెట్లు గుంపులు గుంపులుగాఁ గూడుచున్నారో చూడుము.

సీ॥ మోదావహంబైన యీదృశ్యమునుఁ గాంచ
మేడలపై గుమిగూడువారు

శ్రీకాళిదాసప్రసిద్ధమానవజనా
తీతమాశక్తి నుతించువారు
మహిలోన ప్రకృతివిస్మయకారణంబైన
యద్భుతంబున వెరగందువారు
అమవసయామినియం దుదయించిన
శుభ్రచంద్రునిభ్రాంతిఁ జూచువారు
కలయొ నిజమో యెఱుఁగక కలఁతపడుచు
వివిధపంచాంగపత్రముల్ వెదకువారు
నిదురలను మాని బయటనే నిలుచువారు
రమ్యమగు నేటిరాత్రి ధారాపురంబు.

దండి—ప్రభుచంద్రమా! ఇది యాతని మాహాత్మ్యంబని తమరు పొగడుటకుఁదోడుగా మాయమన్త్రంబు తెలియఁగక ప్రజలును అట్లే తలంచుచు భ్రాంతికి లోనగుచున్నారు!

భోజ—మాహాత్మ్యము కాకున్న దీని నేమని చెప్పెదరు?

దండి—ఆర్యా! కాళిదాసుఁడును మనవంటి సామాన్యమానవమాత్రుండేకద! మానవమాత్రునకు మానవాతీతమగు మహాశక్తి యొక్క మాఱుగ నుద్భవించెనన్న నెట్లు నమ్మఁగలము?

భోజ—మనవంటి మానవమాత్రుఁడేయైనచో నం దాశ్చర్యపడవలసిన దేమియున్నది? ఈతనియందు మానవాతీతమైన దైవశక్తి యేదియో తప్పక యిమిడియున్నది.

దండి—(ఆక్షేపణముగ నవ్వి) అయ్యా! నడువీథిలో జనుల నాకర్షించుచు పొట్టనింపుకొనుటకై గంపలో నొక యాడుదానిని మూసి క్షణములో మాయముజేసి మఱల దానిని ప్రజామధ్యమునుండి రప్పించుటయును, మామిడిటెంకను మహీతలమునం బూడ్చి నిమిషములో చెట్టును మొలిపించి పూతబూయించి కాయలుగాయించి, పండ్లుపండించుటయు మున్నగునద్భుతముల నొనరించి జీవించుగారడివానియందు నిజముగా దైవశక్తియే

యున్నచో కాళిదాసునందుఁగూడ నట్టిశక్తి గలదని యా మోదింతును.

భోజ—(అసహ్యముతో) ఏమేమీ! మహాత్మశక్తివిభాసుండగు కాళిదాసుండు గారడీవానితో సమానుఁడని వాకొనుటకు మీ కెంతసాహసము!

దండి—అయ్యా! తమయెదుట నేనిట్లు బల్కుట యొకవేళ సాహసమే కావచ్చును. ఐనను సత్యేతరముమాత్రము కాదు.

భోజ—ఇంకను సత్యేతరముగా దనుచునే యుంటిరా?

దండి—కాకున్న నిదియేమి మహాప్రభూ! అమావాస్యనాటి రాత్రియం దీచంద్రప్రకాశము నెన్నఁడైనఁ గంటిమా? ఇది వట్టి కను కట్టు - గారడీ - మాయ.

భోజ—మీపలుకులు విశ్వాసార్హములు కావు. చాలింపుఁడు మీ దురుక్తులను.

దండి—అయ్యా! సురాపాయియు, మత్స్యమాంసప్రియుఁడును నగు నా కాళిదాసబ్రాహ్మణమ్మన్యుని గారడీక్రియలు మీకు విశ్వాసార్హము లైనపుడు, సత్యసంబద్ధములగు నావాక్యములు మీకు దురుక్తులుగాఁ దోఁచుటలో విపరీత మేమి యున్నది?

భోజ—ఏమేమీ? కాళిదాసుఁడు సురాపాయియు, మత్స్యమాంస ప్రియుఁడునా?

దండి—సందేహ మేమి?

భోజ—(అనుబంధము 6) ఇందులకు నాకు నిదర్శనములు కావలయును. వట్టిమాటలు పనికిరావు.

దండి—అయ్యా! కావలసినన్ని చూపఁగలను. తేపటిదినమున, నొక మాఱు నేను పిలిచినప్పుడు నావెంట దయచేయఁ బ్రార్థించు చున్నాను.

భోజ—మంచిది. (ఇరువురును నిష్క్రమింతురు)

[పటపరివర్తనము]

2. రంగము : రాజవీధి.

బట్టచాటున దాచినచేఁపతో కాళిదాసుఁడు ప్రవేశము.

కాళి—(స్వగతము) నిన్నటియమావాస్యచంద్రప్రకాశమునకు నన్ను ప్రజలెల్లరును దైవసమానునిగ నెంచుచున్నారు! ఆహాహా! ఈకీర్తికంతటికిని జగదంబ యగు కాళిక యనుగ్రహమేకదా కారణము! ఐనను దండి భవభూత్యాదులగు కవులు కొందఱు నాపై నమిత మగు నీర్ష్య వహించి నేను మత్స్యమాంసభక్షకుఁడ ననియు సురాపాయి ననియు రాజేంద్రునితో వచించి నిదర్శనమునకై ప్రతీక్షించుచున్నట్లున్నారు! ఈనుందబుద్ధులం బరాభవింపఁదలంచి యుద్దేశ్యపూర్వకముగనే నే నీమత్స్యముం గొనిపోవుచున్నాను. అల్లదే రాజేంద్రుని వెంటనిడుకొని దండి నా కెదురుగా వచ్చుచున్నాఁడు. ఇఁక నిదర్శనము జూపును గాఁబోలు (చేపను కనుపడియు కనుపడనట్లు దాచి యుంచును.)

(తరువాత దండి భోజరాజు ప్రవేశము)

దండి—(అపవారించి) రాజతిలకమా! అదె నీక్షింపుఁడు. కాళిదాసు కక్షమునం దేమిగలదో?

భోజ—మత్స్యమువలె నున్నదిగాదా?

దండి—వలె ననుటయేల? నిస్సందేహముగ మత్స్యమే!

భోజ—సరే! ఇంతకాలమునకు దొంగ దొఱికినాఁడు. మీరుండుఁడు నేను పట్టుకొందును.

(ఇరువురును సమీపింతురు)

కాళి—విజయతాం రాజేంద్ర!

భోజ—హేకవీంద్రా!

శ్లో॥ కక్షే కిం తవ?

కాళి—పుస్తకం.

భోజ—కిముదకం?

కాళి—కావ్యార్థసారోదకం.

భోజ—గధః కిం?

కాళి—ఘనరామరావణ మహాసంగ్రామరంగోద్భవం.

భోజ—పుచ్ఛః కిం?

కాళి—ఘనతాళపత్రలిఖితం.

భోజ—కిం పుస్తకం? హే కవే!

కాళి—రాజన్! భూసురప్రవర ప్రశస్త పఠితం రామాయణం పుస్తకం.

భోజ—ఏదీ! కొంచెము దానిం బ్రదర్శింపుము. చూడ వేడుక వొడముచున్నది!

కాళి—(స్వగ.) కాత్యాయనీ! నీయనుగ్రహమే యాధారము! (ప్రకా.) అయ్యా! అభ్యంతరమేమి? చిత్తగింపుము!

(చేపను రాజునెదుట పడవేయఁగా రామాయణతాళపత్రగ్రంథ మగును.)

భోజ—
దండి— } (విభ్రాంతులై ఒకరిమొగమొకరు చూచుకొందురు.)

కాళి—రాజేంద్రా! రామాయణమహాకావ్యముం గాంచి యాశ్చర్యపడెదరేల?

భోజ—(కాళిదాసుపాదములపైఁ బడి) మహాకవిశిఖామణీ! మూఢుఁడనై నిన్ను పరీక్షింప సంకల్పించితిని; నాదోషమును క్షమింపుము!

కాళి—రాజేంద్రా! ఇంకుపరీక్ష యేమియుఁ గావలసినదే!

భోజ—ఈదండికవిబోధచే నీవు మత్స్యమాంసభోజి వనియు నీనేరముం బట్టి శిక్షింపవలయునవియుఁ దలఁచి తుద కిట్లు మూఢతం బ్రదర్శించుకొంటిని. నీవు మత్స్యాహారివైన నేమి? మాంసా

హారి వైన నేమి? మహాత్మా! నీయందనీతమైన దైవశక్తిగలదు. నిన్నుఁ బరీక్షింప నే నెంతవాఁడను?

కాళి—అయ్యా! దండికవియు తక్కుంగల యాస్థానకవులును నాతో పాటుగా దేవరవారి యుపజీవులముగదా! కావున ఒక యాచకున కింకొకయాచకుఁడు శత్రుఁడుగా నుండుట సహజమే!

దండి—(తలవాల్చుకొని నిష్క్రమించును.)

భోజ—కవీంద్రా! ఎన్నినాళ్లనుండియో తమతో నొక కోరిక వచింపనెంచితి! "తీర్తు" ననినఁ దెల్పెదను.

కాళి—రాజేంద్రా! తమవంటివారు నన్ను కోరదగినదియునుం గలదా?

భోజ—కలదు. తీర్తునన్నచో వచించెద.

కాళి—అదేదియో తెలియకము న్నెట్లు వాగ్దానము చేయఁగలను?

భోజ—కాదు. ముందు వాగ్దానము చేసినఁగాని వచింపను.

కాళి—అయ్యా! వచించుటకే తాము పొందుచున్న సందేహముం జూడఁగా వాగ్దాన మొనర్చుటకు నాకుఁ గూడ సందేహమే కలుగుచున్నది.

భోజ—అధికారరీతిని తిరిగి యడుగుచున్నాను. మీరు వాగ్దానము చేయక తప్పదు.

కాళి—అయ్యా! అధికారరీతి నడుగుచున్నపుడిఁక నా వాగ్దానముతో పనియేమి? "ఇది చేయు" మని శాసింపఁగూడదా?

భోజ—మంచిది. అట్లే కానిండు. బ్రతికియున్నన్నినాళ్లును నాకీర్తివర్ణనములను విన లేక విసిగిపోవుచున్నాను. నామరణానంతరస్థితి యెట్లుండునో శ్లోకరూపమున తాము వర్ణింపఁగా విన నభిలషించుచున్నాను.

కాళి—హా! హా! రాజేంద్రా! ఇది యేటికోరిక? ఎంతమూర్ఖుఁడనైనను సజీవులై నాప్రభువులై యున్న తమ చరమశ్లోకమును

రచింపనోర్తునా? రచించుటమాట యట్లుండ అంకములకు సాహసించినదుష్టకవి యెవ్వఁడైన నుండిన నాతని హతమార్చుటగాక—

భోజ——ఏమీ? రచింప ననినట్లే కాదా?

కాళి——నిస్సందేహముగ రచింపఁజాలను. హా! హా! దుర్భరము! దుర్భరము! మహారాజా! తుదకు తనకుఁ గల్గిన కోరిక యిట్టిదియా? తిండిపెట్టి పోషించిన ప్రభుస్వామునిపై నిట్టి చెడుకవితఁ జెప్ప సిద్ధపడినకవి దుర్భరకుష్ఠరోగపీడితుఁడై నశించుఁగాక!

భోజ——ఇది రాజశాసన మని యెఱుఁగవా?

కాళి——కావచ్చును. రాజేంద్రా! రాజశాసననిరాకరణ మొనరించినందులకుఁ గల్గుశిక్ష యేదియో ప్రసాదింతురేని యానందముతో ననుభవించువాఁడనే కాని యీపాపకార్యమును మాత్ర మొనరింపనోపను. ఇంక నిచ్చోట జాగొనరించుటకుఁ గూడ నా హృదయ మామోదించుట లేదు. రాజేంద్రా! పోయివచ్చెదను సెలవిండు. (నిష్క్ర.)

భోజ——(స్వగ) ఈవిధముగా నీతనినోట నాచరమశ్లోకముం జెప్పింపఁజాలను. మఱియొకప్రయత్నముగడఁ బన్నెదను.— దండికవి యేఁడీ? కాళిదాసుని మహత్త్వముం గాంచి పరాభూతుఁడై చల్ల చల్లగా జారిపోయెఁగాఁబోలును! ఛీ! ఇట్టి దురాత్ములమాటలను నమ్మి కవిశ్రేష్ఠుని హృదయమును నొప్పించితిని గదా!

(నిష్క్రమించును.)

[పటపరివర్తనము]

### 3. రంగము: ధారానగరసమీపమున నొక కుగ్రామము.

ప్రవేశము:— కాళిదాసు.

కాళి—(స్వగ) ఆహా! విధివిధాన మెంత బలీయమైనది!

( అనుబంధము 7 )

ఉ॥ కోరఁగరాని కోరికనుఁ గోరెను భోజనృపాలకుండు; ధి
క్కారము నొనర్చి తాఁ జరమకాలపువైఖరిఁ జెప్పు మంచు త
ద్ఘోరతరాభిలాష నొడఁగూర్పఁగ లేక పురంబువీడి, నేఁ
జేరితి నీస్థలంబు; విధిచింతన మ్మెట్లు దాఁ బాయఁజేసెఁగా. ౨౮

ఎవరో యీతఁడొకరు వచ్చుచున్నట్లున్నారు! ఎవరు వారు?

(వృద్ధకృషీవలవేషమున భోజరాజు ప్రవేశము.)

భోజ—(స్వగ) నా వేష మిప్పుడు చక్కగా సమరినది! నేను భోజరాజనని యెవ్వరును గుర్తింపఁజాలరు. ఇన్నిసారులు చరమశ్లోకమును రచింపుమని కోరినను నిరాకరించి కాళిదాసు తుదకీపురికి వచ్చినాఁడు. కావున్నే నేఁ డీతని నోటివెంట కపటంబుననైనఁ జెప్పించి తృప్తినందెదఁగాక!

కాళి—అయ్యా! ఎవరు మీరు?

భోజ—నే నొకనిరుపేదను బాబూ!

కాళి—మీ దేగ్రామము?

భోజ—ధారానగరము!

కాళి—ధారానగరమున నిరుపేదలునుం గలరా?

భోజ—ఆఁ! నావంటి నిరక్షరాస్యులు గలరు.

కాళి—మీకుఁ జదువు రాదా?

భోజ—రాదు స్వామీ! అందువలననే దుర్మార్గుఁడైన భోజరాజు నన్ను పురము వెడలించెను.

కాళి—అయ్యా! కొంచెము మర్యాద నేర్చి మాటలాడుము!

భోజ—జానపదమున కెక్కడి మర్యాద?

కాళి—భోజరాజును దుర్మార్గుఁడంటి వది యేల?

భోజ—చదువురానంతమాత్రమున తనపౌరుని పురివెడలించిన రాజు సన్మార్గుఁడనఁ జెల్లునా?

కాళి—విద్యావ్యాప్తిఁ గావింప నటులొనరించె నని గ్రహింపలేవా?

భోజ—విద్యావ్యాప్తియా?—ఎనుబదియేండ్లు వచ్చి చదువు కొనక మన్ను గొట్టుకొందునా-యనిన ట్లున్నది నాకథ.

కాళి—అట్లయిన నిప్పుడు మీప్రయాణ మెక్కడికి?

భోజ—ధారానగరమునకు.

కాళి—రాజు పురి వెడలించె నంటిరి కాదా!

భోజ—ఔను.

కాళి—మఱల నెట్లు పురప్రవేశము చేయఁగలరు?

భోజ—ఇప్పు డాశని వదలెను గాదఁటయ్యా?

కాళి—మీమాట నాకర్థ మగుట లేదు.—శాసనమును మార్చి నారా?

భోజ—అయ్యయ్యో! అట్లయిన నీ వింకను దొడ్డితోవనే యుంటివా?

కాళి—అయ్యా! నా కేమియుఁ దెలియదు. ఏమి జరిగినది?

భోజ—రాజభూతము వదలిపోయెనుగాదా?

కాళి—ఆఁ! - ఆఁ!—"వదలిపోయె" ననఁగా?

భోజ—అనఁగానా? "ఈభూమిని వదలిపోయె" నన్నమాట.

కాళి—ఏమీ? ఏమంటిరి? భోజరాజేంద్రుఁడు మరణించెనా?

భోజ—ఇప్పటికి పది దినములైనది.

కాళి—హా! భోజరాజా! కవికల్పభూజ!— (మూర్ఛ)

భోజ—(సంతోషముతో) భళీ! అనృతములాడినను అనుమానము కలుగకుండ నాడితిని. ఇప్పుడుగదా మదభీష్టము నెరవేరుట! ఈతనినోట నింక ధారాళముగా మదీయచరమశ్లోకము వినఁబడఁగలదు.

కాళి—(లేచి) హా! భోజరాజశిఖామణీ! మరణించితివా? ఎంతలో నీకు శతవర్షపరిపూర్ణం బయ్యెను! ధారానగర మింక నిరాధారా నగరంబగునా? పండితమండలియెల్ల ఖండితమండలి యగునా? సరస్వతీదేవి నిరాలంబ యగునా? హా! రాజకవిసార్వభౌమా! కవితాసామ్రాజ్యమున కెందఱు సత్కవులను బట్టభద్రులను గావించి, భారతీదేవి నుపాసించితివి! నీవంటిపండితకవి యగు రాజేంద్రుఁడు మా కెన్ని జన్మజన్మాంతరములకైన లభించునా? హా! లీలావతీదేవీ! పరమసాధ్వీరత్నమ వైన నీకు వైధవ్యము నేటికి మాలవిధి లిఖించెనా తల్లీ! హా! రాజేంద్రా! నీమరణకాలమున సమీపమునం దైన నుండు ప్రాప్తికి నోఁచుకొనన్నైతినిగదా! నీస్మృతి దినములలో నుండుటచేతనే కాఁబోలును ముందుగా నీకుఁ జరమశ్లోకాకర్ణనవాంఛ గలిగెను. అది నిజమయ్యెనా?

శ్లో॥ అద్య ధారా నిరాధారా । నిరాలంబా సరస్వతీ
పండితాః ఖండితాః సర్వే । భోజరాజే దివంగతే॥

భోజ—హా! హా! హతవిధీ!- (విఱుచుకొని భూమిపైఁ బడిపోవును)

కాళి—(విస్మయముతో) ఏమి యీచిత్రము! నాశోకము శ్లోకరూపమున నోటవెల్వడుటతోడనే యీజానపదుఁడు మూర్ఛనంద నేల? ఇతఁ డొకవేళ మాభోజరాజేంద్రుఁడే కాఁడుగదా! (విమర్శించి చూచి) హాహా! ఎంతమోసపోతిని! నాచే నెట్లైన చరమశ్లోకముం జెప్పింపఁ దలపోసి యీమోసముం బన్ని వచ్చితివా, మహారాజా! కానిమ్ము-నీచావునకుఁ గారణమైన నా వాక్కు బ్రతుకునకుమాత్ర మేల కారణము కాకుండును?

శ్లో॥ అద్య ధారా సదాధారా। సదాలంబా సరస్వతీ
పండితాః మండితాః సర్వే। భోజరాజే భువంగతే. 22

భోజ—(కన్నులు నులుముకొనుచు లేచి) హామిత్రమా! కాళిదాసా! (కౌఁగిలించుకొనును.)

కాళి—రాజేంద్రా! ఇంతసాహసము తగునా? దైవానుగ్రహమున మఱల జీవించి, కంటఁబడితివి గాని, కానిచో ప్రమాదమే కదా

భోజ—కవీంద్రా! కవివాక్యమాహాత్మ్యమును లోకమున కెఱిఁగించితివి! రాజుల నతిశయించి, కవిరాజులు నిగ్రహానుగ్రహసమర్థులనుట తెలియనయ్యె. ఎల్లపను నాయభీష్టము నెఱవేరినది. ఇంక నీ కీప్రవాసశిక్షయేల? రమ్ము ధారానగరమునకు.

కాళి—మహాభాగ్యము.

(ఇరువురును నిష్క్రమింతురు)

[పటపరివర్తనము]

పంచమాంకము సమాప్తము.

# భోజకాళిదాసు.

## షష్ఠాంకము.

I వ రంగము — భోజరాజాంతఃపురము.

ప్రవేశము:—పర్యంకమున నిద్రించు భోజరాజు కనఁబడుచుండును.

తరంగవతి—(ప్రవేశించి స్వగతము) దండిప్రభృతు లగు కవిరాజులు నా కుపదేశించిన ప్రకారముగా నేఁ డేవిధానముననైన మహారాజునకుఁ గాళిదాసుపై ననుమానాగ్రహములను గల్గింపవలయును. పండితులయాజ్ఞయే కాక అంతకన్న నధిక మగు వారిచ్చుధనము నాకు సదా శిరోధార్యము! కాళిదా సుండిన నాకేమి? మండిన నాకేమి? అతఁడు నాకు తాతగారిచుట్టమా? — అల్లదే భోజమహారాజు భోజనాదులను నిర్వర్తించి సుఖశాయియై యున్నాఁడు. కర్తవ్యనిర్వహణమున కిది మంచితరుణము! (సమీపించి) రాజపరమేశ్వరునకు మంగళము!

భోజ—(కన్నులు విప్పి) తాంబూలవాహినీ! పాదమర్దని యింకను రాక ఆలసించుచున్న హేతువు నరసి రమ్ము.

తరం—మహాప్రభూ! నేఁటిదినమున నది కార్యాంతరప్రవర్తిత యగుట వలన నేనే దేవిగారిచే పాదమర్దనకార్యమున నియమింపఁబడి వచ్చితిని.

భోజ—అట్లైన నీ కార్యమున నీ వుండుము. (కన్నులు మూయును)

తరం—(కొంతతడవు పాదము లొత్తి కునికిపాట్లు పడుట నభినయించుచు కలువరించిన భంగి) ఓసీ! మదనమాలినీ! దుర్మార్గుండైన యీ కాళిదాసు దాసీవేషముతో నంతఃపురమున బ్రవేశించి లీలావతీదేవితో ........

భోజ—(విని, విస్మయరోషములతో) ఆ! ఆ! ఏమిది? నాకర్ణము లేమి యాలకించుచున్నవి? కన్నులుండియు ఇన్నిదినంబులనుండియు, భోజరాజు అంధప్రాయుండై యుండ, కాళిదాసు లీలావతీ సుఖలీలానుభూతిని మెలంగుచు, లోలోన నన్నుం బరిహసించుచుండెనా? ఔరా! ఎంత దారుణము! ఎంత మోసము! ఎంత దురాచరణము!

ఉ॥ గ్రుడ్డివిధానమైఁ దెలివిఁ గోల్పడి యుండిననన్నుఁ గాంచి, యీ
గ్రుడ్డి యిఁకేమి సేయునని మాదృశుఁడయ్యెనో, కాళిదాసహా
చేష్టితనంబు బైటఁ బడె; చేడియవృత్తము తెల్లమయ్యెఁ; బైఁ
బడ్డది దుర్యశం బెట్టుల వాయును? మార్గ మిఁకేది? దైవమా!

(ఆలోచించి) ఐనను, తొందఱఁ బొందుట, మిగుల నపాయకరము! విచారించెదఁగాక! (ప్రకా.) తరంగవతీ! తరంగవతీ!

తరం—(ఉలికిపడి లేచినట్లు నటించుచు) స్వామీ! ఏమి సెలవు?

భోజ—నీ వింతదనుక మేలుకొనియుంటివా? నిద్రించుచుంటివా?

తరం—(నాల్క కఱచుకొని) క్షమింపవలెను! దేవా! గతరాత్రి సరిగా నిద్దుర లేక—

భోజ—ఎందుచేత నీకు గతరాత్రి సరిగా నిద్దుర లేదు?

తరం—కొండొక కారణమున —

భోజ—తరువాత?

తరం—క్షమింపవలెను - ఏమియును లేదు.

భోజ—క్షమార్పణ మేల? ఏమియును లేక పోవుట యేమి? చెప్పెదవా, లేదా?

తరం—(ఏడ్చుచు) అయ్యో! నాగ్రహచారమా?

భోజ—(కోపముతో) నీ గ్రహచారము కాదు. నాగ్రహచారమే! చెప్పుము; నీకు నిద్ర లేని హేతు వేమి?

తరం—మహారాజా! అది రహస్యవిషయము. చెప్పఁజాలను. క్షమింపుఁడు.

భోజ—అది నీస్వవిషయమైన రహస్యమా?

తరం—కాదు, మహారాజా — అవును మహారాజా — కాదు, కాదు.

భోజ—"కాదు మహారాజా, అవును మహారాజా" యను గడుసుఁదనఁపు మాటలు కట్టిపెట్టుము. సాహస మునుకొంటివా? — అది నీ స్వకీయరహస్యమైనయెడల నేను ప్రశ్నింపను. అంతఃపుర విషయమైనయెడల నే నడుగక మానను. నీవు చెప్పకతప్పదు. (అనుబంధము 8).

తరం—అయ్యో! నే నెక్కడ చత్తునమ్మా! ఎవ్వరో దుర్మార్గులు నా కొంపఁదీసినారమ్మా!

భోజ—ఛీ! కులటా! నీటక్కులు నాకడ సాగరావు! కట్టిపెట్టు. నీకొంపను నీవే తీసికొంటివి! ఇప్పుడు నీవు కలువరించినదేమో, నేను విన లేదనుకొంటివా? నీ కేల నిద్ర లేదు?

తరం—అయ్యయ్యో! పాడు నిద్రలో ఒడలు తెలియక యేమి వాగితినో కదా!

భోజ—ఇంక నీయేడ్పులు చాలింపుము! ఏమి వాగితివో నేను వింటిని. నీ కేల నిద్ర లేదు?

తరం—అయ్యయ్యో! పట్టినపట్టు విడువ రెట్లుకొట్టుకొందును?

భోజ—(జుట్టుపట్టుకొని) పట్టినపట్టుగాదు, పట్టినజుట్టు విడువను. ఇప్పుడు చెప్పుము. నీ కేల నిద్ర లేదు?

తరం—అయ్యో! నాపాపపు దినమా?

భోజ—(కత్తిలాగి) చెప్పెదవా? చంపవలెనా?

తరం—మహారాజా! ద్వారరక్షణమున, అప్రమత్తురాలనై యుండవ
లయు నని యాజ్ఞాపింపఁబడి......

భోజ—అదియే తెలియవలెను. ఎవరిచే నాజ్ఞాపింపఁబడితివి?

తరం—అమ్మయ్యో — అదియే రహస్యము!

భోజ—ఓసి వెఱ్ఱిముండా! రహస్యమంతయు నోరార బయల్పడ కేల
వరించి, యిప్పుడింకేమి దాచుకొందువు? ఎవరిచే నాజ్ఞాపిం
పఁబడితివి? దేవిచేత నేనా?

తరం—అయ్యో! తల్లీ! లీలావతీదేవీ! బుద్ధి గడ్డదిని నీకు నేనే యపకా
రము చేసితినిగదా! అయ్యయ్యో! అయ్యయ్యో!!

భోజ—ఛీ! అల్లరి చేయకు! గతరాత్రి ద్వారరక్షణమున కావశ్యక
మేమి వచ్చెను?

తరం—సర్వము నెఱింగిన మీకింకను చెప్పవలయునా? స్వామీ!

భోజ—మాటలు మాటాడక చెప్పుము! దుష్టురాలా! నీవంటి తొత్తుల
మూలముననే కదా - రాజాంతఃపురములకు మితిలేని దుర్య
శము కల్గుట!

తరం—గతరాత్రియే కాదు, ఇట్లు యనేకదినములనుండి యు—

భోజ—కాళిదాసు గాజులు దొడిగించుకొని యాడువుండువలె నా
యంతఃపురమున దూరుచున్నాఁడా?

తరం—హరిహరీ! హరిహరీ! సర్వమును వెల్లడియైనది! ఇఁకేమున్నది?
ఇఁకేమున్నది?

భోజ—ఛీ! కుటిలాత్మికా! నీ మొగముఁ జూచిన పాతకహేతువు! పొ
మ్మావల. (గెంటును)

తరం—(కల్ల యేడ్పు నటించుచు నిష్క్రమించును)

భోజ—కటకటా! ఎంతమోసకృత్యము! నాయుప్పుపులుసుఁ దిని మ
దించి నావలనఁ బెరిగిన శరీరరక్తమాంసములను నాయంతఃపుర
మునకే వినియోగపఱచి కృతజ్ఞతను గన్పఱుపఁ దలంచుకొని

యెగా కాళిదాసు! ఓరీ! బ్రాహ్మణచండాలుఁడా! కవిపిశాచమా! పండితభూతమా! అజ్ఞానదశయందుండి కన్నులు మూసికొని నిన్ను నెత్తిపై నెక్కించుకొని తుదకు నీవలననే పరిహాసములకుఁ బాలై బుద్ధిపూర్వకముగ సద్వంశము నపకీర్తిపాలు గావించుకొంటిని గదరా!

సీ॥ చింకిపేలికలలోఁ జెఱలాడు నీదీన
సంహాననముఁ గాంచి జాలినొంది
పాత్రత లేని నీపక్కఁ జేరిన సత్క-
విత్వదేవతఁ గాంచి విభ్రమించి
నన్ను గోతముఁద్రోయు నయవంచకంపు ని
మొగమిచ్చకములకు మోసపోయి
కవిశేఖరుఁడ వను గౌరవబుద్ధిచే
నంతిపురిఁ జరింప ననుమతించి-
యాఁడుముండ వౌచు నతినీచకృతమున
నాదుమగువపొత్తునను సుఖించు
పాపమతివి- నీదుపరిహాసములకుఁ బా
లైతి నేఁడు దుష్టుఁడా! కృతఘ్న! ౨౮

నాయంతిపురంపుదాసీజనంబులను లోఁబరచుకొని యథేచ్ఛగా నెన్నియోదినంబులనుండి యిష్టభోగంబుల ననుభవించుచుండిన నీకుటిలతంత్రము నెఱుంగలేకపోయితినిగదరా పాపబుద్ధీ! ఛీ! పురుషజన్మమెత్తిన నిన్నేల యనవలె? అగ్నిసాక్షిగ వివాహమాడిన మహారాజు నగు నాపై నాసక్తి మాని నిత్యదరిద్రదేవతాశ్రయుఁడగు కవిపిశాచముం దగుల్కొన సాహసించిన యాకులట ననవలెఁగాక! ఆహా! స్త్రీబుద్ధిః ప్రళయంకరీ యను నార్యోక్తి వ్యర్థముకాదు గదా! లోకమెంతటి జగజంతలతో నిండి మండిపోవుచున్నది! ఓసీ! రాకాసీ! పరపురుషాభిలషితదుర్గుణవతీ! లీలావతీ! ఇంతటి తేనెపూసిన

కటారి వగుదు వని కలనైనఁ దలంపనైతినే! ఎంతలోన, నా బ్రతుకు నెంతయల్లరిపాలు చేసితివి?

గీ॥ పాపినీ! నీ జనించు సద్వంశ మేడ?
హంతకీ! నీగడించు యశోంక మేడ?
చెరి నాతిండిఁ దిను బీదవారుఁ డేఁడ?
కులముఁ జెఱచితిగదవె! యాకుటిలు వలచి. ౮౦

హా! లీలావతీ! లీలావతీ!

సీ॥ చందనాగరువస్తుసంప్రీతి నెడఁబాసి
పాముసుకంపున కాశఁ బొందినావా!
దాంపత్యసౌఖ్యసంతసలీల నెడఁబాసి
జారిణీత్వమున కాశపడినావా!
సరససల్లాపభాషణరీతి నెడఁబాసి
యతికి ప్రాసకు భ్రాంతి నందినావా!
అర్థుల దయఁజూచునాశయం బెడఁబాసి
చెడి "దేహి" యనుట కాశించినావా!
అవని, నేనిసౌఖ్య మందుదు వని వాని
యోఁడుకూపు కాశ నందినావు?
నాదు కొంపఁగాల్ప నలుపురినోళ్ళలో
పలను నన్ను వేయుపనికె గాక! ౮౧

(సేవకుఁడు ప్రవేశము)

సేవ—మహాప్రభూ! జోహారు.

భోజ—ఏమి విశేషము?

సేవ—ఎవ్వఁడో చిత్రకారుఁ డట! ప్రభువువారిదర్శనం బపేక్షించు చున్నాఁడు!

భోజ—లోనికిఁ బ్రవేశపెట్టుము.

సేవ—భాగ్యము. (నిష్క్రమించును. చిత్రకారుఁ డొకపటముతోఁ బ్రవేశము.)

చిత్రి—జోహారు మహారాజా!

భోజ—సుఖాసీనుఁడవు గమ్ము.

చిత్రి—(కూర్చుండి) కతిపయదినంబులకుఁ బూర్వము, తమరు దేవిగారిచిత్రపటమును లిఖింపవలసిన దని నాకాజ్ఞ యిచ్చియుంటిరి.

భోజ—లిఖించి తెచ్చితివా?

చిత్రి—చిత్తము. నేటికి సంపూర్తియైనది. చిత్తగించెదరా? (పటము నిచ్చును).

భోజ—(నిదానించి చూచి) ఈపటము సర్వవిధములచేతను, అచ్చుగ్రుద్దినచందమున నాసతి లీలావతిం బోలియున్నది. ఆనందించితిమి! కాని, అంకభాగమునం దీ నల్లని మచ్చ యేమి?

చిత్రి—మహాప్రభూ! క్షమింపవలయును. నే నీపటమును లిఖించు నప్పుడు ఎంత జాగ్రత్తగా నున్నను మాటిమాటికిని నొసటనుంచిన తిలకము జారి యంకమునఁ బడుచుండెను. ఇట్లు శ్రమనందుచున్న నాకడకు కాళిదాసమహాకవి యరుదెంచి దేవిగారు పద్మినీజాతికాంత యగుటచేత అంకమునం దట్టి మచ్చ గలదనియు నది యట్లే యుంచుట యుత్తమ మనియుఁ జెప్పినందున నట్లే యుంచితిని.

భోజ—(దీర్ఘముగ తలపంకించి) అట్లు కాళిదాసే నీతోఁ జెప్పినాఁడా?

చిత్రి—చిత్తము!

భోజ—మంచిది-ఆపటము నట్లే యుంచిపొమ్ము— సేవకా! ఈచిత్రకారుని సత్కరింపవలసిన దని ధనాగారికునితో, నాయాజ్ఞగాఁ జెప్పుము.

(చిత్రకారుఁడు నమస్కరించి నిష్క్రమించును.)

భోజ—(ఆలోచించి పళ్లుకొఱుకుచు తనలో) ఓరోరి! దుష్టా! నికృష్టా! కవిభూతమా! ఎంతటి వంచకుఁడవు! అకుటిలురాలితో నీ కట్టి సంబంధమును లేనియెడల దానియంకమున మచ్చగల వస్తు రహస్యము నీ కెట్లు తెలిసెను! ఇంకేటి సందేహము! తరంగవతి పలుకులే నిశ్చయములు. ఐనను తొందరపడ నేల? బాగుగ విమర్శించెదఁగాక!

ఆ॥ ప్రాజ్ఞుఁ డెపుడు, తొందరంపడకుండ, వి
మర్శచేసి కార్యమర్మ మెఱుఁగు;
అజ్ఞుఁ డైన వాఁ డహంకృతిచేఁ దీవ్ర
పడియకృత్యము సలిపి, కుందుఁ దుదకు. రా—

ప్రతీహారీ! కాళిదాసును, నేను రమ్మంటి నని పిలుచుకొనిరమ్ము.

(తెరలో) మహాభాగ్యము.

భోజ—(స్వగ) అనుమాన మను పెనుభూతము హృదయమున బ్రవేశించినతోడనే యెంతటి బుద్ధిశాలియు జడమానసుఁడై పోవక తీరదుగదా! ఈకలితాపము వాయువెర వెయ్యది? (ఆలోచించి) వెఱవున కేమున్నది? ఇందలినిశ్చయానిశ్చయాంశములను విస్పష్టముగ నెఱింగి యాదుష్టకవిని రాజ్యభ్రష్టుని గావింపవలయు. అప్పటికిగాని నా యీ యారాట ముపశమింపదు.

(కాళిదాసు ప్రవేశము)

కాళి—రాజచంద్రమా! నిరంతరాభ్యుదయ మస్తు!

భోజ—(స్వగ) ఈకపటాశీర్వాదములచేత నాకు నిరంతరాభ్యుదయము గల్గించుచునే యున్నావు! ఇంకఁ గొఱంత యేమి?

కాళి—(స్వగ) ముఖమునఁ బ్రసన్నత గాన్పింపదు. ఇట్టిప్రవర్తనము మున్నెన్నఁడుఁ గానమే! కారణ మేమైయుండునో కదా!

ఆ॥ ఎట్టిస్థితుల నున్న నెదురుగా నన్గాంచి,
గౌరవించు - వరనిగర్వమూర్తి
నేఁ డిదేమొ మాటలాడఁడు; నాతోడ,
మొగము పొగలుగ్రమ్ముపగిది నుండె. 63

శరీరమున, నస్వస్థతగ నుండియుండును. విచారించెదఁగాక! (కూర్చుండి) రాజేంద్రచూడామణీ! నేఁ డేకారణముననో వ్యాకులమనస్కులై యున్నారు. శరీరము నిరామయమై యుండ లేదా?

భోజ—శరీరమును- మనస్సునుఁగూడ నొక్కస్థితియందే యున్నవి.

కాళి—(రాజుతనువు నంటి చూచి) అబ్బా! దేహము మిగులవేఁడిగా నున్నదే! జ్వర మేమైన దగిలినదియా?

భోజ—ఊఁ—

కాళి—ఔషధసేవఁ జేయుచుంటిరిగదా!

భోజ—ఊఁ—

కాళి—నన్నూరక కాలక్షేపమునకే పిలువ నంపితిరా! కార్యమేమైనఁ గలదా?

భోజ—కాలక్షేపమునకే—అన్నట్లు మీ రీనడుమ నెన్నఁడైన ధురంధరుఁ డను చిత్రకారునిఁ జూచితిరా!

కాళి—నాల్గుదినములక్రిందట చూచినట్లు జ్ఞాపకము.

భోజ—అప్పు డాతఁ డేమిచేయుచుండెను?

కాళి—(స్మృతి నభినయించి) మహారాజ్ఞిగారిచిత్రమును లిఖించుచుండెను.

భోజ—అప్పు డాచిత్రకారుఁ డేదేని యాందోళనము నందుచుండెనా?

కాళి—ఔను. చిత్రకారుఁ డాపటముయొక్క ఫాలభాగమునం దెన్నిసారులు తిలకమును దిద్దబోయినను ఉత్సంగమున జారిపడుచుండెనఁట. అందులకై యాతఁ డాందోళనము నందుచుండిన మాటమాత్రము వాస్తవము!

భోజ—అది చూచి మీ రేదేని యాతని కుపదేశించితిరా?

కాళి—దాని నట్లేయుండ నిమ్మని చెప్పితిని.

భోజ—కారణము?

కాళి—సాముద్రికశాస్త్రసమ్మత మగుటచేత.

భోజ—రాణియుత్సంగమున నట్టిచిహ్నమున గల దని మీ రెఱుంగుదురా?

కాళి—ఎఱుఁగుదును.

భోజ—మీ రెట్లు తెలియును?

కాళి—మహారాజ్ఞి పద్మినీజాతికోమలి. పద్మినీస్త్రీలకు దొడయం దట్టి పుట్టుమచ్చ యుండు నని శాస్త్రప్రమాణము. ఈవిషయము సాముద్రికశాస్త్రవేత్తలందఱు నెఱింగినదే! నాకును సాముద్రికశాస్త్రమునఁ గొంతప్రవేశ ముండియున్నందున ఈసంగతిని నే నూహింపఁగలిగితిని.

భోజ—(స్వగ) కవిగావున బహుచమత్కారముగ కప్పదాటు వేసినాఁడు! కానిమ్ము. ఇంకను విమర్శింతును—తరంగవతీ! దేవి నిట్లు రమ్మనుము.

(తెరలో) భాగ్యము.

కాళి—దేవా! చిత్రలేఖనవిషయమున నింతటితీవ్రవిమర్శనము చేసితి రేల?

భోజ—మఱియేమియును గాదు. తమకుఁ గవితాశక్తితోపాటుగా దివ్యదృష్టియేమైనఁ గలదేమో యనుకొంటిని.

(లీలావతీదేవి ప్రవేశము.)

లీలా—దాసురాలి కాజ్ఞయేమి?

భోజ—నాశరీరము సరిగా లేదు. పథ్యాహారము నిటకే కొనిరమ్ము.

లీలా—అనుజ్ఞ. (నిష్క్రమించి పప్పును చారును అన్నమును గల పళ్లెరములతోఁ బ్రవేశము)

భోజ—(కరపాదప్రక్షాళనముచేసి పప్పును అన్నమును కలుపుచుండును)

లీలా—(విసరుచు ప్రక్కగా నిలుచును.)

భోజ—(స్వగతము) అంతఃపురమున నేను తన కెంతచను విచ్చినను ఈకవి కొంత యుక్తముగఁ బ్రవర్తింపవలసినది! నే నిచ్చిన చనువునకన్నను తాను గైకొనినచను వధికమై యుండుటచే తనేకదా! యీతఁడు నిరాఘాటముగ నంతఃపురమునం బ్రవేశించుటయుఁ జిత్రకారుఁడని మహారాణికి విషయిక మగు గోప్య వృత్తాంతము నెఱిఁగించుటయు సంభవించెను. కాకున్న నింత సాహసింపఁగలఁడా?

ఉ॥ కూటికి లేనికాలమున కోరి సమాదరణం బొనర్చి నా
నాటికి వృద్ధినందఁగ శుభం బగు సంపద లిచ్చినట్టిన
న్నాటిగ నెంచఁడయ్యె నరహంసనుఁ డీకవి! పాలుఁ బెంచినం
బోటరిపాము దాఁ గఱువఁబోవదె పెంచినవాని నేనియున్? ౧౮

కాళి—మహారాజుగారన్యాలోచనముసం దవిలియున్నారు.

భోజ—అన్యాలోచన మేమియును లేదు. కవీంద్రా! ఇటు చూడుము.

గీ॥ వ్యాఘ్రములకు నెల్ల సర్పమునంటివైన
పెసరపప్పిల్లు పొట్టును విడువనేల? *

కాళి—(స్వగ) ఓహో! ఇదియు నొకసమస్యయే కాఁబోలును! రాజేంద్రునకుఁ బ్రీతికరముగా వచింతును. (ప్రకా) రాజేంద్రా!

గీ॥ అన్న మని యెడుపతిఁ గూడుచున్న వేళ
పప్పునకుఁ గంచుకం బేల బ్రభువరేణ్యా! ♦ ౧౯

---

* ముద్గదాళీగదవ్యాఘ్రీ కవీంద్ర వితుషాకథం,
♦ అంధోవల్లభసంయోగే జాతా విగతకంచుకా.

లీలా—(ఊరకున నవ్వుచున్నది)

భోజ—(రాణిమొగముఁ జూచి యాగ్రహము నణఁచుకొని శిరఃకంపనము చేసి స్వగతము) ఛీ! ఎంతలజ్జావిహీనత! ఎంతనిరాదరణము! ఎంతబహిరంగసంచారిణీభావము!

గీ॥ అమరవాని మొనపాట సమస్యార్థ మితఁడు
మోటుమాటలచేత సంపూర్తిఁ జేసె
ప్రియుని శృంగారవాక్యముల్ వినుట నిదియు
నవ్వుచున్నది లజ్జ నింతయును మాని. ౮౬

ప్రత్యక్షముగ నాయెదుటనే బహిర్గతమైన యీచారిత్రమున కొకరిసాక్ష్యము లేల కావలయును? చాలును. నాకింతమాత్రపుఁబ్రమాణము చాలును. అహాహా! స్త్రీలహృదయము లెంతనిగూఢప్రచ్ఛన్నములు! ఎంతప్రమాదకరములు! ఎంతటిపాపభరములు! ఇందుకే కదా పెద్దలిట్లు చెప్పిరి!

గీ॥ పుడమి నశ్వప్లుతంబులు పురుషభాగ్య
మాకసంబున మేఘగర్జనంబు
నశ్వఘోషంబు స్త్రీచిత్త మరయ సురల
కైన నశక్య మింక నరు లనఁగ నెంత?* ౮౭

కాళి—మహాప్రభూ! నేఁడు తమరు భోజనమైనఁ గూడ సరిగా నారగించక మాటిమాటికిని చింతాసాగరమున మునింగిపోవుచున్నారు! ఇందులకుఁ గారణము దేహవ్యాధియో మనోవ్యాధియో యగోచరముగ నున్నది.

భోజ—(ఊసురనుచున్నాఁడు)

లీలా—మహాప్రభూ! కవిశిఖామణి వచించినట్లు తమచిత్తము......

భోజ—(వికటముగ నవ్వి) నాచిత్తమా! నాచిత్తము! ఇప్పుడు నాచిత్తమున కధికారము గలదా? నాసర్వాధికారములును నాపాసి

---

*శ్లో॥ అశ్వప్లుతంవాసవగర్జితంచ స్త్రీణాంచ చిత్తం పురుషస్య భాగ్యం
అవర్షణం చాప్యతివర్షణంచ దేవో నజానాతి కుతో మనుష్యః॥

సలపరమై పోయినవి గావా? నేనుతాళిఁగట్టిన నాయర్ధాంగ .........ఇప్పు డదియంతయు నెందులకు? నాదే దోష మంతయును! ఇం దొకరి ననవలసినపని లేదు! ఛీ! ఛీ! విశ్వా సఘాతుకప్రపంచము! ఎవరిని నమ్మవలయును? ఎవఁడు నిజమైనయాప్తుఁడు! నోరుమాటాడ నొసలు వెక్కిరించు దు ష్టులచిత్తవృత్తుల నెఱుంగుటకు నేను బ్రహ్మదేవుఁడను గాను గదా! చాలును. ఈసౌభాగ్యమంతయు నింతటితో నిఁకఁజా లును! విషసర్పములం బెంచి పెద్దజేసిన యవివేకమునకు చెం పలు రెండునుగట్టిగా వాయించుకొంటిని! అనుకొన్న ప్రయో జనమేమి? విధి బలీయమైనది! స్త్రీబుద్ధిప్రళయకారణమైనది. పురుషచిత్తము రహస్యభేదనసమర్థతావిహీనము! (తల గొ ట్టుకొనును)

కాళి—(ఆశ్చర్యముతో) ఇదియేమి? ఈయుపన్యాస మెందులకు వచ్చినది? అన్యోన్యసంబంధము లేని యీపలుకుల కర్థముగల దా? లేదా?—మహాప్రభూ! తనుచిత్తము నేడు మిగులవ్యా కుల మైనట్లు తోఁచుచున్నది! ఈపలువరింత లేమి?

భోజ—పలువరింత లేనా? పలువరింతలు పలువరింతలుగావు! గొంతుకో తలు! ఓగోముఖవ్యాఘ్రమా! నాయెదుట నుండకుము! నీమొ గముఁజూడపాపహేతువు! నీవు నాయెదుట నున్నంతసేపును నాకు శాంతి లేదు! ఇఁక నీజన్మమధ్యమున నీవు నాకు నీపిశాచ వదనముం జూపకుము! పొమ్ము పొ మ్మవలకు.

కాళి—(భయముతో) రాజేంద్రా! దేవరవారికి నే నొనరించినయప రాధమును వినఁగోరుచున్నాను!

భోజ—అది నీయంతరాత్మను బ్రశ్నించుకొనుము; పొమ్ము. నాయె దుటనుండి తొలుత లేచిపొమ్ము.

కాళి—రాజేంద్రా! ఇది యొకవేళ గ్రహావేశ మేమో యని నేను భీతిల్లుచున్నాను.

భోజ—దురాత్ముఁడా! గ్రహావేశమే! ఇది తప్పక కాళిదాసకవిగ్రహావేశము! ఒక్క నన్నే కాదు. ఆగ్రహ మీరాజులనుఁ గూడ నావేశించినది. అధికప్రసంగమున నాయాగ్రహాగ్నిని కేపి యందు భస్మము గాకుము; పొమ్ము- శీఘ్రముగ.

కాళి—రాజా! అనవసరముగ నిష్కోపి నగు నన్ను పరాభవించుచున్నావు! ఇది నీకు శ్రేయము గాదు సుమా! సర్వాధికారి వగు నీమాటలను దాటను; నే నిదే వెడలిపోవుచున్నాను. కాని నీకుఁ బశ్చాత్తాపము తప్పదు. (నిష్క్ర.)

లీలా—ప్రాణేశ్వరా! తమరు —

భోజ—ఎవఁడు? ప్రాణేశ్వరుఁ డెవఁడు నీకు? ఇంకను కవిగ్రహ మిచటనుంటివి వెడలిపోలేదా యేమి?

లీలా—ఆతనితో నా కేమి సంబంధ మున్నది?

భోజ—రమణీరసికసంబంధము! గోపికాకృష్ణసంబంధము!! రాధామాధవసంబంధము!!! అర్థమైనదా? (అనుబంధము 9)

లీలా—(చెవులు మూసికొని) హరిహరీ! హరిహరీ! ఎవ్వరీయసత్యకల్పనముఁ గావించిన దురాత్ములు?

భోజ—(కోపముతో కాలు నేలం దన్నుచు) ఛీ, పాపినీ! జారిణీ! కులటా! నీవు నా యెదుట నుండకుము. పొమ్ము.

లీలా—(స్వగతము) ఏదియో ప్రళయకాలము దాపురించినది! ఇప్పటికి వెడలిపోవుటయే యుక్తకార్యము! (నిష్క్ర.)

భోజ—(అటు నిటు శయ్యపైఁ బొరలుచు) ఆహా! తాపము! తాపము! నాశరీరమును యనుభవజ్ఞు లగ్నిహోత్రమునఁ గాల్చుట లేదు గదా!

గీ॥ కవిపిశాచమ! న న్నింత గాసి జేయ
వృథగ నీ కేమిహానిఁ గావించినాను?
గౌరవైశ్వర్యములతోడఁ గాంతఁగూడఁ
గావలసివచ్చెనే నీకు? కలుషహృదయ! ౮౮

[పటపరివర్తనము]

---

షష్ఠాంకము సమాప్తము.

---

# భోజకాళిదాసు.

## సప్తమాంకము.

### 1. రంగము—రాజవీధి.

ప్రవేశము — విలాసుఁడు.

విలా—(చేయి ఫాలమున కష్టముఁ బెట్టుకొని చూచుచు) (అనుబంధము 10) ఓహో! ఏమి యీధారానగరమునందలి కోలాహలము!

గీ॥ కంచుచెంబులోపలి గచ్చకాయలట్లు
ఎండలోపలఁ దిరుగుతూనీఁగలట్లు
ప్రవిమలం బైన ధారాపురంబునందుఁ
దిరుగుచున్నారు పౌరులు తీవ్రగతిని. లగ

అంతఃపురపరిచారిక యగు తరంగవతి యిట్లు వచ్చుచున్నది. దీనివలనఁ గొన్నివిశేషములు తెలియవచ్చును.

(తరంగవతి ప్రవేశము.)

తరం—(స్వగతము) అమ్మయ్యా! ఇప్పటికి నామనస్సంశయమును, మనోభారమునుఁగూడ తీఱిపోయినవి. కాని, యింతటిసాధ్వీత్వముం బ్రదర్శించిన యిల్లాలిపై నోటికి వచ్చినన్ని యనృతములాడినందులకు నన్నుమాత్ర మాయమధర్మరాజు పరలోకమునందు క్షమింపఁడు.

విలా—ఓసీ! తరంగవతీ! తరంగవతీ! ఏమిది? మహాసంరంభమున నరుగుచున్నావు! ఒక్కనిమిషము, మార్గమున, నిలువనైన నిలువలేవా?

తరం—మా కీదినమున తీరికయుండు నని నమ్మితివా? చూడలేదా, రాజదివాణమంతయు నెంతకోలాహలముగ నున్నదో!

విలా—ఆవిశేషముం దెలియవలయు ననియే నిన్ను నిలిపితిని! ఈకోలాహలమున కేమి కారణము?

తరం—అయ్యో! మందమతీ! పురమునందలి యశేషజను లీసంరంభమును గాంచి గుములుగూడి చిత్రవిచిత్రరీతుల సంభాషించు టేమి? నీ వింకను సంగతినే యెఱుఁగకుండు టేమి?

విలా—నేను గ్రామాంతరమున కరిగి, యొకగంటక్రిందటనే వచ్చితిని. అందుచేత నా కీవిచిత్రోదంత మేమియుఁ దెలియదు.

తరం—అట్లయిన క్లుప్తముగఁ జెప్పెదను వినుము. నా కావల పని యున్నది. పోవలయును. ఈనడుమ, నెవ్వరో కాని యాస్థాన కవీశ్వరులలో నగ్రగణ్యుఁ డగు కాళిదాసునకును, మహారాణికిని చెప్పరానిసంబంధము గలదని ప్రవాదము గల్పించిరి.

విలా—హరిహరీ! ఇంతటిపాపపుమాటాడుట కెవ్వరికి నాల్కయాడెను?

తరం—దాని నట్లుండ నిమ్ము. అనంతరవృత్తాంతమును వినుము. దానిపై రాజేంద్రున కపరిమిత మగు నాగ్రహము గల్గి కాళిదాసును దేశత్యాగమొనర్ప శాసించి రాణియుం దనుగ్రహము తప్పి చరింపఁదొడఁగెను. రాణి, యీసంగతి నెఱింగి, వ్యాధిగ్రస్త యయ్యెను. ఆసాధ్వి తనపై నున్నప్రవాదముం దొలఁగించుకొనఁ గృతనిశ్చయురాలై తనసాధ్వీత్వముం బరీక్షింప రాజేంద్రుని వేడుకొనెను! ఆపరీక్ష యిప్పు డిప్పుడే రాజమందిరమున జఱిగినది.

విలా—ఎట్లెట్లు? దానిఫలిత మెట్లు పరిణమించినది? ఏమైనది?

తరం—తొందరపడకుము. చెప్పుచున్నాను. రాణి విషముం గ్రక్కు కాలసర్పమును తన యొడిలోఁ జేర్చుకొనెను. ఆసర్పమామెయొడలినిండఁ బ్రాకెనే కాని, యొక్క కాటైనను వేయలేదు. తరువాత కణకణ మని యెఱ్ఱగాఁ గాలుచున్న పెద్ద యినుపగుండును గౌఁగిలించుకొనెను. కాని, యామె కపాయ మేమియుఁ గలుగలేదు. రావణవధానంతర మగ్నిప్రవేశపరీక్ష చేయఁబడినసీతాపిరాట్టివలె నాసాధ్వీమతల్లి చెక్కుచెదర దయ్యెను. పిదప నామెను తీవ్రశరంబులచేఁ గొట్టినను నవి పుష్పహారములుగా మాఱిపోయెను. ఈచిత్రమును ఆబాలగోపాలమును జెప్పుకొనుచున్నారు.

విలా—ఆహాహా! ఎంతధన్యురాలు మహారాణి! తరంగవతీ! ఇట్టిసాధ్వీమతల్లు లీకలియుగంబున నయినను నుండుటచేతనే జగము మునుంగక యున్నది సుమా!

సీ॥ అంతకు వెఱపించి కాంతునిప్రాణంబు
లక్కజంబుగఁ దెచ్చె నొక్కసాధ్వి;
ముమ్మూర్తులను దనముద్దుబిడ్డలుగాఁగ
నొనరించి పాలిచ్చె నొక్కలేమ;
అడవిలోనఁ గిరాతు నడలించి క్షణములో
నుక్కడఁగించెఁ దా నొక్కకాంత;
భర్తృజీవములు గావఁగ బూని సప్తాశ్వు
నాగి మింట నరికట్టె నొక్కరామ;
యని పురాణంబులను విను టంతె కాని,
కాంచనైతి మీరీతి యక్కజము నెందు,
భళిరె! కలికాలమునఁగూడ పరమసాధ్వు
లుండుటనె విలయంబు రాకున్న దిఁక. ౯౦

తరం—నీ వనినమాట నిజము.

విలా—నీ విప్రుఁ డరుగునది రాజమందిరమునకేనా?

తరం—ఔను.

విలా—అట్లయిన నేను నీతో వచ్చెదను. ఆపరమసాధ్వీమణివదన సందర్శనముననైన పాపపరిహారము కాఁగలదు.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

[పట పరివర్తనము.]

## 2. రంగము—విలాసవతి మందిరము.

(ప్రవేశము—కాళిదాసు - విలాసవతి.)

విలా—ఆర్యా! తమ కీవిశేషము తెలిసెనా?

కాళి—విషయ మేమో తెలుపక; "తెలిసెనా" యన్నంతమాత్రమున తెలిసికొనుటకు నేను దైవజ్ఞుఁడను గాను గదా!

విలా—అమావాస్యను పూర్ణిమ యని పలికి రేయియంతయు పండువెన్నెలం గాయించిన, మీదైవజ్ఞత్వమును జగమంతయు నెఱుంగవలెఁగాక! యల్పజ్ఞ నగు నాకొక్కతె కేమి తెలియును?

కాళి—నాదైవజ్ఞత్వముమాట యట్లున్నను నీకడుపులో నున్న యిప్పటివిశేషముమాత్ర మశేషముగా నీ వెఱింగినదే యై యుండును. కనుక విశేషముగ నన్ను బాధింపక యది యేమో తెల్పివేయుము!

విలా—మఱి యేమంత పెద్దవిశేషము గాదు. అనుకొన్నంతయైనది.

కాళి—మఱల నాదైవజ్ఞత్వముం బరీక్షించుచున్నావు! ఏ మనుకొంటివి! ఏమైనది?

విలా—మహారాజు, నిష్కారణముగ, తమపై నారోపించిననిందకుఁ బశ్చాత్తాపపడకపోఁ డని యనుకొంటిమి. అది యన్యథా జరిగినది!

కాళి—(ఉత్సాహముతో) ఆఁ! ఆఁ!! ఇది నిజమా! నీ కెవ్వరు చెప్పిరి?

విలా—పురమంతయు నట్లనుకొనుచున్నారు.

కాళి—ఏమనుకొనుచున్నారు? విస్తరముగ నెఱిఁగింపుము!

విలా—మహారాజాదినమున, తమ్ము పురము విడువ శాసించినపిదప లీలావతీదేవి మహారాజు తమ్ముఁ గావించిననిందాపరిభాషణము సహింపనోపక వ్యాధిగ్రస్తయై తమ్ము పరామర్శింప వచ్చినరాజేంద్రునితోడ తనసాధ్వీత్వమును బరీక్షించుకొమ్మని దృఢస్వరంబునఁ బలుకుటయు—

కాళి—ఔనౌను. నే నీవృత్తాంతమును పౌరులసంభాషణవలనఁ దెలిసికొంటిని. సతీత్వపరీక్షయును దామె చక్కగా నుత్తీర్ణురాలయ్యె నని సయితము వింటిని. పిమ్మట నేమి జరిగినది?

విలా—పిమ్మట రాజేంద్రుఁడు మిమ్ము నిందించినందులకు హృదయమున బశ్చాత్తాపమునొంది వెదకించుచుండె నని వింటిని.

కాళి—తొందరపాటునందు స్వభావముగలవారికి తుదకుఁ గల్గు ఫలితము పశ్చాత్తాపమే కదా!

విలా—నాయింటనే తమరు నిగూఢస్థితి నున్నవిషయము నారాజేంద్రుఁ డెఱుఁగఁడు.

కాళి—ఇప్పటిస్థితియందు నీవు స్వయముగా నరిగి, నాయునికి నెఱిఁగింతువేని, నీకు మంచిబహుమానము లభింపఁగల దని నా యూహ.

విలా—నాకు రాజేంద్రుఁ డనుగ్రహించి బహుమానమే ప్రాప్తింపఁ జేయునో - యాగ్రహించి యవమానమే ప్రాప్తింపఁజేయు

నో దానిం దరువాత చూచుకొనవచ్చును. కాని నా దొక చిన్నముద్దు గలదు; తీర్చెదరా?

(అనుబంధము 11)

కాళి—నీముద్దులు తీరని వేళయొకటిగలదా? సెలవిమ్ము.

విలా—(ఒకచీటినిఁ జూపి) నాచెలికత్తెయొకతె నన్నోడింపఁ బంతముఁ బూని యీసమస్య యిచ్చినది. మీవంటిమహాపండితశిఖామణిప్రాపకము కల్గియుండఁగా తక్కువయే మని నేనును పందెమునకు సమ్మతించితిని. దీనిం జిత్తగింపుఁడు!

కాళి—(చదువును)

శ్లో॥ "కుసుమే కుసుమోత్పత్తి
శ్రూయతే నచ దృశ్యతే॥-"*

(నవ్వి) ఇదియేకదా ఘనమగుసమస్య! దీనిం బూరింపవలయునా?

విలా—ఘనపండితుల కిదియెన్నఁడును ఘనమైనది కాదు కాని— మీవంటివారి కిదియే ఘనమైనదిగదా!

కాళి—సరే! అట్లయిన, నీసమస్యాపూరణమును నీ సఖి కెఱింగించి పందెముగెలుతువుగాక!

శ్లో॥ "బాలే! తవముఖాంభోజే
దృష్ట మిందీవరద్వయమ్"॥ * ౯౧

విలా—(కాళిదాసును ముద్దిడుకొని) తమ రీసమస్యాపరిపూర్తి నొనరించుటచేత నాకీరాజ్యపరిపాలనము నొనరించినంత బ్రహ్మానందము గలిగినది.

---

* గీ॥ కుసుమమందున నొండొకకుసుమ మవని
జననమందుట వినుటయే కనఁగలేదు;
బాలరో! త్వన్ముఖం బనుపద్మమందు
చూపు లను నల్లకల్వలజోడు వెలసె! ౯౨

కాళి—హాయిహాయి! ప్రేయసీ! ఏమినీచుంబనమునందలి సుఖపారవశ్యము!

చ॥ మధురరుచిం దలంపఁగ సమానమలభ్యతరామృతంబుఁ గే
ల్వృథ యనిపించి స్వర్గపురవీథుల నాత్మ లయింపఁ జేసె నీ
యధరసుధారసంబు; తనివారఁగ దీనినిఁ ద్రావుపిమ్మటన్
బుధపురిఁ జేరుటొక్కటియె పో తుదికోరిక నాకు భామినీ! ౯౩

విలా—హరిహరీ! ఇదేటియుల్లలము! కర్ణకఠోరమై తోఁచెను!

కాళి—వెఱ్ఱిదానా! ఇదియా కర్ణకఠోర మగు నల్లలము?

గీ॥ పుట్టు వొందుట యాజీవి గిట్టుకొఱకె
ఛాయపోలిక మరణంబు పాయ దెపుడు
మానవుని వెంట నంటి యేమరక తిరుగు
పొంచి కాలము దీరఁ గ్రసించుకొఱకు. ౯౪

నాకన్నుల కిప్పుడు నిద్రవచ్చుచున్నది. మెల్లమెల్లన పాదము లొత్తుచుండుము. ఇందే శయనించి నిద్రించెదఁగాక!

విలా—భాగ్యము! (పాదము లొత్తుచుండఁగాఁ గాళిదాసు నిద్రించుచుండును) (స్వగతము) భోజమహారాజు కాళిదాసు నరయు తలంపున నీసమస్య నిచ్చి దీని బూరించినవారికి అర్ధరాజ్యము నొసంగెద నని చాటించెను. భోజరాజేంద్రునిమనోగతాను సారంబుగ నీసమస్యను పూరింపఁగలఘనుఁడొక్క కాళిదాసే యనుట నిశ్చయము! ఎట్లో మాయోపాయంబున సమస్యాపూర్తి యగున ట్లొనరించితిని. ఇది కాళిదాసకృతమే యగుటం జేసి తప్పక భోజరాజీసమస్యాపూరణముం గని యానందించును. ఐన, నిప్పుడు నాకర్తవ్య మేమి?

సీ॥ ప్రకటింతునా? యర్ధరాజ్యదానచరిత్ర
మీకవిసింహున కెలమి మీర
ఎఱిఁగింతునా? ధరణీంద్రున కిప్పుడే
కాళిదాసుం డిందు గలఁ డటంచు

ఇప్పింతునా? రాష్ట్రమొప్పుగా సగపాలు
కవికి నన్నాతఁడు కరుణఁజూడ
ఆనందమునుఁ గూర్తునా? కాళిదాసును
గాంచనెంచినధరాకాంతుమదికి
ఇంపుగా నీసమస్య పూరింపఁబడియె
నిప్పటికిఁ దీరె నామనోభీష్టమెల్ల;
అర్థరాజ్యము నాకరమందుఁ బడఁగ
వేఁచియున్నది, యేమి గావించుదాన? గీ

(ఆలోచించి) ఛీ! ఛీ! ఇప్పుడు నేను గావించినయాలోచనం బెల్ల ననాలోచితమే! అశ్రమంబుగఁ జేఁజిక్కనున్న రాజ్యంబునకుఁ గాళిదాసు నేల భాగహారిం గావింపవలె? రమణి నైన నేమి? ఈయర్థరాజ్యముం బరిపాలింపఁజాలనా? పూర్వకాలంబున నెందఱు కాంతలు భూపరిపాలనం బొనరింపలేదు!..... కాని యిందులకు నా కొక్కయాటంకమామాత్రము కనంబడుచున్నది. అది యీకాళిదాసునిజీవనమే! ఈతఁడు బ్రదికియుండిన నా కెన్నటికైనను ముప్పుగలుగక తీరదు. మీఁదు మిక్కిలి నేను రాజేంద్రునిమోసగించిన మహాపరాధంబునకు బాలగుదును. ఇందుల కేది యుపాయము?...... ఉపాయమున కేమున్నది? కాళిదాసుఁడు రాజగర్హితుండైన పిదప నాయింట నున్నవృత్తాంతము నాకును భగవంతునకును దప్ప మనుష్యమాత్రులకుఁ దెలియదుగదా! రాజు తన్నుఁ గావించినపరాభవంబున కోర్వఁజాలక కాళిదాసుఁడు దేశత్యాగమో దేహత్యాగమో కావించె నని కదా యిప్పటి వఱకును బ్రజలతలంపు. అది యట్లేయుండుఁగాక! కాళిదాసును కాళికాంబికకు బలిగా నిచ్చి సమస్యను నేనే పూరించితి నని రాజును నమ్మించి నిరపాయకరంబుగ నిరాటంకముగ నర్థరాజ్యము నేలుకొందునా?......హరిహరీ! నా కెట్టికట్టడితలంపు గలిగె! ఇట్టిజగత్పూజ్యుఁ డగు మహాకవిప్రాణములం దీయ సాహసించితి నే! ఇంతకన్న దుష్కృత్యము - ఇంతకన్న జననిందా

కరకార్యము - ఇంతకన్న నవమానపము - మఱియొకటి కలదా! నాకీసుపాలనభాగ్యముఁ జేయుచు ప్రకృతి గావించెను? 'భోజరాజేంద్రుఁడు నన్నవమానించెను; దేశత్యాగినై పోవుచుంటి' నని పలికినంతమాత్రమున నీతని వీడలేకగదా రహస్యముగ నింతవఱకు నాయింటనే దాఁచియుంచితిని. రాజ్యలాభదురాకాంక్షచే నింతటివిశ్వాసఘాతుకృత్యమొనరింప మనంబున తెగించుట యుక్తమా? వేయిజన్మంబు లెత్తినను నిట్టిరసికశేఖరుని నేను గణించుకొందునే? ఇందులకే కాఁబోలును పెద్దలు స్త్రీబుద్ధి ప్రళయాంకరమని చెప్పుదురు!

చ॥ ఒకదెస పాపభీతి మఱియొక్కదెసన్ ఘనరాజ్యకాంక్ష న
న్నొకపరి రెండువంకలకు నూఁపుచు నున్నవి; సత్యవృత్తముం
బ్రకటముఁ జేసి సద్యశ మపారముగా గణియించుకొందునో
కటకట! దుర్యశం బయినఁగాని ధరాధరణంబుఁ గాంతునో?

ఛీ! ఏమి నాబుద్ధిమాంద్యము! నేను వెలకాంతనుగాని కులకాంతను గానుగదా! ఈధర్మాధర్మవిచారము నాకేటికి? అధర్మప్రవర్తనమునందలి దోషము నాకుఁ గల్గియున్నయెడల నాకీవేశ్యావృత్తి నేల విధి విధియించును? ధనకాంతనగు నాకు ధనమే ప్రధానధర్మము! కులధర్మనిర్వహణమేకదా సర్వమానవోచితసత్కర్మానుష్ఠానము! కాళిదాసు నాకేటి చుట్టము? ఇట్టిరసికుల నెందఱిం జూచితినో, ఎందఱిం జూడ నుంటినో పరిమితిగలదా? వేశ్యల యనురాగంబంతయు బహిఃప్రవర్తనమునందే కాని యంతరంగముననయిత మనుష్ఠింపదగినదియా?............ కాదు. నిజమే! కాని రాజ్యలాభముకొఱకై కాళిదాసుం గడతేర్చుటకన్న వేఱొకమార్గాంతరముగలదా? ఇప్పుడు నేను తన కొనరించిన యుపకారమునకుఁ దోడుగా "ఈకార్యమిట్టిది; నాకు రాజ్యకాంక్ష గలదు; నీవు వదలుకొ" మ్మని నే నీకవీంద్రుని నిర్బంధించినచో తనకు రానున్న రాజ్యభాగము నీతఁడు విడువవచ్చును. నిశ్చయ

కాలుజాఱినయంతకు గాని పనిగ
నోరుజాఱితిగద! మించ నొవ్వనాడి,
కోలుపోయితి పరమయోగ్యుని కవీంద్రు
పూసరంబును ఫణి యని మోసపోతి. ౯౮

బుద్ధి—మహారాజా! చర్వితచర్వణం బగు నీవిచారము కేవలము వ్యర్థము! అదిగాక కాళిదాసునునికి నెఱుంగుటకై తమరు పంపినసమస్య కొంతపనిచేయక పోవునా?

భోజ—బుద్ధిసాగరా! అతఁడిప్పటికి జీవించియుండినఁగదా, నాసమస్య పనిచేయుట! అభిమాని యగు నాతఁ డవమానదుఃఖమున మరణించియే యుండిన నప్పు డేదిగతి?

బుద్ధి—రాజచూడామణీ! ఆత్మహత్య మహాపాపం బనియెఱింగియు నాతఁ డట్టిహీనకృత్యంబున కనుమతించు నని నాకుఁ దోఁచదు.

భోజ—అవమానదుఃఖము యుక్తాయుక్తముల నెంచనీయదుగదా!

(సేవకుఁడు ప్రవేశము.)

సేవ—అవధారు. మహారాజేంద్రా!

భోజ—ఏమిరా విశేషము?

సేవ—స్వామీ! ఎవ్వతెయో వేశ్యయఁట! కవయిత్రి యఁట! తమ దర్శనము చేయఁగోరుచున్నది!

భోజ—రానిమ్ము; అభ్యంతరమేమి?

సేవ—మహాప్రసాదము (నిష్క్రమి)

భోజ—బుద్ధిసాగరా! ఈయువతి యెవ్వతెయై యుండునో? మన మీయాఁడుదానితో-అందు వేశ్యతో-సంభాషించుట యంత యుక్తముగ నుండునా?

బుద్ధి—నిరంకుశప్రభువు లగు తమ కాటంక ముండునా?

(విలాసవతి ప్రవేశము.)

విలా—మహారాజచూడామణీ! అనేకనమస్కారములు!

భోజ—(స్వగతము) ఎవ్వతెయో యని భావించితిని. నాకును గాళి దాసునకును గూడ సంబంధముగల విలాసవతీనామధేయ యగు వేశ్యయే కాదా యిది! (ప్రకా.) విలాసవతీ! నన్ను చూడఁ గోరినది నీవేనా?

విలా—చిత్తము ప్రభూ!

భోజ—కవయిత్రి నని కబురంపితివే! ఈనడుమ నేమైన నభ్యసించితివా యేమి?

విలా—ప్రభువువారిమంగళప్రద మగు వదనబింబసందర్శనమాత్రముననే, ఎట్టివిద్యావిహీనులైనను కవిత్వముం జెప్పఁగలిగినవారగుచుండఁగా, దేవరవారిదాసి కంతమాత్రపుకవితాధారయే కలుగకుండునా?

భోజ—మంచిది. నీరాకకుఁ గారణ మేమి?

విలా—దేవా! పూరించినయెడల నర్ధరాజ్యము బహుమానము చేయుదు మని తమరు పంపినసమస్యను నేను పూరించి తెచ్చితిని.

భోజ—మారాజ్యమునందు, స్త్రీలు సయితము కవనముఁ జెప్పఁగల వారైనయెడల మాకు బ్రహ్మానంద మే! ఆకాగిత మేది?

విలా—(ఇచ్చును)

భోజ—బుద్ధిసాగరా! చదువుము.

బుద్ధి—(చదువును)

"శ్లో॥ కుసుమే కుసుమోత్పత్తి శ్శ్రూయతే నచ దృశ్యతే,
రాజే తవ ముఖాంభోజే దృష్ట మిందీవరద్వయమ్."

భోజ—(విని తలపంకించి) బుద్ధిసాగరా! ఆపత్రిక నిటు దెమ్ము.

బుద్ధి—(ఇచ్చును)

భోజ—(సాలోచనముగ చాలసేపు పఠించి, తలపంకించి, ఆగ్రహముతో తటాలున కత్తిలాగి) ఓసీ! మాయలాడీ! ఈసమస్యాపూర్తియందలి నిగూఢతంత్రరహస్యమును నే నెఱుంగుదును. కాళిదాసు నేమి చేసితివి? చెప్పెదవా? చంపనా?

విలా—(తత్తరపడుచు) రాజేంద్రా! నాకు-నాకు- నేను కాళిదాసు వృత్తాంత మేమి యెఱుఁగుదును?

భోజ—ఛీ! కలుగాకీ! హంతకీ! ఎందులకు నాతో ననృతము లాడెదవు? నా కీమాత్రపురహస్యభేదనశక్తి లే దనుకొంటివా?

మ॥ పలువాదంబు లిఁకేల నోఖలమతీ! పాపిష్ఠ! యోపాంసులా,
కలువా! నీదుచమత్కృతుల్ మదనసౌభాగ్యంబునంగాక యీ
విలసద్రాజసభాస్థలంబునను గావింపంగ రాణించునే?
యలుకం గల్పనసేయకే పలుకు సత్యంబైన వృత్తాంతమున్.

అట్లుగా దని లేనిపోని యార్భాటము చేసితివా ఇదే కరవాలము!

బుద్ధి—రాజేంద్రా! ఇందలిరహస్య మేమి?

భోజ—ఈసమస్యాపరిపూర్తియందలి కవితారసము మహాకవి యగు కాళిదాసునకుఁ గాక యన్యులకు లభ్యము కా దని నేను బాగుగ నెఱుంగుదును. అదిగాక, యిందలి తృతీయచరణారంభమున, "రాజన్" అనుటకు మాఱుగా "రాజే" యను దుశ్శబ్దము ప్రయోగింపఁబడినది. ఇట్టిదోషము నేమాత్రము స్వల్పపాండితిగలవాఁడైనఁ జేయఁడు. అందుచే నిది తప్పక భాషాపాండితిలేనిమూఢులచే దిద్దఁబడిన కాళిదాసకృతంబగు శ్లోక మని నిశ్చయం బగుచున్నది.

గీ॥ అర్థరాజ్యము లభియించు నాశఁజేసి,
మూఢతనుఁ గాళిదాసును మోసగించి,

యీసమస్యను బూ_ర్తిచేయించి తెచ్చి
పాపముల నాడుచున్న దీ వనుపుమండ. ౧౦౦

బుద్ధి—ఓసీ! మహారాజున కాగ్రహముఁ దెప్పింపక నిజము నెఱిఁగిం పుము! కాళిదాసు నేమి చేసితివి?

విలా—మహాప్రభూ! మీపాదములయాన! నే నేమియు నెఱుంగను. రాజభటులు లీపత్రికను బంచిపెట్టుచుండఁగా పోనీ ప్రియత్నింత మని దీనిని రచించితిని. అన్నిరాజ్యము లేకున్నమానె! నన్ను ప్రాణములతో వదలుఁడు. పోయి నాబ్రతుకు దెరువు చూచు కొందును.

భోజ—ఏమీ? పోనీ ప్రియత్నింత మని నీవు తలఁచినంతమాత్రమున నాసమస్య నీకు రచనాసాధ్య మయ్యెనుగా! దిగ్వేదండముల వంటి నాయాస్థానకవీంద్రుల కెవ్వరికిని రాజ్యకాంక్ష లేకయే దీనిని పూరింపమాని రని తలంచితివా? వారి కెవ్వరికిని సాధ్య ముకాని సమస్య భోగమూత్తోత్తు వగు నీకుమాత్రము సాధ్య మయ్యెనా?

విలా—మహారాజా! ఊరక నన్ను తర్జనభర్జనములు చేసిన నే నే మని తమకుఁ బ్రత్యుత్తర మీయఁగలను? తమరు న న్నేమి చేసినను సరేకాని నే నేమాత్రమును కాళిదాసువృత్తాంత మెఱుంగను.

భోజ—(ఆగ్రహముతో) ఎఱుఁగవా? ఎఱుఁగవా?

విలా—ప్రభూ! ఎఱుఁగను.

భోజ—ఏమాత్రమును ఎఱుఁగవా?

విలా—అయ్యో! నాగ్రహచారకర్మమా!

భోజ—గ్రహచారకర్మము కాదు. కవిచారమర్మము! పాపాత్ము రాలా! నీమనస్సాక్షిగా వచింపుము! దీని కాళిదాసు కాదా పూరించినది!

విలా—కాళిదా సెప్పుడు పూరించెను? అతఁ డిప్పు డెక్కడ నున్నాఁడు? దేవరవా రాతని దేశభ్రష్టుని గావించి రని విని......

భోజ—ఛీ! అదియంతయు నిప్పు డేల? ఆతని నేమి చేసితివో చెప్పుము.

విలా—అయ్యో! ఆతఁడు పాప మవమానముచే దేశత్యాగియయ్యెనో దేహత్యాగియయ్యెనో...

భోజ—ఆఁ! అట్లు దాఁటికి రమ్ము. రాజ్యకాంక్షచే నీ వేమైన నాతని కుత్తుక నుత్తరించితివా?

విలా—(అదరిపడి) అమ్మయ్యో! అంతపనియే! రాజ్యకాంక్షయుండిన నుండునుగాక! ఆఁడుదానను ఆతని కుత్తుక నుత్తరింపఁగలనా?

భోజ—రాజ్యకాంక్ష కల దనుమాట నిజమేకదా! ఇఁక హత్యయు నిజమే! అట్లయిన నాతని నీ వెందైన దాఁచితివో కాక పరిమార్చితివో తెలుపునందాక నిన్ను విడుతు నని తలంపకుము.

విలా—అయ్యయో! ఎట్టిగ్రహచారవేళలో నిద్దురలేచితి నమ్మా!

భోజ—తప్పక నీ కిది గ్రహచారమే! కానిచో నీ కిట్టి దుశ్చింత కలుగదు.

విలా—అయ్యో! ఆఁడుదానను చంపుదురా? స్త్రీహత్యాదోషమే!

భోజ—(జుట్టుపట్టుకొని) స్త్రీహత్యకు వెనుదీయువాఁడను గాను. చెప్పుము; కాళిదాసు నేమిచేసితివో! చెప్పవేని నీ శిర మిప్పుడే రెండుతునక లగును.

విలా—అయ్యో! తప్పినట్లు లేదు. నాపాపము నేటితో బ్రద్దలైనది కాబోలును! నిజ మెఱిఁగింపనే వలయును.

భోజ—ఔను. నిజమే యెఱిఁగింపుము. కాళిదాసును చంపితివా?

విలా—చంపితిని; రాజేంద్రా! చంపితిని.

భోజ—(అదరిపడి) ఆఁ! ఆఁ!! చంపితివా! చంపితివా! హా! కవిచంద్రమా! (మూర్ఛ.)

విలా—(ఏడ్చుచు) హా! కవిసింహామా! దుష్టురాల నగు నాచే హత మారితివా?

బుద్ధి—ఓసీ! పాపినీ! ఎంతపని చేసితివే!

చ॥ పవలును రాత్రి యాకవినిఁ బాసిన చింతను దుఃఖమందు నీ
యవసిపుఁడిట్టివార్త విని యక్కట! జీవము దాల్చియుండునా?
శివశివ! యెంతదారుణము జేసితి హంతకి! రెండుప్రాణవా
యువులను మింగినావు! భువి నొందుటకై నరరూపసర్పమా!

భోజ—(లేచి) (అనుబంధము 12) హా! కవిసింహామా! కాళిదాసా! తుట్టతుద కొకయాఁడుదానిచే మరణింపు మని విధి నీనుదుట వ్రాసెనా?

చ॥ కవికులమౌళి! నీయశముఁ గాంచి మనంబున నోర్వలేక యా
దివిజధరాధనాయకుఁడు తెంపున నాత్మసభాంతరంబునం
దవిరళమౌ త్వదీయకవితామృతధారల నంపఁగోరి యీ
భువి భవదీయజీవితముఁ బూర్ణముసేయఁగఁ బోలు, నయ్యయో!

సీ॥ సురలోకసాహితీపరిషత్తునందు ని
న్నుంచి యధ్యక్షుఁ గావించి రేమొ,
కరుణసుంతయు లేక కనకగర్భుండు నూ
ఱేండ్లు నిండఁగ లిఖియించె నేమొ
శతపత్రమిత్రుని సత్పుత్రుఁ డొకచో న
కాలపాశమున నిన్గట్టె నేమొ
వలపొంది కాలయాపనకైన లేక స్వ
ర్వేశ్య లీగతినిఁ జంపించి రేమొ
కాక యుండిన యెడల నిష్కారణంబ
యుర్వి ననుఁ బాసిపోవ నెట్లోర్చితయ్య!
సురపురం బేమిగా ముందు జొచ్చితయ్య!
కవిజనశిరోవిభూష! శ్రీకాళిదాస! ౧౦౩

బుద్ధి—ప్రభుతిలకా! ఇది తమరు శోకింపఁదగినసమయము కాదు. ఏ మందు రేని కాళిదాసు మరణించిన యనతికాలముననే తమ ం

ను మరణముగలదనికదా చెప్పితిరి! ఇప్పటికే చాలకాలాతి
క్రమణమైన ట్లున్నది! తమ రింక భవిష్యత్కార్యవిధానముం
జూచుకొనవలసియున్నది.

భోజ—ఔను. అదియును నిజమే! హఠాన్మిత్రమరణవార్తాకర్ణనమున
నామతియంతయుఁ జెడిపోయినది! నాకొక్కమాఱు కాళిదా
సుమృతకళేబరమునైనఁజూపినఁగాని మనస్సు కుదుటబడదు.
నన్నటకుఁ గొనిపొండు.

బుద్ధి—ఓసీ! పాపినీ! కాళిదాసును వధించి యాకళేబరము నెందుంచి
తివో చూపుదువుగాక! ముందు నడువుము.

విలా—భాగ్యము.

[పటపరివర్తనము.]

2. రంగము — రాజసౌధము.

ప్రవేశము—కాళిదాసుశవమును ముందుంచుకొని భోజరాజు,
బుద్ధిసాగరుఁడు, లీలావతి, పరిజనులు.

బుద్ధి—రాజేంద్రా! మరణకాలము సమీపించెనని, తొందఱగా
తమరు రచించుచున్న చంపూరామాయణము పూర్తికా
లేదు.

భోజ—ఎంతవఱకు రచించితివి?

బుద్ధి—సుందరకాండము వఱకు.

భోజ—సరి! దాని నట్లేయుండనిమ్ము. అది యీజన్మమున నిఁక
పూర్తికాదు. నాకప్పుడే మరణచిహ్నములు తోఁచుచున్నవి!
శిరోబాధ తీవ్రగతి వేధించుచున్నది.

బుద్ధి—దేవరయాజ్ఞ. ఇంక నీసేవకున కానతియేమి?

భోజ—బుద్ధిసాగరుఁడవగు నీకు నేను చెప్పవలసిన దేమియున్నది?

చ॥ జనకునినాటనుండియును జాల హితంబుగ మాకు మంత్రివై
యనయము తోడునీడవయి, యాత్మహితంబును గోరు బోద్ధవై

జనకుఁడవై గురుండవయి సారెకు మిత్రుఁడవైన నీఋణం
బును నిఁకఁదీర్పఁజాలుట యమోఘము, కావునఁ జేతు వంజలిన్.

బుద్ధి—హా! మహారాజా! ఎట్టి పలుకులు నీనోట విను దురదృష్టము గల్గెను!

భోజ—అయ్యా! మీరు ప్రాజ్ఞులు. దుఃఖమున కిది సమయముగాదు. కావున నీ రెండుమాటలను సత్వరముగ నాలకింపుఁడు.

బుద్ధి—విధేయుఁడను.

భోజ—

ఉ॥ ఇంతి యమాయకత్వమున నెంతయుగోల; జగంపుమోసమా
వంత యెఱుంగఁజాలని మహాగుణజాల; పవిత్రశీల: నా
సంతతి పిన్నవారు ఖలజాలవిజృంభిత మీజగంబు; స
త్వాంతులు మీరు; తండ్రివలె సాకుఁడు రక్షణలేని దీనులన్.

బుద్ధి—హాహా! ఎట్టిమాటలు వినుటకు బ్రదికియున్నాఁడను.

లీలా—ఆర్యపుత్రా! మందభాగ్యురాలనగు నాకేమిగతి చెప్పి పోయెదరు?

భోజ—దేవీ! ప్రపంచమునందు, పతి ముందుగా మరణించిన సతుల కందఱకును పరమేశ్వరుఁ డేమిగతిచూపునో నీకును నదియే గతి! వన్నువేఱుగా నేల ప్రశ్నించెదవు?

సీ॥ చిరకాలముననుండి చేసిన చెల్మి నీ
మానసంబున నెప్పు మఱువఁబోకు;
కడు ప్రమాదమ్మునఁ గావించినట్టి నా
తప్పుల నెమ్మదిఁ దలఁపఁబోకు;
వెలఁది! నేఁబోయినవెన్క నీశ్వరుని సం
స్మరణంబు నెన్నఁడు మఱువఁబోకు;
ప్రతివత్సరంబు నాసుతులచేఁ దిలవారి
వదలించుటను పొరపడఁగఁ బోకు;

గీ॥ కాల వైపరీత్య కర్మంబుచే నిట్లు
కాలమరణమునకుఁ బాలుపడితి;
మానినీలలామ! మనకింకఁ బరలోక
మందె యగుఁ బునస్సమాగమంబు. ౧౦౬

లీలా—అక్కటక్కటా! నాదురదృష్టమున కేంతని విలపింతును!

చ॥ వరమహితస్వరూపులుఁ గృపాసహితాత్మకులైనయట్టి మీ
కరములమీఁదుగా మహినిఁ గాయము వాసెడు నంతభాగ్య మీ
తరుణికిఁ గల్గదయ్యెనుగదా! జగదీశ్వర! మాయచావు దు
ర్భరగతి నావిధాత యెటువ్రాసెను త్వాదృశ ఫాలమందునన్.

సీ॥ పతిసేవయనియెడు వ్రతముసే కాని నే
నితరంబులైన యేవ్రతము లెఱుఁగ;
కలలోననైన నిక్కపుఁ బ్రసంగమె కాని
యనృతప్రలాపంబు లాడియెఱుఁగ;
దైవచింతయు మీపదారవిందముల చిం
తయుఁ దక్క నితరచింతల నెఱుఁగ;
అన్యపూరుషుల నాయన్నదమ్ములుగ దం
డ్రిగఁ దప్ప నన్యంపురీతు లెఱుఁగ;
గీ॥ నట్టి లోకవిహితమైన నాబ్రతు కిట్టు
లమితహేయగతుల నంద నేల?
మానవేశ! నే సుమంగలినై చచ్చు
ప్రాప్త మబ్బదయ్యె పాపవిధిని. ౧౦౭

(తెరలో)

హా! మహారాజా! హా! దీనజనశరణ్యా? ఇన్నినాళ్ళు మమ్ముఁ గన్నబిడ్డలవోలెఁ గాపాడి, యిప్పు డెవ్వరి కప్పగించి పోయెదరు?

భోజ—బుద్ధిసాగరా! ఆ యాలాపం బెవ్వరిదై యుండునో కదా!

బుద్ధి—మహారాజా! తమ్ము కడసారి సందర్శించు నభిలాషంబున పౌరులు గుంపులుగాఁ గూడివచ్చి యావల నిలిచియున్నారు.

భోజ—నేను వారిని స్వయముగా నోదార్చెదను. తెరవంకఁ జూచి ఓహో! పౌరజానపదులారా! మీరునామరణంబునకై యెంతమాత్రమును చింతనందవలదు. ఏమందురేని.

చ॥ జననమునందుఁ బ్రాణులకుఁజమ్పుట నైజము; గాన నిత్యమా పనికి విచారమందు టది ప్రాజ్ఞులకుర్ విహితంబుగాదు ధారుణి సకలంబు ధార్మికనిరూఢి నేలితి నే విచారముం గనక సుఖంబుగా మృతినిఁగాంచెద నాకొఱ కేల చింతిలన్?

ఆ॥ చిరము మమ్ము భక్తి సేవించినారు నా
బుణము దీఱిపోయె నింతతోడ
మమ్ముఁగొల్చినట్లు మాసంతతినిఁగూడఁ
గొలిచి కీర్తినందవలయు నయ్య.

(తెరలో)

హా! హా! మహారాజా! ఇంక మేము దిక్కుమాలిన పక్షులమై పోవుదము గాఁబోలును.

భోజ—బుద్ధిసాగరా! నాయప్పగింతలన్నియు నైనవి. ఇంక నే నేది వచించినను జర్విత చర్వణమే కాని ఫలకారి కానేరదు. నాకు శిరోబాధ ప్రారంభమైనది. దీనిఁబట్టిచూడఁగా కాలముసమీపించెనని తోఁచుచున్నది. (కాళిదాసు కళేబరముం జూచి) హా! మిత్రమా!

సీ॥ జగతిలోపల మనచరితంబు లోకవి
ఖ్యాతంబుఁ జిత్రింబు నైనదంచు
నీవు నాయాస్థాననికటంబునందుండి
యుభయులకును గీర్తి నొసఁగితంచు
పణ్యకాంతా పాపభరకార్యమున నీదు
ప్రాణంబు లిహమును వదలెనంచు
తనూజ్మలమున నె మత్ప్రాణవాయువులు శా
శ్వతముగా ధరఁ బాసి చనియెనంచు

కవికొకండు దృశ్యకావ్యంబు రచియింప
నటులు తత్ప్రదర్శనం బొనర్ప
మనదుకీర్తికాంత మనియుండు నాచంద్ర
తారకంబుగాఁగ ధరణియందు. ౧౧౧

కావున నిఁక మనయాత్మలు నిర్విచారముగ ధరిత్రిఁ బాయ దగును. ఇఁక నాకు పరమేశ్వరభజనమే కర్తవ్యము.

పరమదయాకర! భవహర! శ్రీకర! పాపవిభంజన! శూలధరా!
పురహర! స్మరహర! దేవపరాత్పర! భూతకృపాధర! భూతవరా!
సురనరసన్నుత! సుభగజగన్నుత! సూరిజనస్తుత! సుజనహితా!
మరుధరణీతలమంగళచారణ! మహితవిచారణ! సుగుణగణా! ౧౧౨

(ప్రాణోత్క్రమణ మగును.)

బుద్ధి—మహారాజా! మహారాజా! మమ్ముఁ బాసిపోయితివా?

లీలా—హా! జీవితేశ్వరా! (మూర్ఛ)

(తెరలో)

హా! భూలోకమందారమా! మమ్ము శాశ్వతముగ ననాథులం జేసితివా! హా! భోజరాజేంద్రా!

బుద్ధి—(శోకముతో) గీ॥ పోయితే మమ్ముఁ బాసి యోభూమిపాల!
తరలితే! యర్థిలోకమందారభూజ!
తండ్రి నెడఁబాయు సుతుల నేదారిఁ జేసి
పోయితివి తండ్రి! గిరిభేదిపురముఁ జేర. ౧౧౩

(శారదాదేవి ప్రవేశము.)

శార—(స్వగతము) ఓహో! ఏమి యీవిచిత్ర సన్నివేశము!

ఉ॥ భోజధరాతలేంద్రుఁగని పోవఁగవచ్చినయంతలోన ని
స్తేజుని భోజునిన్ మృతినిజెందిన సత్కవిఁ గాళిదాసునిన్
భూజను లెల్ల దుఃఖమును బొందెడిరీతియుఁ గాంచనయ్యె నా
హా! జగదీశకల్పిత నియామక మెంతవిచిత్రమో కదా!

బుద్ధి—(శారదకు నమస్కరించి) ఓపుణ్యాత్మురాలా! భగవతీ! నీవు విపదంబుధిని మునిగిన మమ్ముద్ధరింప నరుదెంచిన సాక్షాచ్ఛారదాదేవ్యపరావతారముగా నాకన్యలకుఁ దోఁచుచున్నావు! మమ్ము రక్షింపుము! నీ కివే వందనశతంబులు!

శార—(ఆలోచించి) ఆహా! ఇదియంతయు స్త్రీసాహసఫలితమే కాని వేఱు కాదుగదా! ఇప్పు డేమి తలంచితిని! అదియును గాదు. ఇది పరమేశ్వరసంకల్పము! ఏ వేళ కేర్పడు నాఁ డేయే కార్యముల నొనరింపఁదలంచునో యాతని యొక్క సంకల్పమాత్రమున నట్లు జరిగినదియును! కానిచో, సామాన్యురాలైన నాయోగిమన మెట్లు గల్గును? నేను వచ్చినపనులకుఁ దగిన ఫలము గలుగుఁగాక! (కమండలూదకము గొని)

గీ॥ ఓ జగద్రక్షకా! మహామోహస్థితముగు
నీదు లీలచే నెల్ల నీమాయఁ దొలఁగఁజేసి
నల్లుతో రాజకూఁతుల నిల్లుఁ జేర్చి
లంక శ్రీకల్యాణ మిఁక జరుగఁదనర! ౧౧౭

(జలంబులు చల్లును)

భోజ-కాళి—(నిద్ర తేలినట్లు లేతురు)

భోజ—(కాళిదాసును గాంచి ముదమొంది) హా! మిత్రమా! ఏమి నాయదృష్టము! నేఁ డెంతటి సుదినము!

సీ॥ నేఁడుగా నాతండ్రి నిజమానపుత్రిసం
తుండయ్యె నిజార్యసత్తోషితాత్మ!
నేఁడుగా మాపూర్వరసికవరాంబ సల్పిన
పూజలు ఫలియించె పుణ్యమూర్తి!
నేఁడుగా భారతి, నిజమూర్తిఁ బుత్రికో
కము వాసి, యానందకలితయయ్యె!
నేఁడుగా నీయశం బేపుదీప్తులసాంద్ర
రజతదీప్తులచే రాణించె!

నేఁడు మత్కృతప్రాగ్భవానేక పాప
సంతతు లనంతములుగాగ సంతసమ్మొ
మరణమందిన నిన్ను నే మఱలఁ గంటి
కావ్యవిరచనామునిగణ్య! కవివరేణ్య! ౧౧౬

కాళి—(విస్మితుఁడై) ఏమి యీవిపరీతము! రాజచూడామణీ! నేను మరణించితినా! అట్లయిన పునర్జీవితుఁడ నైతిని?

భోజ—నీవే కాదు. నీవు మృతినందిన యనతికాలమునకే నేనును మరణించితిననియే జ్ఞాపకము! మన మిరువుర మొక్కసారియే పునర్జీవితుల మైతిమి. ఇదియే విస్మయావహము.

బుద్ధి—రాజ కవిరాజ శేఖరులారా! సాక్షాత్కరించిన యీ శారదాదేవి మహిమాబలంబున మీ రిరువురును మాకు లభించితిరి. ఇది మాపుణ్యము.

కాళి—(శారదను గుర్తించి) ఓహో! మూఢుఁడనై యుండిన నన్ను కవినిగా నొనరించిన నాతల్లియగు శారదాదేవిగా దా యీభగవతి! ఓజననీ! నమస్కారము.

ఉ॥ మున్నొకకాలమందు కడుమూఢతఁ జిక్కిన జన్మనాపి నా
కెన్నఁగ పూజితంబగు కవీశ్వరజన్మ నొసంగినావు నేఁ
డిన్నగరంబునందు గతియింపఁగ శాశ్వతజీవ మిచ్చి, నీ
పున్నముచేత వెండియును బ్రోచితి జన్మ నొసంగి మాతరో! ౧౧౭

ఇట్టి నీ కొక్క నమస్కృతిందక్క నొండేమి నొసరించి, మే మిరువురము నీ ఋణమును దీర్చుకొనఁగలము?

శార—కవిసార్వభౌమా! అంతయును జగదీశ్వరసంకల్పమే.

కాళి—అకారణదయాపరులగు మీవంటివారి కిదియే యలంకారము!

లీలా—(లేచి ఆనందముతో) అహాహా! ఎట్టి యానందదృశ్యముం గంటిని! మాంగల్యమా! దీర్ఘాయువు నందుము. ప్రాణేశా! అదృష్టముచే గర్వించు నీదాసురాలు నమస్కరించుచున్నది.

భోజ—దేవీ! నీయదృష్టమునకుం గారణభూతురాలైన యీశారదా దేవికి తొలుత నమస్కరింపుము.

లీలా—ఓ భగవతీ! మహాత్మురాల వగు నిన్నెఱుంగనిదాననైనను, మాకొఱకై యవతారమందిన శారదాదేవి వని నమస్కరించు చున్నాను.

శార—బిడ్డా! శాశ్వత సుమంగలీత్వము నందుము.

బుద్ధి—అమ్మా! ఈభగవతి, కాళిదాసకవీంద్రుని విధివిహితభార్య యగు శారదాదేవి! ఈమె యనుగ్రహముచేతనే యీపూజ్యుండు కవీంద్రుండయ్యెను. కాని విధివిపరీతముచేత...

లీలా—ఔను. ఆపుణ్యచరిత్రయును వింటిని. ఎంతటి సుదినము నేడు.

శార—అమ్మా! నీదివ్యమాంగల్యశక్తిచేత నీనాథుండు జీవించెను.

మ॥ మును, సావిత్రి పతివ్రతాప్రభావమున, సత్పుణ్యున్ మృతుఁ బ్రాణయుక్తుఁ జే
దిననాథాత్మజుచేఁ గనెన్ ధనదరాట్సన్నిధిఁ గన్న ప్రా
ణేశుఁ, డా వెంటనె యిట్టె నన్ను విడి నిర్దిష్టానె పురాణంబులం
దున నేఁ డాకన్యఁ గాంచె నీసుకృత్యంబున్ మునున్ లోకపూజ్యస్థితిన్.

లీలా—అమ్మా! ఆ సుగుణాలనగు నన్ను పెనజేయుటకు మీరెట్టిగాడ దలఁకాక, యిదియంతయు నిక్కముగా మీయందే యున్న యించుకొనఁదగినదమ్మా. మీపతివ్రతాప్రాబల్యమును, శాశ్వతబ్రహ్మచర్యమహత్త్వమును, సావిత్రిచరిత్రముంబోలె మాపతిజీవనములం బ్రసాదించుటయే కాక నాకును మాంగల్య ప్రదానంబొనరించెను.

శార—ఆజీవితమే వేఱయ్యెనుగదా! నాచరిత్రమునకు సావిత్రి చరిత్రముతో సాటియెక్కడిది?

లీలా—దేవీ! ఐహికసుఖానుభవప్రాప్తము తప్పినను, కల్యాణమునకు సాక్షిభూతులైన దేవబ్రాహ్మణులు వేఱుగా నెట్లు సౌఖ్య మీయఁగలరు?

(విలాసవతి తటాలున ప్రవేశించును)

విలా—(శారదాదేవిపాదములపైఁ బడి) అమ్మా! పాపాత్మురాలను, బ్రాహ్మణప్రాణహంత్రిని నాకు తరణోపాయము నెఱిఁగించి రక్షింపుము.

శార—విలాసవతీ! లెమ్ము. నీపశ్చాత్తాపము చేతను, సత్యప్రకటనము చేతను నీపాపములను బరమేశ్వరుఁడు పరిహరించి నిన్ననుగ్రహించును.

భోజ—ఓసీ! దుష్ట వేశ్యాపిశాచిని! రాజ్యకాంక్షచే కవీంద్రునిఁ జంపి యింతటివిపద్భ్రమం దెచ్చిన నీమొగము చూడఁ గూడదు.

శార—రాజేంద్రా! పశ్చాత్తప్తురాలైన యీయాగంతకను నీవును క్షమించుటయే యుక్తమైనది. ఏమనిన-

ఆ॥ "అఘము సలుపనట్టి యార్యులయెడఁ గల్గు
ప్రేమకన్న పాపభీతిచేత
చింతనొందువారిచిత్తము నాకు సం
ప్రీతికర" మటంచు శ్రీశుఁ డనఁడె? ౧౧౬

కాళి—ఓహో! దీనికంతటికిని కారణ మీవిలాసవతియా? ఔరా! ఎంతమోసము! ఎంతటినమ్మకమున జరిగినదియైనను క్రూరభుజంగికంబలె వేశ్యను విశ్వసింపరాదుగదా!

శార—పుణ్యాత్ములారా! చక్రవర్తిపర్వంబవ్రశస్తము! రాజేంద్రా! నీ కేమికావలయునో కోరుకొనుము!

భోజ—భగవతీ! నీదయచే మాకోరికలు నిరవశేషంబులయ్యెను. నాప్రాణమిత్రుఁడు నాకు లభించెను. ఇఁక జగన్మంగళం బగునట్లనుగ్రహింపుము.

మంగళమహాశ్రీ వృత్తము.

ధారుణిజనంబుల కధర్మగతి దూరమయి
ధార్మికవిచారము సతంబు మది నిండఁ

సారముగ నీపృథివి ♦ సస్యభరమై యెసఁగ,
జారులును చోరులును ♦ జాలనశియింపఁ
శ్రీరమణిచే జనులు ♦ శేషసుఖసంపదలఁ
జెందుచును సంపదల ♦ చే మోదమందఁగ,
మారజనకుండు ముద ♦ మారఁ గృపఁ గాంచుత ర
మాసహిత శీలుఁడయి ♦ మంగళమహా శ్రీ॥

శార—తథాస్తు.

కాళి—తథాస్తు.

(అనుబంధము 13)

(పటహరీ వర్ణనము)

గద్యము.

ఇది శ్రీభద్రాచల శ్రీసీతారామచంద్రకరుణాకటాక్షలబ్ధకవిత్వధారా
రసబంధురుండును, సోమరాజాన్వయపయఃపారావారసుధాకరుం
డును, కోదండరామ మహారాజ భాగ్యసమృద్ధిఫల పరీక్ష
మానుండును, భద్రాచలపురవాసియు నగు రామరా
జరాయకవిప్రణీతంబగు, అష్టాంకసమేత
శ్రీ భోజకాళిదాస నాటకంబున
అష్టమాంకము — సర్వంబును,
సంపూర్ణము.

# అనుబంధము.

### 1. శారద: బీఁ ఫలాస్ - తీఁ తాల్.

జనకా। గురుపాదా। సన్మతులగు మీకిదేటికోరిక॥ జన॥
మనమున నిజముగ। దలఁచి పలికెదరో। మరి - కాక నన్నిఁ
పరీక్షింతురో॥ జన॥
బాల్యమాది పుత్రికవలెఁజూచి। బహుతర విద్యావతిగనొనర్చి।
కల్యాణయుక్తనగు నాపయిసిటు। కాంక్షజెందఁదగునే శుభమగునే॥ జన॥

### 2. దొమ్మరులు: బ్యాండు - దాద్రా.

ఓరోరి లెండు। వేగ మెరండు। గాన్దిలదండు। నీసకు దెండు॥ ఓ॥
సారెకు బిడార్లు। సంతరింపగ పిండు। పయనంబులుగండు
పదపదమనుండు॥ ఓ॥

### 3. శారద: పూరికల్యాణి - తీఁ తాల్.

మంజుల మలయ సమీరచార హా। సౌందిర తలపరితోషే।
రంజితకుంజ విహారమత్త మరే। రఁదహార మృదుభాషే॥ మం॥
శరత్కాల పరిపూర్ణచంద్రికా। సంభృత నిర్మలయామే।
వరానంద తారా గణపూరణ। వర్ణితాంబర సుధామే॥ మం॥

### 4. విలాసకుఁడు: (కైసీమరంకీహై)

ఓసీ। జూదరీవతే। నే నెన్నఁడెఱుఁగ॥ నోసీ॥
నీసాటివారీ। లో సిగ్గుగాదే॥ ఓ॥
ఈరీతి నారులను నమ్మఁబోరు।
పేరూకు ప్రీతిగల్గు। ప్రియులు। నమ్ము। బోలువారు॥ ఓ॥

### 5. భోజరాజు: హిండోల్ - తీఁ తాల్.

ఇంతటి పరమాద్భుతంబు। నెన్నఁడుఁ గనఁగొనఁగనైతి॥ ఇం॥
వింతగ నమవస నిశీధి। వెలిగెను। పరిపూర్ణచంద్రుఁడు। ఇం॥
ధన్యుఁడవో కాళిదాసుఁడా। తావక మాహాత్మ్యము నేమందును।
అన్యులెవరు నీకుసాటి జగమున। నహో వేద। మహావాక్య
మయ్యెను॥ ఇం॥

6. భోజరాజు: బ్యాగ్ - తీన్ తాల్.

వాచాదోషము లేటికి మాటికి। వానినెల్ల ధృవకరుపగవలెగా॥ వా॥
ప్రాచీనవిరోధంబులకో నా।పరమపూజ్య దూషింపఁదగదుగా॥ వా॥
కాళిదాసు మన్న్యమానసభోజియు। కల్లుద్రాగువాడంచుఁ బల్కితివి।
శీలరహితుఁడంటివి నిదర్శనము। చెప్పినగతి గన్పుకుపంగలవా॥ వా॥

7. కాళిదాసు: ఏకిలా అనుమట్టు.

దైవమా। నృపుభోజుఁడు। బాపితే। పాపి॥ దైవ॥
కవబా।యకనే। కశరీ।రము రా। మనువా। రివహా॥ దైవ॥
శుభహారచరము।శ్లోకము జనువగ। శ్రీభి. పగననుగోరెను నరపతి।
సభను విభవమును। పుంమునువిడినే। నభయుండెగ నుండగ నిటు
వచ్చితి॥ దైవ॥

8. భోజరాజు: శ్రీరమూనునోహార అనుమట్టు.

కట్టిపెట్టు నీవు గుట్టుమట్టును దెలిసెన్। ధీదుష్కృత అలఅ॥ క॥
వట్టి వన్నె యేమ్నులేల పాసుల। కట్టివాయి పొలతుకవే చాలా।
నిట్టసిలుపునను జీల్చిచెద ను।న్నట్టి వాసనము బటకకుంటివా॥ క॥

9. భోజరాజు: సురట - తీన్ తాల్.

ఎంతెటి జాతినీవే। తుద। కేమియుందెలియునటు నటియించెద॥ వె॥
హాంతకారి యింత గొష్ఠులగు జగ।జంతలు గను వర్ధిల్లుమంటనే।
వింతగా నగ్గితేక బాలల। బంతయు ధగధగమండుచు నున్నది॥ ఎం॥
ఆకృతిసమార్చి యూకపిపిశాచ। మాడుమూడదెలు పుత్రికశియుణ।
నీకై గూఢముగా నమదొంచుట। నెఱుగుదు। నెఱుపురి। శిరములు
తెగిపడు॥ నెం॥

10. విలాసకుఁడు: బ్యాగ్ - తీన్ తాల్.

ఈవిలాసమును నెంతసిహొగడుదు। విది గన విపరీతము భళిరే॥ ఈ॥
పావనమగు ధా।రావరనగరము। బహుజన సంకులమగు నర రే॥ ఈ॥
ఒకరి పలుకులొక।రికి వినఁబడకా। ఒకరి రూపమొకరికిఁ గనఁబ
డకా। అకట వికటముగ। నతిసంభ్రమముగ। నటుల నిటుల దిరు
గుచుండరకా। అఅఅఅఅఅఅ॥ ఈ॥

పు : కేదారగౌళ - తీన్ తాల్.

మృదుమోహన । ముఖజితసోమా । రంజితకామా । ప్రేమ
ధామా॥ మృ॥
నీదర్శనంబె నాకు । నిఖిలానందంబగుగా । సదయా । హృద
యా । భ్యుదయా । మోదమూర నీను కోర్క । నాదరింతు
నెంతో చింతలారగ॥ మృ॥

(ఈ పాట 108 పేజీలోనిది. గమనింపవలెను.)

11. విలాసవతి : హిందోళ్ - జప్ తాల్.

ధైర్యవారాసివై । తనయుమా । హృదయుమా॥ ధై॥
శౌర్యగంభీర । వేషమునను చరింపుమా
కాళిదాసును శాతఖడ్గాగ్ని హరియించి ।
చాలగా నగ్గరాజ్యమును గయియింపుమా॥ ధై॥

12. భోజరాజు : ఘఖారి - దాద్రా.

విధి యీరీతిగ నేటికి । విపరీతం బైనుటించె ।
కథావశేషమయి కాళిదాసా । హాహా॥ విధి॥
జారిణియగు వేశ్యచేత । స్వప్రాణచయంబు వీడి ।
ధారుణి నెడబాసితె హితవర్యా । హా॥ విధి॥
భారతి నేటికి నవలంబనము వాసి దిక్కులేక ।
దీనదుఃఖమున మున్గ । వలసెను గద నిను । బాయుట॥ విధి॥

13. మంగళము : బ్యాండ్ - దాద్రా.

మంధరధర । మంగళకర మంగళంబురా॥ మం॥
మారసుందరా । శ్రీరమేశ పోవరా ।
దాసభరణదోషహరణ । దానవేశనాశా ।
రాజరాజేశ్వరా । యోగపరాత్పరా ।
శ్రీనివాస । జగదీశా ।
శ్రీరమానాయకా । జగన్నాయకా॥ మం॥